# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 24-7-2019 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :25 సంచిక: 261 పేజీలు 8 వెల: రూ.1/-


## గ్రామాలు పచ్చదనం, పరిశుభ్రతతో ఉండాలి..

హైదరాబాద్,జులై 23 : పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలపై సచివాలయంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సమీక్షలో మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ..గ్రామాలు పచ్చదనం, పరిశుభ్రతతో ఉండాలని అధికారులకు నిర్దేశించారు. హరితహారం విజయవంతం చేసిన గ్రామాలకు నిధుల కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. మొక్కల సంరక్షణ ఆధారంగానే పంచాయతీ భవనాలు, సీసీ రహదారులు మంజూరు చేస్తామన్నారు. ఉపాధి హామీ నిధుల వినియోగంలో మన రాష్ట్రం ముందుండాలని అధికారులకు సూచించారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు సదస్సులకు ఏర్పాట్లు చేయాలి. ప్రతీ గ్రామపంచాయతీలో వైకుంఠధామం కచ్చితంగా నిర్మించాలి. ఉపాధిహామీ పనులు గ్రామపంచాయతీ ఆమోదంతో జరగాలన్నారు.

# దుమారంలేపిన ట్రంప్ వ్యాఖ్యలు



**- ఇమ్రాన్‌తో భేటీలో కశ్మీర్ సమస్యపై మధ్యవర్తిత్వం వహిస్తాన్న ట్రంప్**
**- భారత్ ప్రధానికూడా తనను కోరారన్న అగ్రరాజ్య అధినేత**
**- ట్రంప్ వివాదాస్పద వ్యాఖ్యలపై మండిపడ్డ భారత్**
**- నష్టనివారణ చర్యలకు దిగిన అగ్రరాజ్యం**
**- కశ్మీర్ అంశం పూర్తిగా ద్వైపాక్షిక సమస్య..**
**- ఇరుదేశాలు చర్చల ద్వారానే సమస్య పరిష్కారమవుతుందని శ్వేతసౌదం వెల్లడి**
**- కశ్మీర్‌పై ట్రంప్ వ్యాఖ్యలతో లోక్‌సభలో రభస**
**- ప్రధాని నరేంద్రమోదీ సమాధానం చెప్పాలని ప్రతిపక్షాల డిమాండ్**
**- ట్రంప్‌ను మోదీ ఏమీ అడగలేదు**
**- రాజ్యసభలో విదేశాంగ మంత్రి జైశంకర్**

న్యూఢిల్లీ, జులై23(ఆర్ఎన్ఎ) : పాక్ ప్రధాని ఇమ్రాన్, అగ్రరాజ్య అధినేత ట్రంప్ సోమవారం భేటీ అయ్యారు. ఈ భేటీలో కశ్మీర్ సమస్యపై మధ్యవర్తిత్వం వహిస్తానని, భారత్ ప్రధాని కూడా తనను మధ్యవర్తిత్వం వహించాలని కోరాడని ట్రంప్ పేర్కొన్నారు. ట్రంప్ వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భారత్ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. దీంతో డొనాల్డ్ ట్రంప్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై ఆ దేశం దిద్దుబాటు చర్యలకు దిగింది. కశ్మీర్ అంశం పూర్తిగా ద్వైపాక్షిక సమస్య అని.. దీనిపై ఇరు దేశాలు చర్చల ద్వారా పరిష్కరించుకోదలిస్తే అమెరికా స్వాగతిస్తుందని శ్వేతసౌధంలో ఆదేశ అధికార ప్రతినిధి వెల్లడించారు. అలాగే ఉగ్రవాదంపై పాకిస్థాన్ తీసుకునే పటిష్ఠ చర్యల ఆధారంగానే ద్వైపాక్షిక చర్చలకు మార్గం సుగమం అవుతుందని అభిప్రాయపడ్డారు. ఆ దిశగా పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ హామీ ఇచ్చారని, అంతర్జాతీయ సమాజం సైతం ఆ దేశంపై ఆంక్షలు విధించిందన్నారు. భారత్–పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలను తగ్గించడానికి అమెరికా సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. ఇదిలాఉంటే భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రవీష్ కుమార్ మాట్లాడుతూ.. ట్రంప్‌తో భేటీ సందర్భంగా మోదీ కశ్మీర్ మధ్యవర్తిత్వంపై ఎలాంటి చర్చ జరపలేదని తెలిపారు. ట్రంప్ వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తమని స్పష్టం చేశారు. అలాగే అమెరికా కాంగ్రెస్ సభ్యులు సైతం ట్రంప్ వ్యాఖ్యల్ని తప్పుబట్టారు. ఈ విషయంలో ట్రంప్ తరఫున క్షమాపణలు కోరుతున్నామనడం గమనార్హం. ట్రంప్ వ్యాఖ్యలు భారత్–అమెరికా మధ్య సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందన్న నిపుణుల విశ్లేషణల నేపథ్యంలోనే అమెరికా మెత్తబడ్డట్లు తెలుస్తోంది.

### పార్లమెంట్‌లో దుమారం..

కశ్మీర్ సమస్యపై మధ్యవర్తిత్వం వహిస్తానని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు మంగళవారం పార్లమెంట్‌లో దుమారం రేపాయి. దీనిపై ప్రధాని మోదీ సమాధానం ఇవ్వాలని ప్రతిపక్షాలు పార్లమెంట్‌లో వాయిదా తీర్మానం కూడా ఇచ్చాయి. లోక్‌సభలో కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌదరీ మాట్లాడుతూ.. అమెరికా ముందు భారత్ దాసోహం అయ్యిందన్నారు. మనం బలహీనులం కాదు, దీనిపై ప్రధాని వివరణ ఇవ్వాలని అధిర్ డిమాండ్ చేశారు. అయితే జీరో అవర్‌లో దీని గురించి చర్చిద్దామని స్పీకర్ అన్నారు. విదేశాంగ మంత్రిత్వశాఖ దీనిపై ప్రకటన చేస్తుందని పార్లమెంటరీ వ్యవహారల శాఖ మంత్రి ప్రహ్లద్ జోషి తెలిపారు. కశ్మీర్ సమస్యను ఐక్యరాజ్యసమితి వరకు తీసుకు వెళ్లింది ఎవరో తెలుసు అని ఆయన పరోక్షంగా మాజీ ప్రధాని నెహ్రూపై ఆరోపణలు చేశారు. ఇది సీరియస్ అంశమని, ఇందులో రాజకీయాలు ఉండకూడదన్నారు. నిర్మాణాత్మకమైన చర్చ జరగాలని స్పీకర్ ఓం బిర్లా తెలిపారు. ట్రంప్ కామెంట్‌పై చర్చ చేపట్టాలని సీపీఐ ఎంపీ డీ రాజా రాజ్యసభలో నోటీసు ఇచ్చారు. మాజీ విదేశాంగ మంత్రి ఎస్ థరూర్ కూడా స్పందించారు. తానేమీ మాట్లాడుతున్నాడో ట్రంప్‌కు తెలియదని, బహుశా ఆయనకి సమస్య అర్థం కాలేదనుకుంటే, లేదా ఆయనకు సరిగా ఎవరూ చెప్పలేదనుకుంటనన్నారు. కశ్మీర్ సమస్యపై మధ్యవర్తి వద్దు అన్న విషయం మన విధానం అని, మధ్యవర్తి కోసం మోదీ మరొకర్ని ఆశ్రయించడం అసంభవమే అన్నారు. ఒకవేళ పాక్‌తో మాట్లాడాలని అనుకుంటే, నేరుగా మాట్లాడాలని శశిథరూర్ అన్నారు.

### ట్రంప్‌ను మోదీ అడగలేదు – విదేశాంగ మంత్రి జైశంకర్

కశ్మీర్ సమస్యపై మధ్యవర్తిత్వం వహించమని ట్రంప్‌ను మోదీ కోరలేదని సోమవారం విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ స్పష్టం చేశారు. రాజ్యసభలో ఈ అంశంపై ఆయన మాట్లాడారు. పాక్‌తో ఉన్న అన్ని సమస్యలను ద్వైపాక్షికంగానే చర్చిస్తామని మంత్రి తెలిపారు. సీమాతంర ఉగ్రవాదం నిలిపివేస్తేనే చర్చలు సాధ్యమన్నారు. ఇరు దేశాల మధ్య ఉన్న సమస్యలు సిమ్లా అగ్రిమెంట్, లాహోర్ డిక్లరేషన్ ప్రకారమే పరిష్కారం అవుతాయన్నారు. అయితే సభ్యుల నినాదాల మధ్య సభను 12గంటలకు వాయిదా వేశారు. కశ్మీర్ సమస్య జాతీయ అంశమని, జాతి ఐక్యతకు సంబంధించిన అంశంపై ఒకే గొంతు వినిపించాలని చైర్మన్ వెంకయ్యానాయుడు తెలిపారు.

## సుప్రీంలో ఆమ్రపాలి గ్రూప్‌కు ఎదురుదెబ్బ

**- కంపెనీ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని తీర్పు**
**- లావాదేవీలపై పూర్తిస్థాయి దర్యాప్తు చేయాలని ఈడీకి ఆదేశం**
**- 40వేల మంది ఆమ్రపాలి కస్టమర్లకు ఊరట**

హైదరాబాద్, జులై23(ఆంఎన్ఎ) : ఆమ్రపాలి గ్రూప్ ఆఫ్ కంపెనీస్‌కు సుప్రింకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. కంపెనీకి చెందిన రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని మంంగళవారం సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇండ్ల కోసం వేచి చూస్తున్న సుమారు 40వేల మందికి ఊరట కల్పిస్తూ సుప్రీం తీర్పునిచ్చింది. కంపెనీకి చెందిన రెరా రియల్ ఎస్టేట్ చట్టాన్ని రద్దు చేయాలని కోర్టు చెప్పింది. అనంపూర్ణంగా నిలిచిపోయిన నిర్మాణాలను పూర్తి చేసేందుకు నేషనల్ బిల్డింగ్స్ అండ్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్(ఎన్‌బీసీసీ)కి ఆదేశాలు ఇచ్చింది. కస్టమర్ల సొమ్మును దుర్వినియోగం చేసిన కేసులో ఆమ్రపాలి గ్రూపు ఓనర్లను మనీ ల్యాండరింగ్ కేసులో విచారించాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్‌ను కోర్టు ఆదేశించింది. ఆమ్రపాలి గ్రూప్ డైరెక్టర్లుగా ఉన్న అనిల్ కుమార్ శర్మ, శివ్ ప్రియం, అజయ్ కుమార్‌లు పోలీస్ కస్టడీలోనే ఉండాల్సిందిగా గతంలోనే అరుణ్ మిశ్రా, యూయూ లలిత్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ఆమ్రపాలి గ్రూప్ నుంచి దాదాపు 42,000 ప్లాట్లను కోరుతున్న గృహ కొనుగోలుదారుల్లో కొందరు వేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టు విచారణ చేపట్టింది. ఈ క్రమంలోనే గ్రూప్ డైరెక్టర్ల వ్యవహార శైలిని ధర్మాసనం తప్పుబట్టింది. ఆరు నెలల నుంచి మూడేండ్లలో ఆమ్రపాలి గ్రూప్‌లో నిలిచిన 15 రెసిడెన్షియల్ ప్రాజెక్టులను పూర్తిచేస్తామని, ఇందుకు రూ.8,500 కోట్ల వ్యయం అవుతుందని ఓ ప్రతిపాదననూ గతంలో ఎన్‌బీసీసీ కోర్టుకు సమర్పించింది. ఇక 2014 లోక్‌సభ ఎన్నికల అఫిడవిట్‌లో రూ.847 కోట్ల ఆస్తుల్ని ప్రకటించిన ఆమ్రపాలి గ్రూప్ సీఎండీ.. ఇప్పుడు రూ.67 కోట్ల ఆస్తులనే చెబుతుండటంపైనా సుప్రీం దృష్టి సారించింది. ఆమ్రపాలి గ్రూప్ ఆఫ్ కంపెనీలకు చెందిన లావాదేవీల వ్యవహారంపైనా పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలని ఈడీని సుప్రింకోర్టు ఆదేశించింది.

## కాశ్మీర్‌పై ట్రంప్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నా

### ప్రకటన చేసిన పాక్ ప్రధాని ఇమ్రాన్

వాషింగ్టన్,జులై23 (ఆర్ఎన్ఎ): కశ్మీర్ సమస్యను ద్వైపాక్షికంగా పరిష్కరించుకోలేమని పాకిస్థాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ అన్నారు. వివాదాస్పద కశ్మీర్ సమస్యపై మధ్యవర్తిత్వం వహించేందుకు సిద్ధంగా ఉన్నానని ట్రంప్ చేసిన వ్యాఖ్యలను పాక్ ప్రధాని స్వాగతించారు. అమెరికా వెళ్లిన ఇమ్రాన్.. అక్కడ ట్రంప్‌తో భేటీ అయ్యారు. ఆ సందర్భంలో కశ్మీర్ సమస్య గురించి మోదీ తనతో మాట్లాడారని, మధ్యవర్తిత్వం వహిస్తే బాగుంటుందని కోరారని ట్రంప్ అన్నారు. దీంతో ఇది సంచలనంగా మారింది. కశ్మీర్ సమస్యపై ఓ సందర్భంలో జనరల్ పర్వేజ్ ముష్రరఫ్, ప్రధాని వాజ్‌పేయి తీర్మానం చేసేందుకు అంగీకరించారని, కానీ ఆ తర్వాత రెండు దేశాలు దూరం దూరంగా ఉన్నాయని ఇమ్రాన్ అన్నారు. కశ్మీర్ సమస్య పరిష్కారంలో అమెరికా పెద్ద పాత్ర పోషిస్తుందని, ట్రంప్ పాత్ర మరీ విశేషంగా ఉంటుందని ఇమ్రాన్ తెలిపారు. 130 కోట్ల మందికి సంబంధించిన అంశాన్ని చర్చిస్తున్నామని, ఒకవేళ శాంతి కుదిరితే ఆ లాభాలే మరోలా ఉంటాయని ఇమ్రాన్ అన్నారు. భారత్ తన అణ్వాయుధ సమీకరణ నిలిపివేస్తే.. తాము కూడా ఆపేస్తామని ఇమ్రాన్ చెప్పారు. రెండు దేశాల మధ్య అణు యుద్ధం జరుగదని, అది స్వంత ధ్వంసమే అవుతు ందన్నారు. స్వాతంత్యం÷–ర వచ్చి 70 ఏళ్లు అవుతున్నా.. కశ్మీర్ సమస్య వల్ల నిజమైన నాగరికులుగా ఉండలేక పోతున్నామన్నారు.

## ప్రజారోగ్యం కోసం ప్రతీ ఏడాది రూ.6 వేల కోట్లు: ఈటల

హైదరాబాద్, జులై 23 : హైదరాబాద్ లోని తాజ్ కృష్ణ హోటల్ లో అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిషియన్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజిన్ ఆధ్వర్యంలో 18వ గ్లోబల్ హెల్త్ కేర్ సమ్మిట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు ఈటెల రాజేందర్, ఎర్రబెల్లి దయాకర్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఈటల మాట్లాడుతూ.. ప్రతి తెలంగాణ పౌరుడు గొప్పగా చెప్పుకునేలా ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారని అన్నారు.

ప్రజారోగ్యం కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రతి ఏడాది రూ.6 వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తోందని.. తెలంగాణ రాష్ట్రం దాదాపు 17 రంగాల్లో గొప్ప స్థానంలో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ , మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ తోపాటు పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

## చరిత్రలో నేటినిజం



కీ॥ ఆర్థర్ కాటన్ కి – వందన
"లార్థరు కాటను" రచించి ఆంధ్రావనికే
మూర్ధన్యుండై – ఘనుడై –
ప్రసిద్ధుడై చెలగినాడు ప్రజలందరిచేత!!

–రాధశ్రీ

( జులై 24 ఆర్థరు కాటన్ పుణ్యతిథి..)

సెల్: 9494481210

## పబ్లిక్ పార్కింగ్ సమస్యను ఎలా తీరుస్తారు: ఎంపీ ప్రభాకర్ రెడ్డి

హైదరాబాద్, జులై 23: మోటార్ వెహికిల్స్ సవరణ బిల్లుపై ఇవాళ లోక్‌సభలో టీఆర్ఎస్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడారు. కొన్ని కంపెనీలు 15 ఏళ్ల నుంచి ఉన్నా.. వాటి స్పేర్ పార్ట్స్ ఇంకా అందుబాటులో ఉండడం లేదన్నారు. నకిలీ స్పేర్‌పార్ట్స్‌ను నియంత్రించాలన్నారు. పట్టణాల్లో పార్కింగ్ పెద్ద సమస్యగా మారిందన్నారు. పబ్లిక్ పార్కింగ్ కోసం ప్రత్యేకంగా చేపట్టే చర్యల గురించి చెప్పాలన్నారు. డ్రైవింగ్ లైసెన్సుల జారీలో కఠిన నియమాలు పాటించాలని వైఎస్ఆర్‌సీపీ ఎంపీ కృష్ణదేవరాయులు తెలిపారు. మోటార్ బిల్లుకు మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు. మోటార్ బిల్లు బాగుందని, కానీ రాష్ట్రాల హక్కులను అది కాలరాస్తోందని డీఎంకే, తృణమూల్ పార్టీలు ఆరోపించాయి.

## హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయండి...



సూర్యాపేట, జులై 23:సూర్యపేట జిల్లాను బహిరంగ విసర్జన రహిత జిల్లాగా రూపుదిద్దుకునేలా ప్రకటించడం తో పాటు హరిత హారం కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అధికారులు శ్రద్ద చూపించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి పిలుపునిచ్చారు. హరితహారంపై సూర్యపేట జిల్లా కేంద్రం లోని బాలాజీ ఫంక్షన్ హాల్ లో ఈ అంశంపై జిల్లా అధికారులతో పాటు గ్రామ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ అధ్యక్షత న జరిగిన సమావేశంలో తుంగతుర్తి శాసన సభ్యులు గాధారి కిశోర్ కుమార్, బొల్లం మల్లయ్య యాదవ్ జిల్లా ప్రజాపరిషత్ చేయిర్మన్ గుజ్జ దీపికా యుగంధర్ రావు జిల్లా గ్రంథాలయ సంస్థ చేయిర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్ ,జిల్లాప్రజాపరిషత్ ఉపాధ్యక్షుడు గోపగాని వెంకట్ నారాయణ గౌడ్ సూర్యాపేట జిల్లా డి ఆర్ డి ఓ పి డి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి జగదీష్ రెడ్డి మాట్లాడుతూ సూర్యపేట జిల్లాను మల విసర్జన జిల్లాగా రూపు దిద్దడం లో అధికారుల పాత్ర కీలకమని ఆయన గుర్తు చేశారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో చేసే ప్రతి పనిలో పురోగతిని సాధించవచ్చని ఆయన సూచించారు.హరితహారం విజయవంతం చేయడంలో గ్రామ కార్యదర్శులు సింహ భాగంలో ఉండాలని ఆయన కోరారు.2014కు పూర్వము చెట్ల పెంపకం అనేది కాగితాలతో సరిపెట్టారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ఇంతకాలం అంకెల గారడితో జరిగిన మోసాన్ని గుర్తించిన ముఖ్యమంత్రి కేసీఆర్ హరితహారం లో నిర్దేశించిన ప్రతి మొక్క భూమి మీద నాటేలా చర్యలు చేపట్టారని మంత్రి జగదీష్ రెడ్డి పేర్కొన్నారు. చెట్ల నాటడం అనేది ప్రజల భాగస్వామ్యంతో ఒక ఉద్యమంలా కొనసాగిస్తున్న విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తు చేసుకోవాలని హితవు పలికారు. హరితహారం మొదలు పెట్టకముందు కాగితాల మీదనే అడవులు సృష్టించిన అంశాన్ని గణాంక వివరాలతో ఆయన బయట పెట్టారు. అతి తక్కువ అటవీ ప్రాంతం ఉన్న జిల్లా ఉమ్మడి నల్గొండ జిల్లా అని అందులో సూర్యపేట జిల్లా చెట్ల పెంపకంలో మరింత వెనకబడి ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

### వాస్తవానికి సూర్యపేట జిల్లా 12 వేల హెక్టార్ల భువిస్తీర్ణాలో

33% భూమి అటవీ ప్రాంతంగా ఉండాల్సిన అవసరం ఉందని చెప్పారు. అటువంటిది లెక్కల్లో కేవలం 2.4%మాత్రమే అటవీ ప్రాంతం ఉన్నట్లు లెక్కల్లో చూపుతున్నారు అంటే చెట్ల పెంపకంలో మనం ఎక్కడ ఉన్నామో ఒక్కసారి అవలోకనం చేసుకోవాలని ఆయన ఉపదేశించారు.ఇటువంటి పరిస్థితులు ఉత్పన్నం కావడంతో అడవుల్లో ఉండే కోతులు జనావాసాలకు వస్తున్న అంశాన్ని విస్మరించరాదని ఆయన కోరారు. కేవలం ప్రభుత్వ భూములలో మాత్రమే కాకుండా ప్రతి ఒక్కరూ తమ తమ వ్యవసాయ భూములలో కూడా విరివిగా మొక్కలు నాటేందుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. అందుకు భిన్నంగా వ్యహరిస్తే 2070 నాటికిబారతదేశ పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుందన్న దివంగత రాష్ట్రపతి అబ్దుల్ కలాం మాటలు ఇక్కడ ప్రస్తావనర్హమేనంటూ ఆయన ఉపదేశించారు. నాలుగు దశాబ్దాల క్రితం మంచినీళ్లు కొనుక్కొని తాగుతామని ఏ ఒక్కరూ ఊహించలేదని అటువంటి దుర్భర పరిస్థితి ఏర్పడడానికి మానవ తప్పిదమే కారణమని ఆయన చెప్పారు.

కాకతాళియంగా చెబుతున్న విషయం కాదు మంచి నీళ్ళు కొన్నది మొదటి సూర్యపేట పట్టణం నుండే మొదలైందని,నీటి శుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయడం కూడా ఇక్కడి నుండే అంకురార్పణ జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్ లో ఆక్సిజన్ కొనుగోలు /అమ్మకాలు కూడ ఇక్కడి నుండే మొదలవుతుందా అన్న సందేహం వెంటాడుతుందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు.

# మరణాలన్నీ సజీవాలే..!

నేటినిజం

బుధవారం 24-7-2019

"మరణం మాట్లాడుతుంది" అనే మాటను ఆంగ్లంలో 'మర్డర్ స్పీక్స్" అంటారు. కొందరు వ్యక్తులు చనిపోయి కాలగర్భంలో కలిసిపోయి, చరిత్ర పుటల్లో చేరిపోయినా సరే ఎప్పటికైనా ఆ సంబంధిత సమస్యలు ప్రాణం పోసుకుంటాయి. ఒక్కోసారి కొన్ని మరణాల తాలూకు వివరాలు వారు చనిపోయిన శతాబ్దాలు గడిచిన తర్వాత బయటపడిన సందర్భాలున్నాయి. ఇపుడు అదే కోవలో నేతాజీ, శాస్త్రీజీ మరణాలపై అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. 1965 నాటికి జై జవాన్, జైకిసాన్ పిలుపు స్వతంత్ర్య భారత జాతిని సమగ్ర ప్రజాస్వామ్య విజయపథం వైపుకు నడిపించింది. నైతిక రాజనీతిజ్ఞుడైన ద్వితీయ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రీజీ తొలి ప్రధాని బాటలో నడిచి ప్రధాని కాగలగడం విశిష్టం. దాదాపు 18 సంవత్సరాల నెహ్రూ పరిపాలన తర్వాత నైతిక శక్తివంతుడైన శాస్త్రీజీ కేవలం 18 నెలలు బాధ్యతను నిర్వహించారు. స్వంత ఇల్లులేక, తన కన్నబిడ్డలను సైతం అతి సాధారణంగా పెంచిన వీరి తీరు ప్రశంసనీయం. దేశంలో ప్రజలు తిండిలేక, పంటలు లేక బాధపడుతుంటే తనుమాత్రం ఎందుకు సుఖపడాలనే ఆలోచనతో వీధివరండాలోనే తలగడ తప్పు వేరేదీ లేకుండా నిద్రించిన తీరు వీరిది. సాధారణమైన వేషధారణతో అందరిలో ఒకడిగా మెలిగిన శాస్త్రీజీ నిరాడంబరమైన తీరు నెహ్రూ తర్వాత దేశాన్ని పరిపాలించే అవకాశం కలిపించింది. 1965లో పాకిస్థాన్‌తో సమర విజయాన్ని సాధించి భారత త్రివర్ణ పతాకం వినువీధుల్లో సగర్వంగా రెపరెపలాడించే దిశగా చేసిన పోరాటంలో ఎంతో సాహసాన్ని ప్రదర్శించిన వీరు 1966 జనవరి 11 న రష్యాలో పాకిస్థాన్ అధ్యక్షుడు ఆయుబ్‌ఖాన్ తాష్కెంట్ ఒప్పందం అనంతరం ఆకస్మికంగా మరణించారు. ఇప్పుడిప్పుడే అనేక కారణాలు బయటపడుతుంటే శాస్త్రీజీది సహజ మరణం కాదని అనుమానాలు బలపడుతున్నాయి..!

అలాగే బ్రిటీష్ నిరంకుశ పాలనలో సాయుధ సమరాంగణంలో సర్వ సైన్యాధ్యక్షునిగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ కనుమరుగయ్యాడు. ఇటీవల ఇంతవరకు రహస్యంగా దాగి ఉన్న దస్త్రాలను వెలికి తీసి నేడు మమతా బెనర్జీ వీరి బహిర్గితం చేసి వారి దివ్యస్మృతికి చిరుదీపం వెలిగించారు. తొలిప్రధాని నెహ్రూ నుండి, నేడు నరేంద్రమోది వరకు నేతాజీ త్యాగశీలత పట్ల ఎంతో ఆరాధనా భావం కలిగి ఉన్నవారే. కానీ శతాబ్దం గడిచినా వారి అర్థాంతరమైన, అసంపూర్ణమైన జీవితానికి గల కారణాల్ని ఇప్పటివరకు వెలికితీయలేకపోవడం అవమానకరం. స్వాతంత్ర్యం వచ్చేనాటికి ఇతను ఇంకా జీవించే ఉన్నాడా? అనే సందేహాలు వెలువెత్తుతున్నాయి. అలాగని వీరికి గాంధీజీతో కానీ, నెహ్రూతో గానీ విబేధాలు లేవు. కేవలం విమాన దుర్ఘటనలో చనిపోయారని వీరి జీవితానికి ముగింపు నిచ్చారు. అందుకు సాక్ష్యం లేదు. వెలికి తీసే ప్రయత్నంలో రష్యా, బ్రిటన్, అమెరికా వంటి అగ్రదేశాలతో సంబంధాలు బెడిసికొట్టి దేశ భద్రతకు ముప్పు ఏర్పడుతుందనే అపోహతో ఈ త్యాగమూర్తుల మరణానికి కారణం వెదకకపోవడం ఎంతవరకు సమంజసం? అయినా ఎన్నో తప్పులు బహిర్గితమైన సందర్భాలున్నాయి. అలాంటిది దేశం కోసం రక్త తర్పణం చేసిన మహానుభావుల మరణాల రహస్యాలు బయటపడకపోతాయా? ఎదురుచూద్దాం..! తప్పుకు ఆయువు లేదు. నిజానికి భయంలేదు. ఇవి చాలవా? ఏ విషయమైనా వెలికితీయడానికి ..!

# చంద్రయాన్-2 సక్సెస్‌తో ఉలిక్కిపడ్డ అమెరికా

హైదరాబాద్, జులై 23:దాదాపు 50 ఏళ్ల క్రితమే జాబిల్లిని ముద్దాడిన అమెరికా తదుపరి పరిశోధనలకు ఇంతకాలం ఎందుకు మౌనంగా ఉందన్న ప్రశ్న వేసుకుంటే అనేకానేక అనుమానాలు దొంతర్లలా దొర్లుతాయి. యూట్యూబ్ తెరిస్తే చంద్రుడిపై నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ కాలిడింది నిజమేనా అన్న అనుమానాలు మనలను వెంటాడుతాయి. ఆనాడు చంద్రుడిపై కాలుడిన విషయంలో ప్రపంచ దేశాల్లో అనుమానాలు ఉన్నాయి. రాష్యా పరిశోధనలకు పోటీగా ఈ కుట్ర జరిగిందన్న వాదనలూ ఉన్నాయి. ఈ యాత్రలో పాల్గొన్న నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ కూడా ఇప్పుడు మనమధ్యలో లేడు. అయినా ఆనాటి ప్రాజెక్ట్కు సంబంధించిన వారు ఉన్నారు. ఒకవేళ నాసా పరిశోధనలు నిజమైతే ఈ యాభై ఏళ్ల కాలంలో చంద్రుడిపై మరిన్ని పరిశోధనలకు ఎందుకు వెళ్లలేదన్న ప్రశ్నలు ఉత్పన్నం అవుతాయి. నాసా ప్రయోగించిన అపోలో 50 ఏళ్ల ప్రస్థానం తరవాత ఇన్నాళ్లకు మనం చంద్రయాన్‌ను ప్రవేశ పెట్టాం. దీంతో భారత అంతరిక్షరంగ చరిత్రలో మరో అద్భుతం ఆవిష్కృతమైంది. పరిశోధక పరికరాలతోపాటు 130 కోట్ల మంది భారతీయుల ఆశలు, ఆకాంక్షలను మోస్తూ 'చంద్రయాన్-2' నిర్ణీత కక్ష్యలోకి చేరింది. బాహుబలి వాహకనౌక 'జీఎస్ఎల్వీ మార్క్3-ఎం1' తనపై ఇస్రో ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ.. వ్యోమనౌకను రోదసిలోకి మోసుకెళ్లింది. భూకక్ష్యలోకి దాన్ని చేర్చింది. దీంతో జాబిల్లిపైకి మనదేశం చేపట్టిన ప్రతిష్ఠాత్మక రెండో యాత్రలో తొలి అంకం విజయవంతంగా పూర్తయింది. శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం షార్ వేదికగా ఈ బృహత్తర ప్రయోగం జరిగింది. రాకెట్ నుంచి 'చంద్రయాన్-2' విడిపోయినట్లు సంకేతాలు అందగానే ఇస్రో శాస్త్రవేత్తలు ఆనందంతో కేరింతలు కొట్టారు. ఈ అపూర్వ ఘట్టంతో యావత్ భారతావని పులకించింది. 'చంద్రయాన్-2' లో ఆర్బిటర్, ల్యాండర్, రోవర్ అనే మూడు పరికరాలు ఉన్నాయి. వీటిలో పరిశోధనల కోసం 13పేలోడ్స్‌ను శాస్త్రవేత్తలు అమర్చారు. ఈ ఏడాది సెప్టెంబరు 7న చంద్రుడిపై ల్యాండర్ దిగనుంది. అందులో నుంచి రోవర్ బయటకు వచ్చి 14 రోజులపాటు పరిశోధనలు జరుపుతుంది. మనం రోవర్‌ను పంపడానికే ఇంతకాలం పరిశోదనలు చేసి ముందడుగు వేస్తే 50 ఏళ్లుగా అమెరికా ఏం చేస్తోంద్నది ప్రపంచానికి అర్థం కాని ప్రశ్నగా,అనుమానంగా మారింది. తొలిసారిగా చంద్రునిపైకి మనిషిని పంపి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా... మరో చరిత్రాత్మక ప్రాజెక్టుకు 'నాసా' శ్రీకారం చుడుతున్నట్లు ప్రకటించింది. 2024లో తొలిసారిగా ఓ మహిళను, తదుపరి పురుషుడిని జాబిల్లిపైకి పంపాలని నిర్ణయించినట్లు ప్రకటించింది. మరో ఐదేళ్ల కాలం ఎందుకన్నది ఎవరికీ అర్థం కాని ప్రశ్న. మన జాబిల్లి యాత్ర చేపట్టిన రోజు నాసాకు 50 ఏళ్ల క్రితం జరిగిన ఘటనలు గుర్తుకు వచ్చాయా అన్నది ప్రశ్న. 50 ఏళ్ల క్రితమే వ్యోమగాములను పంపినప్పుడు ఎన్నెన్నో పరిశోధనలు జరగాలి. మన చంద్రయాన్ 1లో పంపిన రోవర్ చంద్రుడిపై నీటి జాడలు ఉన్నాయని గుర్తించింది. అప్పుడు కూడా నాసా అభినందించిందే తప్ప తన ముమ్మందు లక్ష్యాలను ప్రకటించలేదు. 1960లో 'అపోలో' ద్వారా చంద్రుడిపైకి నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్‌ను పంపినట్లు ప్రకటించిన నాసా... ఇప్పుడు జాబిల్లిపైకి మహిళను పంపుతానని ప్రకటించింది. సమస్త మానవాళి కోసం మరో బృహత్తర కార్యక్రమం చేపట్టే అవకాశం మాకొచ్చింది. తదుపరి తరానికి చెందిన స్పేస్ లాంచ్ సిస్టం రాకెట్‌ను ప్రయోగించనున్నాం. జాబిల్లి ఉపరితలంపై నీరు, మంచు వంటి సహజ వనరుల ఉనికిని తెలుసుకోవడానికి, అంగారకునిపై తదుపరి పరిశోధనలకు ఈ కార్యక్రమం దారి చూపనుంది. లోగడ అక్కడ సందర్శించని కొత్త ప్రాంతాలను ఈ యాత్రికులు వెలుగులోకి తెస్తారు. 2028 నాటి కల్లా చంద్రునిపై మనిషి స్థిరమైన ఉనికిని చాటుతాం. అమెరికా సంస్థలు, అంతర్జాతీయ భాగస్వాము లతో కలిసి ఈ లక్ష్యాన్ని చేరుకుంటాం అని నాసా అధిపతి జిమ్ బ్రిడెన్‌స్టైన్ వివరించారు. ఇప్పటికే కెనడీ స్పేస్ సెంటర్‌లో ఇంజినీర్లు ఒరాయన్ క్రతువులో నిమగ్నమయ్యారని ప్రకటించారు. 2024లో చంద్రునిపైకి వ్యోమగాములను పంపడానికి ముందస్తుగా... వచ్చే ఏడాది ఒరాయన్, ఎస్ఎల్ఎస్‌లను అమెరికా ప్రయోగాత్మకంగా అంతరిక్షంలోకి పంపి, పరీక్షించనుందని వెల్లడించింది. ఇన్నాళ్లూ అమెరికా గడ్డ మీద నుంచి రోదసిలోకి రాకెట్లు పంపుతున్నాంగానీ... త్వరలోనే అంతరిక్ష పరిశోధకులను చంద్రునిపైకి పంపి అక్కడే సాంకేతిక, వనరుల అభివృద్ధి చేపడతామని అమెరికా ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్ వెల్లడించారు. ఈసారి మా వ్యోమ గాములు చంద్రుడిపైకి వెళ్లి అక్కడే ఉండి మా ఉనికిని చాటుతాం. సరికొత్త సాంకేతికతను అభివృద్ధి చేస్తాం. చంద్రుని పైనుంచి అంగారకుడికి మా ప్రయాణం కొనసాగుతుందని ఆయన వివరించారు. ఆర్టెమిస్ కార్యక్రమం ద్వారా 2024లో చంద్రుడిపైకి పరిశోధకులను పంపనున్న నాసా... వారిని అక్కడే ఉంచనున్నట్టు తెలుస్తోంది. తర్వాతి దశలో భాగంగా చంద్రుని పైనుంచి అంగారకుడి వద్దకు రాకెట్‌ను పంపనుందని ప్రకటించుకుంది. అయితే దీనికి ఇంతకాలం ఎందుకు తీసుకుందన్నదే ప్రశ్న. సాధారణంగా నాసా ప్రయోగాలు చురుకుగా ఉంటాయి. భారత్ జాబిల్లి యాత్రను చేపట్టిన వెంటనే ఈ ప్రకటన వెలువడడం గమనార్హం. దీంతో గతంలో నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ యాత్ర నిజామా కాదా అన్న అనుమానాలు మరింత బలపడ్డాయి. మన పరిశోధనలు మరింత వేగంగా ముందుకు సాగుతున్న వేళ త్వరలోనే ప్రపంచానికి జాబిల్లి రహస్యాలు వెల్లడి కానున్నాయి. అలాగే జాబిల్లిపై నాసా పంపిన అపోలో కాలిడిందా లేదా అన్నది కూడా తెలుస్తుంది. ప్రపంచ ప్రజల్లో ఉన్న అనుమానాలను నాసా ఏనాడూ పట్టించుకోలేదు. చంద్రుడిపై అమెరికా కాలిడి వుంటే అంగారక ప్రయోగాలు మరింత వేగం పుంజుకునేవి. మన అంగారక యాత్ర, జాబిల్లి యాత్రలు చూస్తుంటే మనమే ముందుగా వ్యోమగాములను చంద్రుఇపైకి పంపగలమన్న విశ్వాసం ప్రపంచప్రజల్లోనూ నెలకొంది. అంతరిక్షపరంగా భారత్ వేస్తున్న అడుగులు ప్రపంచానికి దిక్సూచి అవుతాయనడంలో సందేహం లేదు. ఇస్రో పరిశోధనలు విశ్వానికి మార్గదర్శిగా నిలుస్తాయని భావిద్దాం.

# సెప్టెంబర్ 7 వరకు టెన్షనే

### రోవర్ క్షేమంగా దిగే వరకు ఇస్రో అధ్యయనం

### అక్కడి పరిశోధనల సవాల్ స్వీకరించిన ఇస్రో

శ్రీహరికోట,జూలై23 (ఆంఎన్ఎ): భారత్ అంతరిక్ష పరిశోధనల్లో మరోమైలు రాయిని చేరుకున్నాం. సెప్టెంబర్ 7న ఇప్పుడు పంపిన రోవర్ జాబిల్లిని ముద్దాడనుంది. క్షేమంగా దిగిన తరవాత 14 రోజుల పాటు అది పరిశోధనలు చేస్తుంది. నీటి జాడలతో పాటు, ఖనిజాల జాగను కనిపెడుతుంది. దానికి సంబంధించిన వివరా లను ఎప్పటికప్పుడు రోవర్ ఇస్రోకు చేరవేస్తుంది. మూడేళ్ళ క్రితం రోవర్‌ను దింపిన చైనా కూడా మనలా ధైర్యం చేయలే దు. అత్యంత సంక్లిష్టమైన 'సాఫ్ట్‌ల్యాండింగ్' లో ఇప్పటి వరకూ అమెరికా, రష్యా, చైనాలు మాత్రమే నెగ్గాయి. 2008లో యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ, నాసా సహకారంతో జరిపిన తొలి చంద్రయానంలో నీటిజాడను గుర్తించిన ప్రాంతంలోనే ఈ మలిచంద్రయానం సాగుతూ, 14రోజులపాటు పనిచేసే ల్యాండర్, రోవర్ ఎన్ని రహస్యాలు ఛేదిస్తాయో అన్న ఉత్కంఠ నెలకొంది. చందమామ పుట్టుపూర్వోత్తరాలు, నీటి ఉనికి, ఖనిజాన్వేషణలతో పాటు ఈ కొత్త ప్రాంతంలో హీలియం3ను గుర్తించడం అసలు లక్ష్యం. చంద్రుని హీలియంమీద అనేక దేశాలు కన్నేసిన నేపథ్యంలో ఈ ప్రయోగం వ్యూహాత్మకంగా కూడా కీలకమైనది. సెప్టెంబర్ 7న మన రోవర్ చంద్రుడిపై దిగుతుంది. అప్పటి వరకు ఇస్రో శాస్రవేత్తలకు నిత్య టెన్షన్ తప్పదు. అది క్షేమంగా దిగి తన కార్యక్రమాలను పూర్తి చేసే వరకు ఏం జరుగుతుందో అన్నది నిరంతరంగా పర్యవేక్షిస్తుంటారు. ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగిన చంద్రయాన్-2 ప్రయోగం ప్రారంభం నుంచి చివరి వరకు శాస్త్రవేత్తలు అనుకున్నట్లుగానే కొనసాగింది. సోమవారం మధ్యాహ్నం 2:43 గంటలకు రాకెట్ పయనం ఆరంభమైంది. సోమవారం మధ్యాహ్నం నిప్పులు చిమ్ముతూ నింగికెగిసిన జీఎస్ఎల్వీ మార్క్3 రాకెట్ 16 నిముషాల్లో చంద్రయాన్-2ను నిర్ణీత భూ కక్ష్యలో వదిలిపెట్టడంతో ఒక కీలకఘట్టం పూర్తయింది. నెలన్నర తరువాత, ఆర్బిటర్‌నుంచి ల్యాండర్ వేరుపడి, చందమామ మీదకు అత్యంత సున్నితంగా దిగే 'సాఫ్ట్‌ల్యాండింగ్' పక్రియను ఇస్రో చైర్మన్ 'ఫిఫ్టీన్ మినిట్స్ ఆఫ్ టెర్రర్'గా అభివర్ణించారు. నిర్దేశిత కక్ష్యలో కాలూనినట్టుగా చంద్రయాన్-2 నుంచి సంకేతాలు రాగానే, అంతరిక్ష చరిత్రలో భారత్ ఒక సరికొత్త అధ్యాయాన్ని లిఖించిందని ఇస్రో చైర్మన్ శివన్ అన్నారు. తొలి చంద్ర యానంలోనూ, మంగళయానంలోనూ ఇస్రో ఆర్బిటర్‌లను మాత్రమే ప్రయోగించింది. ఇప్పుడు చంద్రుడిపై చక్కర్లు కొట్టే ఆర్బిటర్‌తో పాటు, దాని నేలను తవ్వి పరీక్షలు జరిపే రోవర్‌ను కూడా దింపుతున్నది. ఇంతవరకూ ఎవరూ స్పృశించని, అన్వేషించని దక్షిణధృవంలో రోవర్‌ను దింపడం, అది కచ్చితం గా కాలూనే ఆ చిన్ని ప్రాంతాన్ని చివరినిముషాల్లో నిర్ధారించబోవడం సాహస ప్రక్రియగానే గచూడాలి. అభివృద్ధి దశలో ఉంటూనే గతంలో అది రెండు విజయాలు సాధించినప్పటికీ, ఇప్పుడు కనుక విఫలం చెంది వుంటే ఆ ప్రభావం 2022లో సంకల్పించిన గగనయానంమీద కచ్చితంగా పడేది. క్రయోజనిక్ సాంకేతికతను మనం రెండు దశాబ్దాల్లోనే అందిపుచ్చుకోగలిగినా, దానిలో రాటుదేలవలసిన అవసరం ఇంకా మిగిలే ఉంది. దీనికి భిన్నంగా, అంతరిక్ష ప్రయోగాలను దేశ ఆత్మగౌరవంతోనూ, రాజకీయాలతోనూ ముడిపెడుతూ పోతే శాస్త్రవేత్తలపై ఒత్తిడి పెరుగుతుంది. వైఫల్యాలు ఎదురైన పక్షంలో వారి ఆత్మ విశ్వాసం సన్నగిల్లుతుంది. అయితే ఇస్రో ప్రస్థానం అద్భుతమైనది. మొన్నటి మంగళయానాన్నీ ఇప్పటి చంద్రయానాన్నీ కొన్ని ఇంగ్లీషు సినిమాల కంటే తక్కువ ఖర్చుతో నెరవేర్చింది. మిషన్ ఇప్పుడే పూర్తి కాలేదని, రోవర్ చంద్రుడిపై అడుగిడేంతవరకు రాబోయే ఒకటిన్నర నెలల్లో 15 కీలక దశలను చేపట్టాల్సి ఉన్నదని ఇస్రో చైర్మన్ కే శివన్ వివరించారు. చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతంలో రోవర్‌ను మృదువుగా దించే 15 నిమిషాలు అత్యంత క్లిష్టమైనవని తెలిపారు. గత ఏడాదిన్నర నుంచి చంద్రయాన్-2 బృందం రాత్రింబవళ్లు అకుంఠిత దీక్షతో పనిచేసిందని, వారందరికీ సెల్యూట్ చేస్తున్నానని చెప్పారు. తొలి ప్రయత్నంలో ఎదురైన సాంకేతిక అవరోధాన్ని అధిగమించి.. రెట్టించిన ఉత్సాహంతో ప్రయోగాన్ని విజయవంతం చేశామని చెప్పారు. నిరాశ తరువాత విజయాన్ని అందుకున్నామని పేర్కొన్నారు.

# భూ వివాదాల పరిష్కారంలో నిర్లక్ష్యం

### రైతులు ఆందోళన చేస్తున్న పట్టించుకోని వైనం

మంచిర్యాల,జూలై 23(ఆర్ఎన్ఎ): భూసమస్యలు కుప్పలుతెప్పలుగా వెలుగు చూస్తున్నాయి. భూప్రక్షాళన చేపట్టినా 20 శాతం దరఖాస్తులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. మ్యూటేషన్‌ల లోనూ ఫోర్జరీ, ఒకరి భూమి మరొకరి పేరిట, ఒకే భూమి ఇద్దరు, ముగ్గురి పేరిట పట్టాలాంటి ఆరోపణలు ఉన్నాయి. వివాదాలు పరిష్కారం కాని కారణంగా పలువురికి రైతుబంధు పథకం అందడంలేదు. భూమి సమస్య పరిష్కారం కాకపోవడంతో రైతు లు సహనం కోల్పోతున్నారు. మండల కేంద్రాల్లో పరి ష్కారం కాకపోవడంతో జిల్లా కేంద్రాలకు వస్తున్నారు. నిరసలు, ఆందోళనలు, ఆత్మహత్యాయత్నాలకు పాల్ప డుతున్నారు. ఇటీవల కలెక్టరేట్ వద్ద పదుల సంఖ్యలో రైతులు పురుగుల మందు, కిరోసిన్ వెంట తెచ్చుకోవడం, ఫ్లెక్సీలు పట్టుకొని ధర్నాలు చేయడం సమస్య తీవ్రతను తెలియ చేసింది. కొందరు రైతులు ప్రతీవారం ప్రజావాణికి వచ్చి దరఖాస్తు చేసుకున్నా సమస్య పరిష్కారం కావడంలేదు. కొన్నిచోట్ల రెవెన్యూ అధికారి సంతకం ఫోర్జరీ చేసి ప్రొసీడింగ్ జారీ చేసి మార్పులు, చేర్పులు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రజలు వారి భూ రికార్డుల కోసం సమాచార హక్కు చట్టం ప్రకారం దరఖాస్తు చేసుకోగా అందుబాటులో లేవనే సమాధానం ఇస్తున్నారు. కొన్నిచోట్ల ఆర్వోఆర్‌కు సంబంధించిన ఫైల్స్ మిస్సింగ్‌కు బాధ్యులుగా చేస్తూ చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు నిర్ణయించినా ఎవరి పై చర్యలు తీసుకోలేదు. జిల్లాలోని 18 మండలాల్లో నూ ఆన్‌లైన్ పట్టాలలో, పహాణీలలో విచ్చలవిడిగా మార్పులు చేయడం, పలువురి భూములను కబ్జాలు చేయడం, ఒకరి పేరిట ఉన్న భూమిని మరొకరు మార్చుకోవడం, రాజకీయ అండదండలతో ప్రభుత్వ భూములను కబ్జా చేయడం షరామామూలుగా మారింది. ప్రభుత్వం రైతుబంధు ద్వారా సాగుకు సాయం అందిస్తుండడంతో భూమి ఆక్రమణల వ్యవహారాలు వెలుగులోకి వస్తున్నాయి. రైతులు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి జరిగిన అన్యాయాన్ని, అధికారులు చేసిన తప్పిదాలను ఎత్తిచూపుతున్నారు.

ఇప్పటికైనా ఉన్న తాధికారులు భూ సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# ఆపద్బంధు సాయం కోసం అనేకుల ఎదురుచూపు

### సకాలంలో అందక కుటుంబాల్లో ఆందోళన

హైదరాబాద్,జూలై23(ఆర్ఎన్ఎ): ప్రమాదవశాత్తు కుటుంబంలోని పెద్ద చనిపోతే ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఆపద్బంధు పథకం జిల్లాలోని బాధిత కుటుంబాలను ఆదుకోవడం లేదు. ప్రభుత్వం ఇచ్చే ఎక్స్‌గ్రేషియా కోసం పలు కుటుంబాలు ఎదురు చూస్తున్నాయి. తమకు ఎక్స్‌గ్రేషియో వస్తున్నదని ఆశించిన బాధిత కుటుంబాలకు నిరాశే ఎదురయ్యింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లోని బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియాను మంజూరు చేసిన ప్రభుత్వం జిల్లాలోని బాధిత కుటుంబాలకు మంజూరు చేయక పోవడం గమనార్హం. 2011-12 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు పెండింగులో ఉన్న బాధిత కుటుంబాలకు 50 వేల రూపాయల చొప్పున ఎక్స్‌గ్రేషియా విడుదల చేశారు. ఆదిలాబాద్ జిల్లాలోని 39 కుటుంబాలకు 19 లక్షల 50 వేల రూపాయలు, హైదరాబాద్ జిల్లాలోని 52 కుటుంబాలకు 26 లక్షలు, జగిత్యాల జిల్లాలోని 20 కుటుంబాలకు 10 లక్షలు, కామారెడ్డి జిల్లాలోని 29 కుటుంబాలకు 14 లక్షల 50 వేలు, కరీంనగర్ జిల్లాలోని 32 కుటుంబాలకు 16 లక్షలు, మహబూబ్‌నగర్ జిల్లాలోని 3 కుటుంబాలకు లక్షా 50 వేలు, నిర్మల్ జిల్లాలోని 16 కుటుంబాలకు 8 లక్షలు, నిజామాబాద్ జిల్లాలోని 106 కుటుంబాలకు 53 లక్షలు, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 10 కుటుంబాలకు 5 లక్షల రూపాయలు, వనపర్తి జిల్లాలోని రెండు కుటుంబాలకు ఒక లక్ష, వరంగల్ రూరల్ జిల్లాలోని 4 కుటుంబాలకు 2 లక్షలు, యాదాద్రి భువనగిరి జిల్లాలోని 19 కుటుంబాలకు 9 లక్షల 50 వేల రూపాయల ఎక్స్‌గ్రేషియో సొమ్మును ప్రభుత్వం విడుదల చేసింది. పదిహేను సంవత్సరాల నుంచి ఆపద్బంధు పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈ పథకం అమలు కోసం రాష్ట్ర వ్యాప్తంగా టెండర్లు నిర్వహించి ఏదేని బీమా సంస్థకు అప్పగిస్తారు. పథకాన్ని మాత్రం రెవెన్యూ శాఖ అధికారులే అమలు చేస్తారు. మార్గదర్శకాల ప్రకారం ఉన్న కుటుంబాలకే ఎక్స్‌గ్రే షియా మంజూరుకు సిఫారసు చేస్తారు. బీమా కంపె నీ ప్రతినిధులు కూడా క్షేత్రస్థాయిలో అన్ని వివరాలు తెప్పించుకుని సరి చూసిన తర్వాతనే నిధులను విడుదల చేస్తారు. వీరి కుటుంబాలకు 50 వేల రూపాయల చొప్పున 35 లక్షల 50 వేల ఎక్స్‌గ్రేషియో మంజూరు చేయాలంటూ ప్రభుత్వానికి జిల్లా అధికారులు లేఖ రాశారు. అయినా కూడా నిధులు మంజూరు కావడం లేదు

# ముంపు గ్రామానికి పరిహారం చెల్లించరా?

### అనుపురం గ్రామస్థుల ఆందోళన

సిరిసిల్ల,జూలై 23(ఆర్ఎన్ఎ): మధ్యమానేరు ముంపుగ్రామస్థుల కష్టాలు తీరడం లేదు. వారి పరిహారం ఇంకా పరిహాసంగానే మిగిలింది. పదిసంవత్సరాల నుంచి ఇంటి పరిహారం రాలేదని బాధితులు వాపోతున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మానువాడ వద్ద ఏర్పాటు చేస్తున్న మధ్యమానేరు డ్యామ్‌లో ముంపునకు గురవుతున్న అనుపురం గ్రామంలో 16 వందల ఎకరాలు ముంపునకు గురైంది. మరో 150 ఎకరాల భూమికి ఇంకా పరిహారం అందలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గ్రామ పంచాయతీ రికార్డు ప్రకారం 728 ఇళ్లకు గాను అందరికీ ఇళ్ల పట్టాలు వచ్చినప్పటికీ రేషన్‌కార్డు ఉండి గ్రామంలోనే నివాసం ఉంటున్న మరో 5 ఇళ్లను పరిగణలోకి తీసుకోలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో ఇప్పటి వరకు సుమారు 150 ఎకరాల భూమికి సంబంధించి ఎలాంటి పరిహారం అందలేదని నిర్వాసితులు చెబుతున్నారు. వ్యవసాయం చేసుకుంటున్న భూములకు ఏ గ్రేడు పరిహారం అందించాలని ప్రభుత్వం చెబుతున్నా వ్యవసాయ భూములకు కూడా అధికారులు సీ గ్రేడు వేసారని చెబుతున్నారు. ఇళ్ల చుట్టూ ఉన్న వ్యవసాయ భూములకు ఇప్పటికీ పరిహారం అందలేదని నిర్వాసితులు వాపోతున్నారు. యువతకు అందించే పరిహారం గురించి ఊసేలేదని వాపోతున్నారు. తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

# రైతుబంధు పథకం పంపిణీలో నిర్లక్ష్యం

### అనేక మందికి ఇంకా అందని సాయం

ఆదిలాబాద్,జూలై 23(ఆర్ఎన్ఎ): రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకున్న ప్రభుత్వం ఎకరానికి రూ.4 వేలు చొప్పున గత రెండు సీజన్లలో అందించింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఈ వానాకాలం సీజన్ నుంచి రూ.5 వేలకు పెంచి రైతుల ఖాతాలో జమ చేస్తోంది. రబీలో నేరుగా రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ చేశారు. ఇదే పద్ధతిలో ఈ వానాకాలం సీజన్‌లో జమ చేస్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో రైతుల వారీగా సాగు భూమి, బ్యాంకు ఖాతాలను ఎంఏఓలు పరిశీలించి, మండల వ్యవసాయాధికారికి పంపిస్తారు. ఆయన మరోసారి పరిశీలించి, జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయానికి పంపిస్తారు. అక్కడి నుంచి ఖజానా శాఖకు వెళ్తే వాళ్లు నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నారు. తొలివిడతలో అయిదు ఎకరాల్లోపు ఉన్న రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశారు. జిల్లా మొత్తంలో ఇప్పటివరకు 81,680 మంది రైతుల ఖాతాల్లో రూ.121.15 కోట్లు జమ చేసినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన రైతుల ఖాతాలను పరిశీలించి ఖజానా శాఖకు పంపించారు. విడతల వారీగా అక్కడి నుంచి రైతుల ఖాతాల్లో జమ అవుతున్నాయి.పంటల సాగుకు పెట్టుబడి సాయంగా ప్రభుత్వం రైతుబంధు పథకం కింద ఇచ్చే డబ్బులు ఇంకా కొంత మంది రైతుల ఖాతాల్లో జమ కావాల్సి ఉంది. గతంలో రెండు పంటలకు కలిపి ఎకరాకు రూ.8వేల మొత్తాన్ని ఈ వానాకాలం నుంచి రూ.10 వేలకు పెంచారు. ఇందులో భాగంగా తొలివిడతలో అయిదు ఎకరాల్లోపు ఉన్న రైతులకు నేరుగా వారి ఖాతాల్లో జమ చేశారు. అయితే వీరిలో కూడా ఇంకా కొంత మంది రైతుల ఖాతాలకు డబ్బులు జమ కాలేదు. వీరితో పాటు అయిదు ఎకరాల భూమి కంటే పైన ఉన్న రైతులకు, అటవీహక్కు పత్రాలు ఉన్న రైతులకు పెట్టుబడి సాయం అందాల్సి ఉంది.కొత్తగా పట్టాపాస్‌బుక్కులు పొందిన రైతుల వివరాలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదిస్తున్నారు.. వారికి కూడా పెట్టుబడి సాయం అందించే అవకాశముంది. పెట్టుబడి సాయంగా ప్రభుత్వం అందించే మొత్తం రూపాయలు గతంలో తీసుకున్న పంట రుణం వడ్డీకి కట్టి, ఈ ఏడాదికి తిరిగి పంట రుణాలను రెన్యూవల్ చేసుకుంటున్నారు.

# పాడిగేదెల పథకంపై రైతుల్లో అనాసక్తి

### -ముందుకు రాలేకపోతున్న పాడిరైతులు

జగిత్యాల,జూలై23(ఆర్ఎన్ఎ): పాడిగేదెల పథకం జిల్లాలో నత్తనడకన సాగుతోంది. పాడిగేదెల ధర అధికంగా ఉండటంతోనే రైతులు వెనుకడుగు వేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. పాడి రైతులకు ప్రభుత్వం చేయూతనందించాలని నిర్ణయించి ఏడాది కావస్తున్నా లక్ష్యం దిశగా పయనించడం లేదు. సబ్సిడీపై పాడి గేదెలు అందిస్తున్నప్పటికీ రైతులు మాత్రం విముఖత చూపుతున్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 75 శాతం సబ్సిడీపై, బీసీ రైతులకు 50 శాతం సబ్సిడీపై గేదెలు అందిస్తున్నా అధికారులు ప్రచారంలో విఫల మయ్యారు. దీంతోజిల్లాలో లబ్దిదారులకు పాడి గేదెలు అందించాలని నిర్ణయించగా, ఇప్పటివరకు 1848 మందికి మాత్రమే అందించారు. జగిత్యాల జిల్లాలో పాడిగేదెల పథకం కింద 15,390 మందికి పాడిగేదెలు అందించాలని లక్ష్యంగా నిర్ణయిం చారు. ఇప్పటివరకు కేవలం 1848 మందికి మాత్రమే పాడిగేదెలు పంపిణీ చేశారు. మొత్తం జిల్లాలో 13,390 మంది పాడి రైతులు ఉన్నట్లు గుర్తించగా, గ్రామ స్థాయిలో కరీంనగర్ డెయి రీ, విజయ డెయిరీ వారు సర్వే చేసి పేర్లను నమోదు చేశారు. లక్ష్యంలో కేవలం 12 శాతం మేరకు కూడా పాడిగేదెలు పంపిణీ కాలేదు. అధికారులు ఈ పథకంపై ప్రచా రం కల్పించకపోవడంతోనే రైతులెవరూ ముందుకు రావడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఒకటి, రెండు పాడి గేదెలు ఉన్న ఎస్సీ, ఎస్టీ రైతులు మరో పాడి గేదెను కొనుగోలు చేసుకున్నా పశుగ్రాసానికి ఇబ్బందులు ఎదురవుతాయనే ఆలోచనతో ఆసక్తి కనబరచడం లేదు. అయితే పాడిగేదెల ధర మార్కెట్‌లో నిజానికి తక్కువగా ఉండటంతో రైతులెవరూ మొగ్గు చూపడం లేదు. పాడి గేదెల ఖరీదు బయట మార్కెట్‌లోనే రూ.50 వేల నుంచి రూ.60 వేలు ఉండగా, ప్రభుత్వం దానిని రూ.80 వేలు ధరగా నిర్ణయించి అందిస్తుండటంతో బీసీ రైతులకు ఎలాంటి లాభం లేకుండాపోయింది. దీంతో రైతులెవరూ మొగ్గు చూపడం లేదు. జిల్లాలో అర్హులైన పాడి రైతులకు ఆవులు, గేదెలు పంపిణీ చేస్తామని పశుసంవర్ధక శాఖ అధికారి తెలిపారు.

వరంగల్ రూరల్

# నీటి సంరక్షణను పక్కాగా అమలు చేద్దాం

## -కలెక్టర్ హరిత



వరంగల్ రూరల్, జులై 23 (నేటినిజం ప్రతినిధి):జలశక్తి అభియాన్‌లో భాగంగా చేపట్టిన నీటి సంరక్షణ కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ హరిత సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భూగర్భ జల వనరులను కాపాడుకునేందుకు చేస్తున్న పనులు, వర్షపు నీటిని ఒడిసి పట్టుకోవడానికి ప్రజలకు అవగాహన కల్పించడానికి చేపట్టిన కార్యక్రమాల ఫొటోలను ఎప్పటికప్పుడు జలశక్తి అభియాన్ సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. నీటి సంరక్షణ విధానాలపై విద్యార్థులకు నేటి నుంచి వ్యాసరచన, ఉపన్యాసం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి, ద్వితీయ బహుమతులు పొందిన వారికి స్వాతంత్ర్య దినోత్సవం రోజున సర్టిఫికెట్ ఇస్తామన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులచే ప్రతి ఇంటికి వెళ్లి జల సంరక్షణ చర్యలపై వివరించాలన్నారు. కేంద్రం ఎంపిక చేసిన 6 మండలాల్లోని ప్రతి ప్రభుత్వ పాఠశాలల్లో రోజూ నీటి పొదుపుపై ప్రతిజ్ఞ చేపించాలని సూచించారు. వాక్ ఫర్ వాటర్ అనే కార్యక్రమం చేసేందుకు ప్రణాళికను రూపొందించాలన్నారు. కార్యక్రమంలో జలశక్తి అభియాన్ నోడల్ అధికారి సంతోష్, డీఆర్‌డీవో పీడీ సంపత్‌రావు, డీఎఫ్‌వో పురుషోత్తం, సీపీవో స్యామేల్, హార్టీకల్చర్ ఏడీ, అగ్రికల్చర్ జేడీ తదితరులు పాల్గొన్నారు.

# 'సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం'

## ఆసరా పింఛన్ల పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

వరంగల్ రూరల్, జులై 23 (నేటినిజం ప్రతినిధి):: సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో పెంచిన ఆసరా పింఛన్ల పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. త్వరలో పాకాల రైతాంగం కోసం తలపెట్టిన గోదావరి జలాల పనులు పూర్తి చేసి నీటిని తరలిస్తామన్నారు. అనంతరం పింఛన్ పత్రాలను పంపిణీ చేశారు. ఎంపీపీ ప్రకాశ్‌రావు, జడ్పీటీసీ సభ్యురాలు స్వప్న, తహసీల్దారు మంతాజ్, ఎంపీడీవో రవి, వైస్ ఎంపీపీ ఉమారాణి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆస్పత్రిలో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

గోదావరిఖని,జూలై23(ఆర్ఎన్ఎ): స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రిలో రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్యులతోపాటు సిబ్బంది సమయపాలన, ఆస్పత్రిలోని సమస్యలను ఆయన పరిశీలించారు.

ఆయా విభాగాలతోపాటు వార్డుల్లో తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నీటి కొరత తీవ్రంగా ఉందని, ఏసీలు, పంకాలు పనిచేయడం లేదని పలువురు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు.

ఆస్పత్రి ఆవరణలో మురుగుకాల్వ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని, పక్కనే ఉన్న ఉపరితల జలాశయం నుంచి నీటి సరఫరా చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆయన కోరారు. ఆయనతోపాటు ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.శ్రీనివాసరెడ్డితోపాటు, వైద్యులు, వైద్యసిబ్బంది, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# భారత సర్వర్లలోనే టిక్‌టాక్ యూజర్ల డేటా!

న్యూఢిల్లీ, జులై22(ఆర్ఎన్ఎ) : ప్రముఖ సోషల్ యాప్ టిక్‌టాక్ మాతృ సంస్థ అయిన బైట్ డ్యాన్స్ త్వరలో భారత్‌లో తన డేటా సెంటర్‌ను ప్రారంభించనుంది. భారత వినియోగదారుల డేటా ఇక్కడి సర్వర్లలోనే నిక్షిప్తం చేయాలంటూ భారత ప్రభుత్వం తెచ్చిన ఒత్తిడి మేరకు బైట్ డ్యాన్స్ ఈ నిర్ణయం తీసుకుంది.

ఈ క్రమంలోనే దాదాపుగా 100 మిలియన్ డాలర్ల (దాదాపుగా రూ.700 కోట్లు) అంచనా వ్యయంతో 6 నుంచి 18 నెలల కాలంలో బైట్ డ్యాన్స్ భారత్‌లో తన డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది.

ఇక రానున్న 3 ఏళ్ల కాలంలో బైట్‌డ్యాన్స్ భారత్‌లో 1 బిలియన్ డాలర్ల (దాదాపుగా రూ.7వేల కోట్లు)ను పెట్టుబడి పెట్టనుంది.

ప్రస్తుతం టిక్‌టాక్ యాప్‌కు గాను భారత్‌లో 200 మిలియన్ల మంది యూజర్లు ఉండగా.. గతంలో ఈ యాప్ పట్ల పలు వివాదాల ఏర్పడ్డాయి. యాప్‌లో కొందరు పోస్ట్ చేస్తున్న అసభ్యకర దృశ్యాలు చిన్నారులపై ప్రభావం చూపిస్తున్నాయనే ఆరోపణలో కొంత కాలం టిక్‌టాక్ యాప్‌ను సుప్రీం కోర్టు నిషేధించింది. ఆ తరువాత అందులో ఉన్న పలు వీడియోలను తొలగించడంతో ఆ యాప్‌కు మళ్లీ అనుమతినిచ్చారు. కాగా ప్రస్తుతం భారత్‌లో ఉన్న టిక్‌టాక్ యూజర్ల డేటా అమెరికా, సింగపూర్‌లలో ఉన్న బైట్‌డ్యాన్స్ సర్వర్లలో నిక్షిప్తమతున్నది. భారత్‌లో డేటా సెంటర్ ఏర్పాటైతే ఇక్కడి స్వర్లర్లలోనే యూజర్ల డేటాను స్టోర్ చేస్తారు..!



# ఇస్రో చైర్మన్ శివన్ కృషి అమోఘం

## అవాంతరాలను అధిగమించే మేధావి తోటి శాస్త్రవేత్తలతో నిరంతర సమన్వయం

శ్రీహరికోట,జూలై23 (ఆర్ఎన్ఎ): మిషన్ చంద్రయాన్ విజయం వెనక ఇస్రో చైర్మన్ కే శివన్ నిరంతర కృషి దాగివుంది. ఆయన టెక్నాలజీ పరంగా తన అనుభవాన్ఇన రంగరించి ముందుకు సాగారు. తోటి శాస్త్రవేత్తలను ప్రోత్సహిస్తూ ముందడుగు వేశారు. ఇస్రో విజయాలకు మిషన్ మ్యాన్‌గా నిలిచారు.

ఇస్రో శాస్త్రవేత్తల సమిష్టి కృషితోనే చంద్రయాన్-2 విజయవంతమైందని ఇస్రో చైర్మన్ కే శివన్ చేసిన ప్రకటన ఆయన హుందాకు నిదర్శనంగా చూడాలి. చంద్రయాన్-2 ప్రయోగానంతరం మాట్లాడిన ఆయన

గత వారం సాంకేతిక సమస్యను గుర్తించిన వెంటనే యావత్తు బృందం కార్యాచరణలోకి దిగిందని, ఆ తదుపరి 24 గంటల్లో వెహికల్‌ను సాధారణ స్థితికి తెచ్చేందుకు బృందం చేసిన కృషి అద్భుతం, అనిర్వచనీయమని చెప్పారు. జీఎస్ఎల్వీ మాక్-3 రాకెట్ చంద్రయాన్-2ను నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టిందని ప్రకటించేందుకు తాను ఎంతో సంతోషిస్తున్నానని అన్నారు.

ఈ మిషన్ విజయవంతం కోసం భారత్ మాత్రమే కాకుండా ప్రపంచం మొత్తం ఎంతో ఆసక్తితో ఎదురుచూసిందని, దాన్ని తాము సుసాధ్యం చేశామన్నారు. చంద్రయాన్-2 ప్రస్థానం ఎన్నో అవాంతరాల మధ్య సాగింది. ఈ ప్రయోగం కోసం కలిసి పనిచేయాలని ఇస్రో తొలుత రష్యా అంతరిక్ష పరిశోధన సంస్థ రోస్కోస్మాస్‌తో 2017 నవంబర్‌లో ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా ఇస్రో ఆర్బిటార్, రోవర్ రూపొందిస్తే, రోస్కోస్మాస్ ల్యాండర్‌ను సమకూర్చాల్సి ఉంటుంది.

షెడ్యూల్ ప్రకారం ఇస్రో చంద్రయాన్-2 పేలోడ్స్‌ను ఖరారు చేసినప్పటికీ, రష్యా సకాలంలో ల్యాండర్‌ను అభివృద్ధి చేయకపోవడంతో ఈ మిషన్ 2016కు వాయిదా పడింది. మరోవైపు అంగార కుడిపైకి రష్యా చేపట్టిన ఫోబోస్-గ్రంట్ మిషన్ విఫలమైంది. ఇందులోని సాంకేతిక అంశాలనే చంద్రయాన్-2లో వినియోగించాల్సి ఉండడంతో వీటిపై సమీక్షించాలని రష్యా పేర్కొంది. 2015 నాటికి కూడా రష్యా ల్యాండర్‌ను సమకూర్చే పరిస్థితి లేకపోవడంతో ఇక సొంతంగానే ల్యాండర్‌ను అభివృద్ధి చేయాలని ఇస్రో సంకల్పించింది. 2018 మార్చిలో చంద్రయాన్-2ను ప్రయోగించాలని భావించినా వివిధ కారణాల వల్ల అదే ఏడాది ఏప్రిల్‌కు, అనంతరం సెప్టెంబర్‌కు, ఆ తర్వాత 2019 తొలి అర్ధభాగానికి వాయిదా పడింది. ఈ నెల 15న మరోసారి వాయిదాపడ్డ చంద్రయాన్-2 సోమవారం దిగ్విజయంగా నింగిలోకి దూసుకెళ్లింది. చంద్రుని ఉత్తర ధ్రువంతో పోలిస్తే, దక్షిణ ధ్రువం అత్యధిక భాగం నీడలో ఉంటుంది. శాశ్వతంగా నీడలో ఉండే ప్రాంతాల్లో నీరు ఉండే అవకాశం ఉన్నది. దక్షిణ ధ్రువంలో ఉన్న గుంతలు చెమ్మతో ఉంటాయి.

సౌర కుటుంబం పరిణామ క్రమానికి సంబంధించిన శిలాజాలు కూడా ఇక్కడ ఉన్నట్లు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఇస్రో చంద్రయాన్-2 కోసం దక్షిణ ధ్రువాన్ని ఎంచుకుంది.

### సామాన్యుడే ఈ అసామాన్యుడు

సామాన్య రైతు కుటుంబంలో పుట్టి.. ఇస్రోకు నేతృత్వం వహించే స్థాయికి ఎదగడం వెనుక శివన్ అచంచల కృషి ఉంది. క్రయోజెనిక్ ఇంజిన్ అభివృద్ధిలో ఆయన అందించిన సేవలకు గాను ఆయనను రాకెట్ మ్యాన్‌గా పిలుస్తుంటారు. తమిళనాడు రాష్ట్రం కన్యాకుమారి జిల్లా నాగర్‌కోయిల్ సమీపంలోని మేళాసరక్కల్విలైలో 1958లో శివన్ జన్మించారు. ప్రభుత్వ పాఠశాలలో తమిళ మీడియంలో పాఠశాల విద్యాభ్యాసం పూర్తిచేశారు. తన కుటుంబంలో తొలి గ్రాడ్యుయేట్ శివనే కావడం విశేషం. 1980లో మద్రాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి ఏరోనాటికల్ ఇంజినీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ పొందారు. అనంతరం 1982లో బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ నుంచి ఏరోస్పేస్ ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ సాధించారు. తర్వాత ఇస్రోలో శాస్త్రవేత్తగా ఎంపికయ్యారు. 2006లో ఐఐటీ బాంబే నుంచి డాక్టొరల్ డిగ్రీ పొందారు. 1982లో పీఎస్ఎల్వీ ప్రాజెక్ట్‌లో చేరిన శివన్.. మిషన్ ప్లానింగ్, డిజైన్, ఇంటిగ్రేషన్, అనాలిసిస్‌లో కీలకపాత్ర పోషించారు. ఇస్రో వాహకనౌకల పథ నిర్దేశానికి వెన్నెముక లాంటి 6డీ ట్రాజెక్టరీ సిములేషన్ సాఫ్ట్‌వేర్ సితారకు శివనే చీఫ్ ఆర్కిటెక్ట్. ఇస్రో కదనాశ్వం పీఎస్ఎల్వీ ద్వారా మంగళ్‌యాన్‌ను దిగ్విజయంగా ప్రయోగించడంలో శివన్ కీలక పాత్ర పోషించారు. 2011 ఏప్రిల్‌లో ఆయన జీఎస్ఎల్వీ ప్రాజెక్ట్‌లో చేరారు. ఆయన సారథ్యంలోనే పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో జీఎస్ఎల్వీని అభివృద్ధి చేశారు. 2018 జనవరిలో ఇస్రోకు తొమ్మిదో చైర్మన్‌గా శివన్ నియమితులయ్యారు.

# చరిత్ర సృష్టిస్తున్న ఇస్రో

## ఆర్థిక సహకారం పెరిగితే మరిన్ని పరిశోధనలు రక్షణ రంగాన్ని బలోపేతం చేసే దిశగా తోడ్పాటు అవసరం

శ్రీహరికోట,జూలై23 (ఆర్ఎన్ఎ): అంతరిక్ష ప్రయోగాల వేదిక శ్రీహరికోటలో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో చరిత్ర సృష్టింస్తోంది. తాజాగా చంద్రయాన్-2 తో భారత అంతరిక్ష కీర్తిపతాక దిగద్దాంతాలకు వ్యాప్తి చెందింది. ప్రపంచ దేశాలతో పోటీ పడుతూ చేస్తున్న పరిశోధనలు దీటుగా ఉంటున్నాయి.

గతేడాది వివేకానందుడి జయంతి రోజు అపూర్వమైన విజయాన్ని ఇస్రో సొంతం చేసుకుంది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో అరుదైన మైలురాయి సాధించి, భారత ఘనతను గగనాన నిలిపింది. శ్రీహరికోటలోని షార్ కేంద్రం నుంచి వందో ఉపగ్రహాన్ని ప్రయోగించి విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. రెండేళ్ల క్రితం ఫిబ్రవరిలో ఒకే రాకెట్‌తో 104 ఉపగ్రహాలను ఒకేసారి అంతరిక్షంలోకి తరలించిన ఘనత ఇస్రో సొంతం చేసుకున్న తరవాత, ఆ ప్రయోగంతో రోదసిరంగంలో అగ్రగాములుగా ఉన్న అమెరికా, రష్యాల సరసన భారత్ చేరింది. తరవాత వందో ఉపగ్రహాన్ని పంపి మన ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పింది. ఇప్పుడు చంద్రయాన్-2 కూడా అంతరిక్ష పరిశోధనల్లో ఆయా దేశాలకు దీటుగా నిలిచేదే. నాసాలాంటి పరిశోధక కేంద్రాలకు ఏ మాత్రం తీసిపోని విధంగా ఇస్రో నిలిచిందనడంలో సందేహం లేదు. మన శాస్త్ర విజ్ఞానాన్ని ప్రపంచానికి సగర్వంగా చాటిన మన శాస్త్రవేత్తలకు సలామ్ చేసే రోజు ఇది. ఇప్పటికే చంద్రయాన్ యాత్ర చేపట్టింది. అంగారక కక్షలోకి ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టింది. ఇలా ఎన్నో విజయాలతో దూసుకుని పోతోంది. ఈ దశలో ఇస్రో పరిశోదనలకు మరింత ఆర్థిక సహకారం ఇవ్వాల్సి ఉంది. ఈ విజయం ఒక్క రోజులో సాధ్యం కాలేదు. దీని వెనుక దశాబ్దాల తరబడి నిరంతరాయంగా సాగిన శాస్త్రవేత్తల కృషి, కఠోర పట్టుదల ఉంది. అంతరిక్ష శక్తిగా ఎదగకుండా భారత్‌ను అడ్డుకోవాలన్న అంతర్జాతీయ రాజకీయాలు ఉన్నాయి. స్వావలంబన దిశలో ఇస్రో చేస్తున్న కృషికి నూతనంగా సాధించిన ఈ సామర్థ్యం ఎంతగానో ఉపయోగపడనుంది. అన్ని ఆటంకాలను, అవరోధాలను ఎదుర్కొని సాధించిన విజయం కాబట్టే ఇది చారిత్రాత్మకం. ప్రతి భారతీయుడు గర్వించదగిన సందర్భమిది. ఇంతటి ఘన విజయాన్ని దేశానికి అందించిన శాస్త్రవేత్తలకు అభినందించాల్సిందే. ఎన్నిసార్లు... ఎన్ని రోజులయినా మనవాడి తగ్గదని రుజువు చేశారు. ఆర్యభట్టుడు చూపిన మార్గంలో మన అంతరిక్ష పరిశోధనలు మరింతగా ముందుకు సాగాలని గుర్తు చేసేలా ప్రయోగాలు సఫలం అవుతున్న తీరు మన వాసిని చాటుతున్నాయి. భవిష్యత్ ఖగోళంలో ఇక భారత్ మాత్రమే చరిత్ర సృష్టించగలదని నిరూపించబోతున్నారు. గతంలో పంపిన వందో ఉపగ్రహం అయిదేళ్లు పనిచేసే ఈ ఉపగ్రహంతో మన పొరుగు దేశాలపైనా నిత్యం నిఘావేసి ఉంచే సదుపాయం కలుగుతుంది. ఈ కెమెరాలు భూమిపై ఒక మీటర్ పరిధిని కూడా స్పష్టంగా చిత్రీకరించి త్వరితంగా ఉండే నియంత్రణ కేంద్రాలకు పంపగలవు. ఇప్పటికే అంతరిక్షంలో సేవలందిస్తున్న 'కార్టోశాట్' తరగతికి చెందిన ఉపగ్రహాలు పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలపై మెరుపు దాడులకు సంబంధించి కీలకమైన సమాచారాన్ని అందివ్వడం గమనార్హం. తాజా 'కార్టోశాట్'తో పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు సంబంధించి కచ్చితత్వంతో కూడిన రేఖా చిత్రాలను తయారు చేసే సౌలభ్యం లభిస్తుంది. మన దేశానికి మూడువైపులా సువిశాలమైన సముద్రతీరం ఉంది. తీరప్రాంత భూముల సమర్థ వినియోగం, జలాల పంపిణీ, రహదారి నిర్వహణకు సంబంధించి సమగ్రమైన వ్యవస్థపై దృష్టి తదితర అంశాల్లోనూ వీటి సేవలను పొందవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దేశంలో చేపట్టిన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించి కచ్చితమైన సమాచారం అందుబాటులోకి రానుంది. దీంతో ఈ ప్రాజెక్టుల విషయంలో కీలకమైన నిర్ణయాలు తీసుకోవడంలో ఇవి ఉపయోగపడతాయి. గతేడాది ఒక్క రాకెట్టుతో 104 ఉపగ్రహాలను కక్ష్యలో ప్రవేశపెట్టి ఇస్రో చరిత్ర సృష్టించడం ఒక ఎత్తయితే ఇప్పుడు నిఘా కెమెరాగా ఈప్రయోగం పనిచేయనుంది. దానిని మించి చంద్రాయాన్-2 సత్తా చాటింది. ఇంతకన్నా ఘనత భారత్‌కు మరోటి ఉండ బోదు. ఆర్థిక అండదండలు అందిస్తే ఇంతకన్నా అద్భుతాలు సృష్టించగలమని ఇస్రో చాటుకుంది. ఇంత ఘనత సాధించడం వెనక మన శాస్త్రవేత్తల కృషి అమోఘం.. అనిర్వచనీయం. అపార అనుభవమూ, అత్యంత విలువైన సేవలు... ఇస్రో ప్రత్యేకత. ఇలా గతంలో ఎన్నో విజయాలు సొంతం చేసుకున్న ఇస్రో తాజాగా సాధించిన విజయం ఆషామాషీ వ్యవహారం కాదు. ప్రపంచ దేశాలకు ఇదో సవాల్‌గానే భావించాలి. చంద్రయాన్, అంగారక యాత్రలకు మనసత్తా చాటే ప్రయత్నమిది. అంతేగాకుండా అంతరిక్షంలో అనాదినుంచి మనకు ఎదురులేదని నిరూపించిన మహత్తర ఘట్టం ఇది. ఇస్రో వరుస విజయాలను చూస్తుంటే మనం ఎవరితోనూ తీసిపోమని రుజువు చేసుకుంటున్నాం. ప్రోత్సాహం, ఆర్థిక సాయం అందించి పరిశోధనలకు ఊతమిస్తే ఎంతటి ఘనవిజయాలనైనా ఇస్రో చేసి చూపిస్తుందని నిరూపించారు మన శాస్త్రవేత్తలు. ఇస్రోకు పూర్తి సహకారం ఇస్తే రక్షణ రంగంలో కూడా గణనీయమైన పరిశోధనలు దక్కుతాయి. పొరుగుదేశం చైనా రక్షణ రంగంపై విపరీత పరిశోధనలు చేస్తూ ప్రపంచానికి సవాల్ విసురుతోంది. అంతరిక్ష పరిశోధనలపై చైనా భారీగా నిధులు ఖర్చుపెడుతోంది. ఇస్రో చేపడుతున్న పరిశోధనలు విజయవంతం అవుతున్న దశలో ఇస్రో సహకారంతో రక్షణరంగ పరిశోధనలు ముమ్మరం చేయాల్సి ఉంది. ఉపగ్రహ ప్రయోగాలు వరుసగా విజయవంతం కావడం భారత అంతరిక్ష ప్రయోగాల చరిత్రలో నూతన అధ్యాయానికి తెర తీసింది. ఆధునిక పరిజ్ఞాన వినియోగంలోనూ సాధికారిత సాధించామని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు ప్రపంచానికి చాటి చెప్పారు.

# అంతరిక్షంలోకి భారత వ్యోమగాములు

## త్వరలోనే సాకారం కానున్న పరిశోధనలు

శ్రీహరికోట,జూలై23(ఆర్ఎన్ఎ): ఒకేసారి 104 ఉపగ్రహాలను ప్రయోగించిన తరవాత ప్రపంచ దేశాలన్నీ మన అంతరిక్ష పరిశోధన సంస్థను కీర్తిస్తున్న వేళ చంద్రయాన్-2 విజయం ఇస్రో కీర్తిని ఇనుమడించేలా చేసింది. అనూహ్యంగా మనం అంతరిక్షంలో దూసుకుని పోతున్న తీరు ప్రపంచ దేశాల సరసన నిలబెట్టింది. ఇప్పటిదాకా మనుషుల్ని అంతరిక్షంలోకి పంపిన అనుభవం లేదు మనకు. ఆ లోటూ త్వరలోనే తీరనుంది. మానవసహిత అంతరిక్ష కార్యక్రమాల కోసం వ్యోమగాముల ఎంపిక పక్రియా మొదలైపోయింది. ఇస్రో, భారత వైమానిక దళం సంయుక్తంగా చేపట్టిన ప్రతిష్ఠాత్మక కార్యక్రమం ఇది. ఈ ప్రాజెక్టుతో రష్యా, అమెరికా, చైనాల సరసన మనమూ చేరనున్నాం. ప్రయోగించే ప్రతి ఉపగ్రహానికీ ఒక వాహక నౌకను తయారు చేసుకోవడం అంటే, వేలకోట్ల రూపాయల వ్యవహారం. అది కూడా ఒక్కసారికే పనికొస్తుంది. అదే నౌకను వెనక్కి రప్పించుకుని, మళ్లీ మళ్లీ ఉపయోగిస్తే - బొక్కసానికి భారం తగ్గుతుంది. అంతరిక్ష ప్రయోగాల వ్యయమూ ఎనభైశాతం మేర పడిపోతుంది. ఆ ఆలోచనతోనే... ఇస్రో పునర్వినియోగ వాహక నౌకను రూపొందించింది. ప్రయోగాత్మకంగా శ్రీహరికోట నుంచీ 65 కిలోమీటర్ల ఎత్తు వరకూ పంపి, మళ్లీ వెనక్కి తెప్పించింది. ఆ ఉత్సాహంతోనే ఈసారి ఇంకో అడుగు ముందుకేయబోతోంది.అంతరిక్ష రేసులో భారత్ అగ్రస్థానంలో దూసుకెళ్లుతున్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఒకప్పుడు అమెరికా, రష్యా మధ్య ఉన్న స్పేస్‌వార్ ఇప్పుడు ఆసియాలో కనిపిస్తున్నదన్నా ఆశ్చర్యం లేదు. గతంలో రష్యా మాత్రమే అత్యధిక స్థాయిలో ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపింది. 2014లో 37 ఉపగ్రహాలను ఒకేసారి కక్ష్యలోకి ప్రయోగించింది. ఇప్పుడు దానికి మూడు రెట్లు మన ఇస్రో ప్రయోగాన్ని పూర్తి చేసింది. భారత్‌తో పాటు చైనా, జపాన్ అంతరిక్ష సంస్థలు కూడా సాహసోపేతమైన అంతరిక్ష ప్రయోగాలకు సిద్ధంఅవుతున్నాయి. గతంలో ఇస్రో ప్రయోగించిన ఉపగ్రహాల్లో అమెరికాతో పాటు కజకిస్తాన్, ఇజ్రాయిల్, నెదర్లాండ్స్, స్విట్జర్లాండ్, యూఏఈ దేశాలకు చెందిన శాటిలైట్స్ ఉన్నాయి. ఒకేసారి అత్యధిక స్థాయిలో ఉపగ్రహాలను పంపడం వల్ల ఖర్చు సుమారు 60 నుంచి 70 శాతం వరకు తగ్గుతుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ దశాబ్దం చివర వరకు చైనా కూడా అంతరిక్ష అద్భుతానికి సన్నాహాలు చేస్తున్నది. చైనా ఏకంగా చంద్రుడి మీదే అడుగుపెట్టాలని భావిస్తున్నది. ఆ దిశగా డ్రాగన్ దేశం ప్రయోగాలు కొనసాగిస్తున్నది. మార్స్ గ్రహం మీద రోవర్ కూడా దించేందుకు ఆ దేశం ఆలోచిస్తున్నది. జపాన్ కూడా మూన్ లక్ష్యంగా ప్రయోగాలను నిర్వహిస్తున్నది. చిన్న చిన్న రాకెట్ ప్రయోగాలతో జాక్సా కూడా ఆసియా స్పేస్ రేసులో మందడుగు వేస్తున్నది. ఏదేమైనా ఇస్రో సృష్టించిన విప్లవం ఆసియా దేశాల్లో అంతరిక్ష పరిశోధనల మధ్య పోటీతత్వానికి దారితీసింది. పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీలు ఇస్రోకు అండదండగా మారాయి. అవే మన గగన కీర్తిని చాటుతున్నాయి.

# ఆర్యభట్టతో ఆకాశంలో మొదలైన ప్రస్థానం

## అంచెలంచలుగా విజయాల నమోదు

శ్రీహరికోట,జూలై23(ఆర్ఎన్ఎ): ఆర్యభట్టతో ఇస్రో తన ప్రయోగాల పరంపరను ప్రారంభించింది మొదలు ఇప్పటి వరకు ఎన్నో ఒడిదుడుకులను, ఆర్థిక ఇబ్బందునలు ఎదుర్కొన్నా, ఎప్పుడూ వెనకడుగు వేయలేదు. ఎత్తిన తలదించలేదు. 1962లో కేరళలోని తుంబ రాకెట్ ప్రయోగకేంద్రంతో అంతరిక్ష పరిశోధనలో తొలి అడుగుపడింది మొదలు ఇస్రో కేంద్రంగా సాగుతున్న పరిశోధనలు, ప్రయోగాలే ఇందుకు నిదర్శనం.

ముందుగా, వాతావరణ పరిస్థితుల అధ్యయనానికి ఉపకరించే మూడు అడుగుల చిన్న సౌండ్ రాకెట్లను (ఆర్‌హెచ్-75) అంతరిక్షానికి పంపింది. 1975లో రష్యా సాయంతో మన తొలి ఉపగ్రహం ఆర్యభట్టను చేరవేసింది. అనంతరం 1979లో, శ్రీహరికోట కేంద్రం నుంచి ఎస్ఎల్వీ రాకెట్‌ను నింగి మీదికి సంధించింది. ప్రయత్నం విఫలమైనా, ఆ అనుభవం నుంచి నేర్చుకున్న పాఠాలతో... 1980లో ఎస్ఎల్వీ రాకెట్ రోహిణిని విజయవంతంగా గగనానికి చేర్చింది. 1979-81 మధ్యలో భాస్కర ప్రయోగం మరో ముందడుగు. సామాన్యులకు శాస్త్ర, సాంకేతిక ఫలితాలను చేరువ చేసేందుకు సమాచార ఉపగ్రహ ప్రయోగాలనూ చేపట్టింది. 1975-76లో 'శాటిలైట్ ఇన్‌స్టుమెంట్ టెలివిజన్ ఎక్స్‌పరిమెంట్' ద్వారా... సమాచార ఉపగ్రహాన్ని విద్యా బోధన సాధనంగా ఎలా ఉపయోగించుకోవచ్చో కూడా నిరూపించింది. 1979లో ఆపిల్ సమాచార ఉపగ్రహాన్ని పంపింది.

1982-90 మధ్యకాలంలో విదేశీ రాకెట్ల సాయంతో ఇన్సాట్-1ను నింగికి చేరవేసింది. ఇది ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాలను అనుసంధానం చేసి వినోద, విజ్ఞానాలతోపాటు విద్యావ్యాప్తికి దోహదపడింది. ఆతర్వాత చంద్రయాన్, మంగళ్‌యాన్ తదితర ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలకూ శ్రీకారం చుట్టింది. అందులోనూ గత ఏడాది...మొతం తొమ్మిది ప్రయోగాలు చేపట్టింది.

అన్నీ విజయవంతం అయ్యాయి. ఒక రాకెట్ ద్వారా వేర్వేరు కక్ష్యల్లో ఉపగ్రహాలు ప్రవేశపెట్టడం. పీఎస్ఎల్వీ-సి36 పీఎస్4లో (నాల్గో దశలో) రిమోట్ కంట్రోల్ సిస్టమ్‌తో ద్రవ ఇంధనం నింపడం, నావిక్ వ్యవస్థ ద్వారా రాకెట్ పర్యవేక్షణ, ప్రతికూల వాతావరణంలోనూ రాకెట్ అనుసంధానం, మేక్ ఇన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఉపగ్రహంలోని పెలోడ్స్‌ను మనమే అభివృద్ధి చేసుకోవడం... ఇలా అన్నీ విజయాలే. ఒకేసారి 104 ఉపగ్రహాలను ప్రయోగించడం ద్వారా అంతరిక్ష ప్రయోగాల్లో తనకు తానే సాటని ఇస్రో మరోసారి నిరూపించింది. ఒకేసారి 104 ఉపగ్రహాలను ప్రయోగించి అంతరిక్ష ప్రయోగాల్లో చరిత్ర సృష్టించిన ఇస్రోకు అన్నివర్గాల నుంచి ప్రశంసలు అందాయి. భారత కీర్తి పతాకను రోదసిలో సగర్వంగా ఎగురవేయడం గర్వకారణం ఇస్రో ప్రపంచవ్యాప్త అంతరిక్ష ప్రయోగాలకు కేంద్ర బిందువు కానుంది. చంద్రాయాన్-2 ఇస్రో పరిశోధనల్లో కీర్తిచంద్రికగా నిలవనుంది.

## ఏపీ వార్తలు

### ముగ్గురు టీడీపీ సభ్యులపై

# సస్పెన్షన్ వేటు

**- సభనిర్వహణకు అడ్డుతగులుతున్నారని డిప్యూటీ స్పీకర్ నిర్ణయం**
**- సెషన్ ముగిసేవరకు సస్పెన్షన్ వేటు**
**- సస్పెండ్‌ను తీవ్రంగా ఖండించిన సభ్యులు**
**- మార్షల్స్ సాయంతో బయటకు తరలింపు**

అమరావతి, జులై23(ఆర్ఎన్ఎ) : ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో గందరగోళం నెలకొంది. సభా కార్యకలాపాలకు అడ్డు తగులుతున్నారంటూ ముగ్గురు తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు అచ్చెన్నాయుడు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, నిమ్మల రామానాయుడిని బ్జడెట్ సమావేశాలు ముగిసేవరకు డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి సస్పెండ్ చేశారు. ముగ్గురు సభ్యులను సస్పెండ్ చేయాలంటూ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తీర్మానం ప్రవేశపెట్టగా సభ ఆమోదించింది. దీంతో డిప్యూటీ స్పీకర్ వారిని బయటకు వెళ్లాల్సిందిగా ఆదేశించారు. తమను సస్పెండ్ చేయడం అన్యాయమని ముగ్గురు సభ్యులు సభలో కూర్చోగా మార్షల్స్ వారిని బలవంతంగా బయటకు తరలించారు. సస్పెండ్ అయిన ముగ్గురు సభ్యులు టీడీపీ శాసన సభాపక్ష ఉపనాయకులే కావడం గమనార్హం. మంగళవారం ప్రారంభం నుంచి సభలో గందరగోళం నెలకొంది. ప్రశ్నోత్తరాల సందర్భంగా ఫీజు రీయింబర్స్‌మెంట్, డ్వాక్రా మహిళలకు రుణమాఫీ, 45 సంవత్సరాలకే ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలకు పెన్షన్, పంచాయతీరాజ్ శాఖలో నిలిచిపోయిన పనులపై టీడీపీ సభ్యుల ప్రశ్నలు లేవనెత్తగా సంబంధిత మంత్రులు సమాధానాలు ఇచ్చారు. ఆ తర్వాత ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు నామినేటెడ్ పదవుల్లో రిజర్వేషన్లు కల్పించే బిల్లును ప్రభుత్వం ప్రవేశపెట్టగా టీడీపీ సభ్యులు అడ్డుపడ్డారు. డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి కూర్చోవాలని ఎంతగా చెప్పినా వినకపోవడంతో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి.. టీడీపీ సభ్యులు అచ్చెన్నాయుడు, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నిమ్మల రామానాయుడిని సస్పెండ్ చేయాలని తీర్మానం ప్రవేశపెట్టారు. ఇది ఆమోదం పొందడంతో ముగ్గురు టీడీపీ సభ్యులను బ్జడెట్ సమావేశాల మొత్తానికి సస్పెండ్ చేస్తున్నట్లు డిప్యూటీ స్పీకర్ ప్రకటించారు.

సభ నుంచి సస్పెన్షన్‌కు గురైనా ముగ్గురు ఎమ్మెల్యేలు సభలోనే ఉండి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో టీడీపీ సభ్యుల తీరుపై చీఫ్ విప్ శ్రీకాంత్‌రెడ్డి మండిపడ్డారు. సభా సంప్రదాయాలు పాటించని వారిని సభ నుంచి శాశ్వతంగా బహిష్కరించాలని కోరారు. టీడీపీ సభ్యుల ప్రవర్తన చూసి ప్రజలు సిగ్గుతో తలదించుకుంటున్నారని మండిపడ్డారు. సభ నుంచి వెళ్లేందుకు నిరాకరించిన సభ్యులను మార్షల్స్ బయటకు ఎత్తుకెళ్లారు.

సస్పెండ్ అయిన సభ్యులపై అంబటి చలోక్తులు..

సస్పెండ్ అనంతరం టీడీపీ సభ్యులు బటకు వచ్చారు. అదే సమయంలో వైసీపీ ఎమ్మెల్యే అంబటి రాంబాబు అటుగా వచ్చారు. ఏం జరిగిందిని ఆరా తీశారు.. ముగ్గురు ఎమ్మెల్యేలు సస్పెండ్ అయ్యారని చెప్పారు. గత ఐదేళ్లలో మార్షల్స్ ఎప్పుడూ సభలోకి రాలేదని గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. సస్పెన్షన్ విషయం తనకు తెలియదని.. ఇప్పుడే వస్తున్నానంటూ అంబటి సమాధానం ఇచ్చారు. ఎమ్మెల్యేలతో కరచాలనం చేసిన అంబటి.. కంగ్రాట్స్ చెప్పారు. సెషన్ మొత్తం సస్పెన్షన్ చేశారని బుచ్చయ్య చౌదరి చెబితే.. ఇలా 40 రోజుల్లోనే సస్పెండయ్యేలా గొడవ చేయడం ఎందుకు అంటూ రాంబాబు సెటైర్లు పేల్చారు. వచ్చే సెషన్‌లో కలుద్దామంటూ సభలోకి వెళ్లిపోయారు.

తమ సస్పెండ్ అన్యాయం - సస్పెండైన సభ్యులు

ఇటు వైసీపీ సర్కార్, స్పీకర్ తీరుపై సస్పెండైన ముగ్గురు ఎమ్మెల్యేలు మండిపడ్డారు. సస్పెండ్ అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు.. సీఎం జగన్ చెప్పినట్లు స్పీకర్ నడుచుకుంటున్నారని.. శాసనసభను వైసీపీ కార్యాలయంగా మార్చారని ఎద్దేవా చేశారు. హామీలపై ప్రశ్నిస్తే సస్పెండ్ చేశారని, మాట తప్పను, మడమ తిప్పను అన్న జగన్ సమాధానం చెప్పాలన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలను జగన్ కూడా కంట్రోల్ చేయలేకపోతున్నారని మండిపడ్డారు. తనకు కేటాయించిన స్థానం నుంచి కదలకుండా కూర్చున్న తనను అన్యాయంగా శాసనసభ నుంచి సస్పెండ్ చేశారని టీడీపీ ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ ఇచ్చిన హామీలపైనే తాము నిలదీశామని చెప్పారు. 45 ఏళ్లకే పెన్షన్ అని జగన్ హామీ ఇచ్చారని, దానిపై ప్రశ్నించామని తెలిపారు. పాదయాత్రలో దగా హామీలను జగన్ ఇచ్చారని విమర్శించారు. జగన్ ఎంత వెన్నుపోటుదారుడో వీడియో క్లిప్ చూస్తే తెలిసిపోతుందని చెప్పారు. సభలో వీడియోలు ప్రదర్శించే అవకాశాన్ని ప్రతిపక్షానికి కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. శాసనసభను వైసీపీ కార్యాలయంగా మార్చేశారని మండిపడ్డారు. ప్రభుత్వం మాటవిని చెడ్డ పేరు తెచ్చుకోవద్దని స్పీకర్‌కు సూచించారు.

డిప్యూటీ స్పీకర్‌ను కలిసిన టీడీపీ ఎమ్మెల్యేలు..

సస్పెండ్‌కు గురైన తమ సభ్యులను తిరిగి సభకు అనుమతించాలని ఏపీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతిని టీడీపీ ఎమ్మెల్యేలు కోరారు. ఈమేరకు మంగళవారం టీడీపీ సభ్యులు గంటా శ్రీనివాసరావు, కరణం బలరాంలు డిప్యూటీ స్పీకర్‌ను కలిసి సస్పెన్షన్ ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు. ఎలాంటి కారణాలు లేకుండానే సస్పెండ్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ సభ్యుల వినతిపై స్పందించిన డిప్యూటీ స్పీకర్.. ఈ అంశాన్ని అధికార పార్టీ దృష్టికి తీసుకెళ్లారు. పార్లమెంట్ వ్యవహారాల మంత్రి రాజేంద్రనాథ్, ప్రభుత్వ చీఫ్ విప్ శ్రీకాంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. అధికార, విపక్ష సభ్యులతో డిప్యూటీ స్పీకర్ చర్చలు జరిపారు. ఇదిలా ఉంటే అనంతరం మంత్రులు బుగ్గన, శ్రీకాంత్‌రెడ్డిలతో డిప్యూటీ స్పీకర్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించారు. ఈ విషయాన్ని సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్తామని వారు డిప్యూటీ స్పీకర్‌కు తెలిపారు.

# లోకేశ్ అరుదైన వ్యాధితో బాధపడుతున్నాడు

**- నదిని పూడ్చి ఇళ్లు కట్టుకుంటే తప్పేంటమని వాదిస్తున్నారు**
**- దొంగలకిచ్చే నోబెల్ ప్రైజ్ ఏదైనా ఉంటే బాప్-బేటాలకు జాయింట్‌గా ఇవ్వాలి**
**- ట్విట్టర్‌లో వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి**

అమరావతి, జులై22(ఆర్ఎన్ఎ) : తామే సర్వజ్ఞానులమని, అన్యులంతా అజ్ఞానులని భావించేవారు అభిజ్ఞా పక్షపాతంతో ఉంటారని సైకాలజీ చెబుతోందని, దీనిని డునిక్ క్రూక్రిర్ అని పిలుస్తారని, లోకేశ్ సమస్య కూడా ఇదేనని, ఆ వ్యాధితో ఇష్టారీతిలో మాట్లాడుతుండి ఉండవచ్చునని వైసీపీ ఎంపీ విజయసాయి అన్నారు. సోమవారం ఆయన ట్విట్టర్ వేదికగా చంద్రబాబు, లోకేశ్‌లపై తీవ్ర విమర్శలు చేశారు. తండ్రి చాలా కాలం అధికారంలో ఉండటం, ఒక్కడే సంతానం కావడం వల్ల ఈ వ్యాధికి లోనై ఉండవచ్చని ట్వీట్‌లో తెలిపారు. అక్రమ నిర్మాణాలపై టీడీపీ చేస్తున్న విమర్శలపై కూడా ఆయన ట్వీట్ చేశారు. అక్రమ నిర్మాణాలన్నింటినీ కూల్చిన తర్వాతే లింగమనేని గెస్ట్ హౌస్ జోలికి రావాలని అల్టిమేటం ఇస్తున్నారని ఎద్దేవా చేస్తున్నారు. లైసెన్సు లేకుండా వాహనం నడుపుతున్న వ్యక్తిని పోలీసులు అడ్డుకుంటే లైసెన్సు లేని వారందరిని పట్టుకున్న తర్వాతే నా దగ్గరకు రండి అన్నట్టుగా ఉంది చంద్రబాబు వ్యవహారమంటూ విమర్శించారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరాపై టీడీపీ పలు విమర్శలు చేస్తోందని, ప్రపంచమంతా గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తున్నందునే పవన విద్యుత్తును ఎక్కువ ధరకు కొన్నామంటూ చిట్టి నాయుడు మోకాలికీ బోడి గుండుకు ముడిపెడుతున్నాడని ట్వీట్‌లో తెలిపారు. నదిని పూడ్చి ఇళ్లు కట్టుకుంటే తప్పేమిటని వాదిస్తారని, దొంగలకిచ్చే నోబెల్ ప్రైజ్ ఏదైనా ఉంటే బాప్-బేటాలకు జాయింట్‌గా ఇవ్వాలని విజయసాయి అన్నారు. చంద్రబాబు ప్రభుత్వ సంస్థలన్నింటినీ నిర్వీర్యం చేసి కమీషన్ల కోసం ప్రైవేటు కంపెనీలను ప్రోత్సహించినట్లు తెలిపారు. సహకార డెయిరీలు, విద్యాసంస్థలు, ఆర్టీసీ, ఏపీ జెన్కో, డిస్కాంలు అన్నీ దివాళా తీస్తుంటే రోగానికి చికిత్స చేయకుండా సపట్ మలాం పూసి చల్లగా జారుకున్నారంటూ విజయసాయి ట్వీట్‌లో తెలిపారు.

# ఫైబర్ గ్రిడ్ ఒక మాయ..

**- ఈ పథకంపై అనేక ఆరోపణలున్నాయి**
**- అవినీతి ఆరోపణలపై విచారణ జరిపించాలి**
**- ఏపీ ప్రభుత్వాన్ని కోరిన బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్**
**- అవకతవకలపై కేబినెట్ సబ్ కమిటీ విచారణ జరుపుతోంది**
**- ఈవిచారణలో అన్ని నిజాలు బయటపడతాయి**
**- మంత్రి గౌతమ్ రెడ్డి**

అమరావతి, జులై 23(ఆర్ఎన్ఎ) : ఏపీ ఫైబర్ గ్రిడ్ ఒక మాయ అని, ఈ పథకంపై అనేక ఆరోపణలు వెల్లువెత్తాయని, అవినీతి ఆరోపణలపై ఏపీ ప్రభుత్వం విచారణ చేపట్టాలని బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్ వ్యాఖ్యానించారు. శాసనమండలిలో సోమవారం ఏపీ ఫైబర్ గ్రిడ్‌పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. రూ.149 రూపాయలకే కనెక్షన్ ఇస్తామని చెప్పిన చంద్రబాబు ప్రభుత్వం ఎందుకు ఎక్కువ వసూలు చేసిందని ప్రశ్నించారు. ఫైబర్ గ్రిడ్‌పై అనేక ఆరోపణలున్నాయని, విచారణ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ÷బైర్ గ్రిడ్‌ను చేపట్టిన వేమూరి హరికృష్ణ ప్రసాద్‌పై ఈవీఎం ట్యాంపరింగ్ కేసు ఉందని, అతను బ్లాక్‌లిస్ట్‌లో ఉన్నప్పుడు కాంట్రాక్ట్‌ను అతనికి ఎందుకు కట్టబెట్టారని ప్రశ్నించారు. ఈ పథకం కింద నాసిరకం సెటప్ బాక్స్‌లు సరఫరా చేశారన్న ఆరోపణలున్నాయని పేర్కొన్నారు. ఈ వ్యవహారాలన్నింటిపైనా ఎంక్వైరీ చేసి విచారణ జరపాలని కోరారు. దీనికి ఐటీ మంత్రి గౌతంరెడ్డి సమాధానమిస్తూ.. ఏపీ ఫైబర్‌పై అనేక ఆరోపణలున్నాయని, బెంగుళూరులో రూ.1200కు ఇస్తున్న సెటప్ బాక్స్‌లను ఏపీలో రూ. నాలుగువేలకు ఇస్తున్నారని పేర్కొన్నారు. టెండర్ సమయంలో సెంటర్ విజిలెన్స్ గైడ్‌లైన్స్ కూడా పాటించలేదని తెలిపారు. ఏపీ ఫైబర్ గ్రిడ్‌పై జరిగిన అవకతవకలపై కేబినెట్ సబ్ కమిటీ విచారణ జరుపుతోందని, ఈవిచారణలో అన్ని నిజాలు బయటపడతాయన్నారు. అదేవిధంగా రూ. 16వేల కోట్ల నుంచి 55 వేల కోట్లకు పోలవరం ప్రాజెక్టు అంచనాలను ఎలా పెంచారని టీడీపీ ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్ శాసనమండలిలో ప్రశ్నించారు. ఈ అంశంపై జరిగిన చర్చలో బీజేపీ ఎమ్మెల్సీ సోమూ వీర్రాజు మాట్లాడుతూ.. పోలవరంలో జరిగిన అవకతవకలపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. పోలవరంలో ఈపీసీ నుంచి 60సీకి ఇచ్చే అవకాశం లేదన్నారు. చంద్రబాబు ప్రభుత్వం పోలవరం నిర్వాసితులపట్ల కనీసం దృష్టి పెట్టలేదని విమర్శించారు. డ్యాం కడితే సరిపోదని, నిర్వాసితులను ఆదుకోవాలని, అది తమ ప్రభుత్వం చేస్తోందన్నారు. పోలవరం కాపర్ డ్యాం పూర్తయితే.. 18వేల కుటుంబాలు ఇబ్బంది పడతాయని, కనీసం ఆ కుటుంబాలకు గత ప్రభుత్వం నష్ట పరిహారం కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు. నవంబర్ 1వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం పోలవరం పనులు మొదలుపెడుతుందని వెల్లడించారు. పోలవరం కోసం తెచ్చిన ఏ మెటీరియల్ విషయంలోనూ ఆడిట్ చేయలేదని, పోలవరంలో జరిగిన అవకతవకలపై వారం రోజుల్లో సబ్ కమిటీ రిపోర్ట్ ఇస్తుందన్నారు. పోలవరాన్ని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించారని, దానిని సీఎం వైఎస్ జగన్ పూర్తి చేస్తారని ఆయన స్పష్టం చేశారు. ఎన్ని జన్మలెత్తినా తెలుగుదేశం పార్టీ మాత్రం మరోసారి అధికారంలోకి రాదని అన్నారు.

# వర్షాభావంతో పళ్లతోటలకు ముప్పు

### చీనీతోటలను నరికేస్తున్న రైతులు

కడప,జూలై 23(ఆర్ఎన్ఎ): తీవ్ర వర్షాభావంతో వరి సాగు చేసే రైతులతో పాటు పండ్ల తోటల రైతులు విలవిలలాడుతున్నారు. తీవ్ర కరువుతో రైతన్నలు అష్టకష్టాలు పడుతున్నారు. జూలై మాసం గడిచిపోతున్నా వాన చినుకుజాడ లేదు. దీంతో చెరువులు, కుంటలు బీళ్లు వారాయి. బోర్లు అడుగంటాయి. ఉన్న పండ్ల తోటలను కాపాడుకునేందుకు రైతులకు ఆశగా వందలాది అడుగుల లోతుకు బోర్లు వేసినా నీటి జాడే లేదు. దీంతో చేసేది లేక పంటలను వదులుకుంటున్నారు. చీనీ చెట్లు ఎండిపోతుండటంతో చేసేది లేక వాటిని నరికివేస్తున్నారు. బోర్లలో నీటిమట్టం ఇటీవల గణనీయంగా తగ్గింది. మరింత లోతుకు వేసి ఎలాగైనా తోటలను రక్షించుకునే ప్రయత్నంలో లక్షలకు లక్షలు ఖర్చు చేస్తు ఆర్థికంగా నష్టపోతున్నారు. గత మూడు సంవత్సరాలుగా ఎర్రగుంట్ల మండలంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో దాదాపు అన్ని ప్రాంతాల్లో భూగర్భజలాలు అడుగంటాయి. వ్యవసాయ బోర్లతో పాటు తాగునీటి బోర్లలో కూడా నీటిమట్టం తగ్గడంతో ట్యాంకర్లతో నీటిని తోలుకుంటున్నారు. బోరులో కూడా నీరు రాకపోవడంతో విధి లేని పరిస్థితుల్లో చీనీ చెట్లను నరికివేస్తున్నాడు. వర్షాధార పంటలతో నష్టపోయిన రైతులు ఇప్పుడిప్పుడే రైతులు హార్టికల్చర్ వైపు వెళుతున్న సమయంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు వారిని దెబ్బతీస్తున్నాయి.

అందని జాతీయ విపత్తు సాయం

ఇదిలావుంటే 2015 డిసెంబరులో సుమారు 20 రోజుల పాటు ఏకధాటిగా వర్షం కురిసి రైల్వేకోడూరు నియోజకవర్గం అతలాకుతలమైంది. ఇటు రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వంటలు నాశనమయ్యాయి. 2015 డిసెంబరు 10వ తేదీ కేంద్ర బృందం రైల్వేకోడూరు వరదప్రాంతాలను పర్యటించి కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు సమర్పించింది. ఇంతవరకు జాతీయ విపత్తు కింద వరద తాకిడికి నష్టపోయిన ప్రాంతాలకు కేంద్ర సాయం అందలేదని రైతులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆనాడు అరటి, బొప్పాయి, వసువు, కూరగాయలు, తమలపాకు తదితర తోటల రైతులు తీవ్రంగా నష్టపోయారు. పండ్లతోటలకు అరకొర సాయం అందించారు. వరదలకు కోట్లాది రూపాయలు నష్టం వాటిల్లింది.పండ్ల తోటలకు రూ.17 కోట్లు, బ్రిడ్జిలు, రోడ్లు, చెరువులు, కుంటలు సుమారుగా రూ.100 కోట్లు నష్టం వాటిల్లిందని అధికారులు అంచనాలు వేసి పంపారు. ఇంతవరకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదని రైతులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలు పకృతి వైపరీత్యాలకు నాశనం అవుతున్నాయి. వర్షాలు వస్తే అతివృష్టి, లేకుంటే అనావృష్టిగా మారుతోంది. ఈ ఏడాది వర్షాలు లేక పంటలు ఎండుతున్నాయి. గతంలో పసుపు పంట పూర్తిగా వరదనీరు వచ్చి ముంచేసింది.

# గుప్తనిధుల కోసం నరబలి

**ఇటీవలి హత్యలతో ప్రజల్లో ఆందోళన**
**అడ్డూ అదుపులేని దుండగుల తవ్వకాలు**

అనంతపురం,జూలై 23(ఆర్ఎన్ఎ): గుప్తనిధులతో రాత్రికి రాత్రే ఐశ్వర్యవంతులు కావచ్చనే కొందరి అత్యాశ దారుణాలకు దారి తీస్తోంది. గుప్తనిధుల కోసం చారిత్రక కట్టడాలు, పురాతనాలయాలు నిలువునా కూల్చేస్తున్నారు. దేవుడి విగ్రహాలనూ వదలడం లేదు. గుప్తనిధుల వేటలో దుండగులు అరాచకాలకు పాల్పడుతున్నారు. గతంలో గుప్తనిధుల తవ్వకాలకు ముందు జంతు బలులు ఇచ్చే వారు. ఇప్పుడు ఏకంగా నరబలికి బరితెగిస్తున్నారు. ములకలచెరువు మండల సరిహద్దులో ఉన్న అనంతపురం జిల్లా తనకల్లు మండలం కొర్తికోట గ్రామ సమీపంలోని శివాలయం ముందు ఇటీవల నిద్రిస్తున్న కమలమ్మ, శివరామిరెడ్డి, సత్యలక్ష్మిల గొంతుకోసి అతిదారుణంగా హత్య చేసిన ఉదంతం ఈ కోవలోకి వస్తుంది. ఇక వారి రక్తంతో శివలింగం, ఎదురుగా ఉన్న పుట్టకు అభిషేకం చేయడంతో గుప్తనిధుల కోసం నరబలి ఇచ్చారని జోరుగా ప్రచారం సాగింది. అనంతపురం జిల్లా కొర్తికోటలోని ఈశ్వరుడి ఆలయం ముందు నిద్రిస్తున్న ముగ్గురిని దుండగులు అతికిరాతకంగా హత్య చేయడంతో సరిహద్దు గ్రామాల్లో భయం నెలకొంది. గుప్త నిధుల కోసం నరబలి ఇచ్చారని ప్రచారం జోరుగా సాగడంతో రాత్రివేళలో సరిహద్దు గ్రామాలప్రజలు బయటకు రావడానికి భయపడుతున్నారు. ప్రతి రోజూ ఇళ్లముందు పడుకునే గ్రామస్తులు బయటకు రాకుండా ఇళ్లలోనే పడుకున్నారు. ములకలచెరువు మండలంలో అధికంగా ఉన్నర పురాతన ఆలయాల్లో గుప్తనిధుల కోసం చేసిన తవ్వకాలు, దేవుడి విగ్రహాలను ఎత్తుకెళ్లిన ఘటనలు, విగ్రహాలు, ధ్వజస్తంభాలను ఘటనలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. ములకలచెరువు ప్రాంతాన్ని చోళులు, చాణిక్యులు, విజయనగరరాజులు, పాలేగాళు పాలించినట్లు చారిత్రక ఆధారాలున్నాయి. ఇక్కడి పురాతన కట్టడాలు, ఆలయాల్లో గుప్తనిధులు ఉన్నాయని కొందరు ఇప్పటికీ నమ్ముతున్నారు. అందుకే పక్కా పథకం ప్రకారం రాత్రి వేళల్లో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరుపుతున్నారు. ముతాల బారిన పడి ఆలయాల రూపురేఖలు మారిపోతున్నాయి. పురాతన ఆలయాల్లో దేవుళ్ల విగ్రహాల అంతర భాగంలో వజ్ర వైడుర్యాలు ఉన్నాయన్న ఆశతో గుప్తనిధుల ముఠాలు వీటిని వగులగొట్టి పనికిరాకుండా చేస్తున్నాయి. సోంపాళ్యంలో 16వ శతాబ్దంలో విజయనగర రాజులు నిర్మించిన చెన్నకేశవ స్వామి ఆలయంలో మూడేళ్ల క్రితం గుప్తనిధుల ముఠా ఏకంగా గర్భగుడిలో తవ్వకాలు జరిపేందుకు పథకం పన్నింది. కాపలాగా ఉన్న హోంగార్డులు గమనించి ఎదుర్కోవడంతో దుండగులు వారి కళ్లలో కారంపొడి చల్లి పరారయ్యారు. అలాగే గతేడాది ఏప్రిల్ 9న ఈ ఆలయంలో మళ్లీ దొంగలు పడ్డారు. గుప్తనిధుల కోసం ఆలయంలోని రాతి కల్యాణ మండపం పైభాగంలో మొగ్గ ఆకారంలో ఉన్న శిలను ధ్వంసం చేశారు. నందీశ్వరుని ఆలయంలో దుండగులు పలుమార్లు తవ్వకాలు జరగపడంతో ఆలయం కూలిపోయింది. శిల్పాలలో నిధులు దాచి ఉంటారని పగులగొట్టి ధ్వంసం చేశారు. ఇక్కడికి సమీపంలోని శ్రీవీరాంజనేయస్వామి ఆలయం వెనుక పలుమార్లు తవ్వకాలు జరపడంతో ఆలయం గోడ కూలిపోయింది. సోంపాళ్యం నుంచి గట్టుకిందపల్లెకు వెళ్లే దారిలో శ్రీకోటచౌడేశ్వరి పాదాలున్న చోట పదిఅడుగుల వరకు తవ్వకాలు జరిపారు. సోంపల్లెలోని పురాతన శ్రీచంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో ఉన్న నందీశ్వరుడి విగ్రహం ధ్వంస చేశారు. గొల్లపల్లె సమీపంలో ఉన్న అతిపెద్ద శివలింగాన్ని దుండగులు ఎత్తుకెళ్లారు. కొద్దిరోజుల తరువాత శివలింగాన్ని తిరిగి అక్కడే తెచ్చి పెట్టారు. అలాగే పెద్దపాళ్యం సమీపంలో ఉన్న కోట తవ్వకాలతో పూర్తిగా శిథిలమైంది. శిల్పాలు, స్తంభాలు విరిగిపోయాయి. పెద్దేరు ఒడ్డున ఉన్న అంకాలమ్మ ఆలయంలో దుండగులు నిధుల కోసం పలుమార్లు తవ్వకాలు జరిపారు. కనుగొండ అటవీ ప్రాంతంలోని శ్రీకనుగొండ రాయుస్వామి ఆలయంలో కూడా గుప్తనిధుల కోసం పలుమార్లు దుండగులు తవ్వకాలు జరిపారు.

# తిరువూరులో స్పందన కార్యక్రమం

విజయవాడ,జూలై23(ఆర్ఎన్ఎ): కృష్ణా జిల్లా తిరువూరు పట్టణంలోని ఆర్య వైశ్య కల్యాణ మండపంలో సోమవారం 'స్పందన' కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ప్రతిష్ఠాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ మాధవి లత పేర్కొన్నారు. ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ మాధవి లత, నూజివీడు సబ్ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, అసిస్టెంట్ కలెక్టర్ అనుపమ, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# కేరళలో కుండపోత వర్షాలు

**- పలు జిల్లాల్లో స్కూళ్లకు సెలవులు**

తిరువనంతపురం, జులై23(ఆర్ఎన్ఎ) : కేరళల రాష్ట్రంలో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. ఆయా జిల్లాల్లోని ప్రధాన రహదారులు జలమయమవుతున్నాయి. భారీ వర్షాలు కురుస్తుండటంతో లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఇదిలాఉంటే కన్నూరులో వర్షతీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. దీంతో అన్ని ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్, ప్రొఫెషనల్ కాలేజీలకు సెలవులు ప్రకటిస్తున్నట్లు కన్నూరు జిల్లా కలెక్టర్ వెల్లడించారు. యూనివర్సిటీ ఎగ్జామ్స్ పరీక్షల షెడ్యూల్‌లో ఎలాంటి మార్పు లేదన్నారు. కోజికుడ్, వాయ్ నాడ్, కన్నూరు, కసర్గోడ్ ప్రాంతాలకు మంగళవారం రెడ్ అలర్ట్, ఎర్నాకులం, ఇడుక్కి, త్రిశూర్, మలప్పురం, కసర్ గోడ్ ఆరెంజ్ అలర్ట్, త్రిసూర్, పాలక్కడ్, మలప్పురం, కోజికోడ్, వాయనడ్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ఐఎండీ ప్రకటించింది. కోజికోడ్‌లోని క్లాస్ 12 వరకు అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించారు అధికారులు. అంగన్ వాడీలు, కేంద్రీయ విద్యాలయాలు, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ప్రొఫెషనల్ కాలేజీలు సెలవులు వర్తిస్తాయని వెల్లడించారు. తిరువనంతపురం వెంకూడ్‌లోని సెంట్ మేరీ లోయర్ ప్రైమరీ స్కూల్‌కు సెలవు ప్రకటించారు. ఈ స్కూల్‌ను రిలీఫ్ సెంటర్‌గా ఉపయోగిస్తున్నారు. ఇతర అకాడమిక్

ఇనిస్టిట్యూట్‌లకు సెలవు ప్రకటించలేదని, స్కూళ్ల సెలవుల విషయంలో ఎలాంటి వదంతులు వ్యాపింపచేయవద్దని తిరువంతనంతపురం కలెకర్ సూచించారు.

## వరంగల్ అర్బన్

# రాష్ట్ర స్థాయి నాటిక పోటీలు!

వరంగల్ అర్బన్, జులై 23 (నేటినిజం ప్రతినిధి): పిల్లలకు పాఠశాల స్థాయి నుంచి కళాభిరుచి పెంపొందించి లక్ష్యంతో తెలంగాణ సంగీత నాటక అకాడమీ తొలిసారిగా రాష్ట్ర స్థాయి పాఠశాల విద్యార్థుల నాటిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి నారాయణరెడ్డి సోమవారం తెలిపారు. 2019 సెప్టెంబర్ 24 నుంచి 26 వరకు హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగే ఈ పోటీల్లో రాష్ట్రంలోని ప్రభుత్వ, జడ్పీ ఉన్నత, గురుకుల, ప్రైవేటు ఉన్నత పాఠశాలలకు చెందిన 8, 9, 10వ తరగతుల విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. విద్యార్థుల బృందంతో నాటిక రూపొందించి పోటీలకు పంపాలన్నారు. ప్రథమ బహుమతి రూ.25 వేలు, ద్వితీయ బహుమతి రూ.20 వేలు, తృతీయ బహుమతి రూ. 15 వేలు అందించనున్నట్లు తెలిపారు. ప్రాథమిక పరిశీలనలో ఎంపికై తుది పోటీకి వచ్చే ప్రతీ నాటికకు ప్రదర్శన ఖర్చులుగా రూ.8 వేలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 30వ తేదీలోగా పాఠశాలలు తమ బృందం పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఆగస్టు 15లోగా పోటీకి పంపే నాటిక వివరాలతో దరఖాస్తులను బాద్మి శివకుమార్ ఛైర్మన్, తెలంగాణ సంగీత నాటక అకాడమీ కార్యాలయం, రెండో అంతస్తు, కళాభవన్ సైఫాబాద్, హైదరాబాద్ -4 చిరునామాకు వ్యక్తిగతంగా గానీ, పోస్టు ద్వారా గానీ లేదా ఈ- మెయిల్ ద్వారా పంపాలని వివరించారు.

# ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీఛైర్మన్ డాక్టర్ సుధీర్‌కుమార్

వరంగల్ అర్బన్, జులై 23 (నేటినిజం ప్రతినిధి):వరంగల్ అర్బన్ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు జడ్పీ అధ్యక్షుడు డాక్టర్ సుధీర్‌కుమార్ తెలిపారు. సోమవారం భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలిసారి ఆలయానికి వచ్చిన జడ్పీఛైర్మన్ సుధీర్‌కుమార్‌కు అర్చకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. ఆలయ పర్యవేక్షకులు హంసరెడ్డి, అర్చకులు స్వామివారి తీర్థప్రసాదం, చిత్రపటం అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్కార్ పాఠశాలలో ఆంగ్లమాధ్యమంలో బోధించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. ప్రాథమిక పాఠశాల ఆవరణలో అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసి ఆంగ్లబోధన చేపట్టాలని ప్రభుత్వానికి సూచించినట్లు తెలిపారు. అర్బన్ జిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా ఏర్పాటు చేసి అమలు చేస్తామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ఆంగ్లబోధనకు అవసరమైతే వాలంటీర్లను నియమిస్తామన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే అమలు పరుస్తామన్నారు. భీమదేవరపల్లి మండలంలో గద్దలబండ-రత్నగిరి-వంగర మీదుగా రాంనగర్ వరకు తారు రోడ్డు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఎమ్మెల్యే సతీష్‌కుమార్ సహకారంతో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామన్నారు. రెండు పడకల ఇళ్లు మరిన్ని మంజూరు చేయనున్నట్లు తెలిపారు. జడ్పీటీసీ సభ్యుడు వంగ రవీందర్, ఎంపీపీ జక్కుల అనిత తదితరులున్నారు.

# చిత్తూరు జిల్లాలో దారుణం

**- కుమార్తెపై యాసిడ్ దాడికి పాల్పడ్డ తల్లి**
**- తీవ్ర గాయాలైన చల్లమ్మను ఆస్పత్రికి తరలించిన స్థానికులు**
**- తల్లి లక్ష్మమ్మను అదుపులోకి తీసుకున్న పోలీసులు**

చిత్తూరు, జులై23(ఆర్ఎన్ఎ) : చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం నక్కబండలో దారుణం జరిగింది. కన్న కూతురిపైనే తల్లి యాసిడ్ దాడికి పాల్పడింది. కూతురు చల్లమ్మకు తీవ్రంగా గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు చల్లమ్మను ఆస్పత్రికి తరలించారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు తల్లి లక్ష్మమ్మను అదుపులోకి తీసుకున్నారు. కుమార్తె చల్లమ్మ వేరు కాపురం విషయంలో తల్లీ కుమార్తెల మధ్య గత కొంతకాలంలో తలెత్తిన గొడవ కాస్తా ఏకంగా కన్నకూతురిపైనే తల్లి యాసిడ్ దాడికి పాల్పడేస్థాయికి చేరుకుంది. యాసిడ్ దాడిలో చల్లమ్మకు ముఖం, చాతీ, చేతులు చాలా వరకు కాలిపోయాయి. దీంతో చల్లమ్మను హుటాహుటిన గ్రామస్థులు పుంగనూరు ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించటంతో మెరుగైన చికిత్స కోసం చిత్తూరు ఆస్పత్రికి తరలించారు.

కాగా గత కొంతకాలంలో తల్లితోనే కలిసి ఉండే చల్లమ్మ తల్లితో వేగలేక వేరుగా ఉంటానని అనటం..తల్లి వ్యతిరేకించటం జరుగుతోంది. అయినా చల్లమ్మ వేరుగా వెళ్లేందుకు సిద్ధపడటంతో తీవ్ర ఆగ్రహానికి గురైన లక్ష్మమ్మ యాసిడ్ దాడికి పాల్పడింది. కన్న కూతురిపైనే ఇంతటి దారుణానికి ఒడిగడతావా అంటు స్థానికులు ప్రశ్నించగా వారిపై ఎదురు దాడికి దిగింది లక్ష్మమ్మ. నాకూతురు నాఇష్టం..ఆమెకు ఏమన్నా అయితే కష్టం.. నష్టం నాకు కాక నీకా అంటు ఎదురు ప్రశ్నిస్తోంది. లక్ష్మమ్మను అదుపులోకి తీసుకునేందుకు వచ్చిన పోలీసులపై కూడా లక్ష్మమ్మ వాగ్వాదానికి దిగింది. నాకూతురు నా ఇష్టమొచ్చినట్లు చేసుకుంటాను అడగటానికి మీరెవరు? అంటు ప్రశ్నించింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు లక్ష్మమ్మకు యాసిడ్ ఎక్కడ నుంచి వచ్చింది? ఎక్కడి కొనుగోలు చేసింది అని దర్యాప్తు చేస్తున్నారు.

ములుగు

## 40 మంది బాల కార్మికుల గుర్తింపు

ములుగు, జులై 23 (నేటినిజం ప్రతినిధి):ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా జులై 1 నుంచి నేటి వరకు 40 మంది బాల కార్మికులను గుర్తించినట్లు జిల్లా బాలల సంరక్షణాధికారి ఓంకార్ తెలిపారు. సోమవారం ములుగు మండలం మల్లంపల్లిలో దుకాణాలు, ఇటుక బట్టీలలో దాడులు నిర్వహించి ఇద్దరు బాల కార్మికులను గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జులై 1 నుంచి 31 వరకు ఆపరేషన్ ముస్కాన్ అనే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. గుర్తించిన బాల కార్మికులను వరంగల్‌లోని బాలల సంక్షేమ సమితిలో చేర్పించినట్లు వివరించారు. జిల్లా బాలల సంరక్షణ విభాగం, పోలీస్, కార్మిక శాఖలు సంయుక్తంగా దాడులు నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. 14 సంవత్సరాల లోపు బాలలను పనిలో పెట్టుకున్న ఇద్దరు యజమానులపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు. 14 సంవత్సరాల లోపు వయసున్న బాలలంతా బడిలో ఉండాలని సూచించారు. బాలలతో పనులు చేయిస్తే యజమానులపై చట్టరీత్యా చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ బి.జ్యోతి పాల్గొన్నారు.

## వినతులు స్వీకరించిన పీవో



ఐటీడీఏలో వినతులు సమర్పిస్తున్న గిరిజనులు

ములుగు, జులై 23 (నేటినిజం ప్రతినిధి): ఏటూరునాగారం ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన గిరిజనులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీవో చక్రధర్‌రావుకు వినతులు సమర్పించారు. కేసముద్రం మండలం సబ్‌స్టేషన్ తండాకు చెందిన బాదావత్ సరోజ, గుగులోతు గోజి, జరుపుల బుజ్జి తాము 25 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇప్పించాలని కోరుతూ వినతులు సమర్పించారు. కన్నాయిగూడెం మండల కేంద్రానికి చెందిన బోదెబోయిన సమ్మయ్య తన వ్యవసాయ బోరుకు విద్యుత్ కనెక్షన్ ఇప్పించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించాడు. ఏటూరునాగారం మండలం ఎక్కెల శివారులో గల 30 సర్వే నంబర్ భూమిలో వివాదం తలెత్తిందని, స్థానిక రెవెన్యూ అధికారులు ఆ భూమిపై వేరే వారికి పట్టాదారు పాసుపుస్తకాలు ఇప్పించడంతో పాటు, రైతుబంధు కూడా ఇప్పించారని ఆ గ్రామానికి చెందిన దుబ్బ సమ్మక్క, తెల్లం పుల్లమ్మ వినతిపత్రం సమర్పించారు. గూడూరు మండలం బొందలగడ్డ తండాకు రోడ్ల సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఆ గ్రామస్థులు వినతులు సమర్పించారు. తన సోదరుడు పీఈటీగా పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందాడని, కారుణ్య నియామకం కింద తనకు ఏదైనా ఉద్యోగావకాశం కల్పించాలని కోరుతూ మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం సాధిరెడ్డిపల్లికి చెందిన ఆలూరి సౌందర్య వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఏపీవో వసంతరావు, ఏడీఏ శ్రీధర్, గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ విభాగం ఈఈ మురళీమోహన్, పీఏవో లక్ష్మీప్రసన్న, మేనేజర్ లాల్, పీహెచ్‌వో సంజీవరావు, ఏటీడీవో క్షేత్రయ్య, పీసా కోఆర్డినేటర్ ప్రభాకర్, ఏసీఎంవో సారయ్యదొర, సీడీపీవో హేమలత పాల్గొన్నారు.

## అమరావతి నిర్మాణ పనుల్లో అపశృతి

### ముగ్గురు బీహార్ కార్మికుల మృతి

అమరావతి,జూలై23(ఆర్ఎన్ఎ): ఏపీ రాజధాని అమరావతిలో నిర్మిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నివాస భవనాల వద్ద సోమవారం సాయంత్రం జరిగిన లిఫ్టు ప్రమాదంలో ఎన్‌సీసీ కంపెనీకి చెందిన ముగ్గురు సాంకేతిక సిబ్బంది మృతి చెందారు. భవనానికి సంబంధించి ఐదో అంతస్తులో పనిచేస్తుండగా తాత్కాలికంగా ఏర్పాటు చేసుకొన్న లిఫ్టు గొలుసు హఠాత్తుగా తెగిపోయింది. దీంతో అందులో కూర్చొని పనిచేస్తున్న ముగ్గురు వ్యక్తులు కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేందుకు మంగళగిరి ఎన్ఆర్ఐ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతిచెందారు. మృతులను బిహార్ రాష్ట్రానికి చెందిన రాహుల్ కుమార్, కృపాల్ కుమార్, సురేంద్ర కుమార్‌గా గుర్తించారు. వీరందరూ సంవత్సరం క్రితం విధుల్లో చేరారు.

## రామకుప్పంలో నకిలీ నోట్ల మార్పిడి

### 2కోట్ల నకిలీ కరెన్సీ స్వాధీనం: ఆరుగురు అరెస్ట్

చిత్తూరు,జూలై23(ఆర్ఎన్ఎ): చిత్తూరు జిల్లా రామకుప్పం మండల పరిధిలో రూ.2 కోట్ల నకిలీ కరెన్సీ నోట్లను కుప్పం సర్కిల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు బాధ్యులైన ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. రామకుప్పం మండల పరిసరాలలో నోట్ల మార్పిడి చేస్తున్నట్లు సమాచారం అందడంతో స్థానిక పోలీసుల సహకారంతో పట్టుకున్నారు. కలర్ జెరాక్స్‌తో ముద్రించిన నోట్లను మారుస్తున్నట్లు గుర్తించారు. నిందితుల్లో ముగ్గురు తిరుపతి, ఒకరు కుప్పం, ఇద్దరు బెంగళూరువాసులు ఉన్నట్లు చెబుతున్నారు.

## విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

### లక్ష్యం మేరకు చదువు కోవాలన్న ఎమ్మెల్యే

కాకినాడ,జూలై23(ఆర్ఎన్ఎ): విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నతమైన లక్ష్యాన్ని ఎంచుకొని ప్రతి ఒక్కరూ ప్రణాళికాబద్ధంగా చదవువుకోవాలని రాజోలు ఎంఎల్ఎ రాపాక వరప్రసాదరావు పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సూచనలకు అనుగుణంగా కష్టపడితే లక్ష్యాన్ని నెరవేర్చుకోవడంతో పాటు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తారని అన్నారు. సోమవారం బి.సావరం గ్రామంలో ఉన్న మండల ప్రజా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో 8 వ తరగతి చదివిన బాలికలకు రాజన్న బడి బాట సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఎల్ఎ రాపాక వరప్రసాదరావు మాట్లాడుతూ... ప్రతి పేదింటి బిడ్డను విద్యావంతులుగా చేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అమ్మ ఒడి పథకాన్ని ప్రవేశ పెట్టారని చెప్పారు. ఈ పథకంలో పేద విద్యార్థుల తల్లిదండ్రులకు ఎలాంటి ఖర్చు లేకుండా చేయడానికి రూ.15 వేలు అందజేస్తామని తెలిపారు. ప్రభుత్వం సమకూర్చిన సదుపాయాలను ఉపయోగించుకొని బాల బాలికలు మంచి ఫలితాలు సాధించాలని రాపాక వరప్రసాదరావు ఆశించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి జొన్నలగడ్డ గోపాలకృష్ణ, మాజీ సర్పంచ్ కుంపట్ల మంజు లతా చిన్నారి, మాజీ ఎంపిటిసి సభ్యులు కంచి నాగమణి, విద్యా కమిటీ ఛైర్మన్ చెల్లుబోయిన శరన్ జోస్నా, కంచి వెంకట రమణ, కూనపరెడ్డి రాంబాబు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తిరుమలలో మరో భారీ చోరీ

### - రూ.3లక్షల విలువైన బంగారం, నగదు అపహరణ
### - కేసునమోదు చేసి దర్యాప్తుచేస్తున్న పోలీసులు

తిరుమల, జులై23(ఆర్ఎన్ఎ) : పవిత్ర పుణ్యక్షేత్రం తిరుమలలో దొంగలు రెచ్చిపోతున్నారు. మరోసారి కాటేజీల్లో దొంగలు పడ్డారు. కొన్ని రోజుల క్రితం అతిథిగృహంలో దొంగతనం జరిగిన ఘటన మరువకముందే మరో చోరీ జరిగింది. ఈసారి సన్నిధానం అతిథిగృహంలో దొంగతనం జరిగింది. తాళాలు పగలకొట్టి రూమ్ నెంబర్ 47లోకి చొరబడిన దొంగలు.. రూ.3లక్షలు విలువైన బంగారు నగలు, రూ.20వేలు నగదు అపహరించుకుపోయారు. బాధితులు విజయవాడకు చెందిన భక్తులు. దీనిపై వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు రంగంలోకి దిగారు. విచారణ చేపట్టారు. డాగ్ స్క్వాడ్ తో ఘటనా స్థలానికి వచ్చారు. సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అతిథి గృహంలో పనిచేస్తున్న సిబ్బందిని అదుపులోకి తీసుకుని పోలీసులు ప్రశ్నిస్తున్నారు. అతిథి గృహంలో పని చేసిన సిబ్బందే చోరీకి పాల్పడ్డారా లేక వీళ్లకు సంబంధించిన వేరేవాళ్లు ఎవరైనా చోరీ చేశారా అనే విషయాన్ని ఆరా తీస్తున్నారు. సాధ్యమైనంత తొందరగా నిందితులను అరెస్ట్ చేసి దొంగిలించిన సొమ్మును రికవరీ చేస్తామని చెప్పారు. తిరుమలలో నిత్యం ఫుల్ సెక్యూరిటీ ఉంటుంది. కాటేజీల దగ్గర ప్రత్యేక భద్రత ఉంటుంది. నిత్యం భక్తులు తిరుగుతుంటారు. అడుగడుగునా సీసీ కెమెరాలు ఉంటాయి. ఇంత సెక్యూరిటీ ఉన్నా దొంగతనాలు జరుగుతుండటం భక్తుల్లో ఆందోళన నింపింది. నెల రోజుల వ్యవధిలో ఇది రెండో చోరీ ఘటనలు జరిగాయి. వరుస దొంగతనాలు భక్తులను కలవరానికి గురి చేస్తున్నాయి. పోలీసులు భద్రత పెంచాలని, ఇలాంటి ఘటనలు జరక్కుండా చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

## పంటకాల్వలోకి దూసుకెళ్లిన బైకు

### ఇద్దరు చిన్నారులు సహా యువతి మృతి

కాకినాడ,జూలై23 (ఆర్ఎన్ఎ): తూర్పుగోదావరి జిల్లా మలికిపురం మండలం గుడిమెల్లంక వద్ద విషాదం చోటు చేసుకుంది. ప్రమాదవశాత్తు పంట కాల్వలోకి ద్విచక్రవాహనం దూసుకుపోయింది. మంగళవారం ఉదయం జరిగిన ఈ ఘటనలో ఇద్దరు చిన్నారులు సహా, మరో యువతి మృతి చెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం కాజా గ్రామానికి సుగుణ తన ఇద్దరు పిల్లలు భార్గవి(5), కిరణ్మయి(4)తో కలిసి అన్న బ్రహ్మాజీ, వారి బంధువు కృప(23) ఒకే ద్విచక్రవాహనంపై సఖినేటిపల్లిమండలం పెదలంకకు వెళ్తున్నారు. గుడిమెల్లంక వంతెన సమీపంలోని వినాయకుని గుడివద్ద వచ్చేసరికి ద్విచక్రవాహనం అదుపు తప్పి గుడిమెల్లంక ప్రధాన పంట కాల్వలోకి దూసుకుపోయింది. బ్రహ్మాజీ, సుగుణలకు ఈతరావడంతో బయటకు వచ్చేశారు. కృప, భార్గవి, కిరణ్మయి పంటకాల్వలో మునిగి గల్లంతయ్యారు. గమనించిన స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది సహాయంతో కృప, భార్గవి మృతదేహాలను బయటకు తీసుకువచ్చారు. మరో మృతదేహం కోసం గాలిస్తున్నారు. మలికిపురం ఎస్సై రామారావు వారి సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాలను పరిశీలించి వివరాలు సేకరించారు.

## మేమున్నది టాయ్‌లెట్లు శుభ్ర చేయడానికి కాదు

### ప్రజ్ఞా వ్యాఖ్యలపై మండిపడ్డ కాంగ్రెస్
### సీరియస్ అయిన బిజెపి అధిష్టానం

భోపాల్,జూలై23(ఆర్ఎన్ఎ): భోపాల్ పార్లమెంటు సభ్యురాలు, భాజపా నేత ప్రజ్ఞా సింగ్ ఠాకూర్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఎంపీలుగా ఎన్నికయ్యింది టాయిలెట్లు శుభ్రం చేయడానికి కాదంటూ వ్యాఖ్యానించారు. దీనిపై కాంగ్రెస్ అప్పుడే విమర్శలకు దిగింది. ప్రధాని ప్రతిష్మాత్మకంగా భావిస్తున్న స్వచ్ఛ భారత్ పథకంలోని డొల్లతనం ప్రజ్ఞా వ్యాఖ్యలతో బహిర్గతమయిందని విమర్శించారు. ప్రజా సమస్యల పట్ల భాజపా ఎంపీలకున్న నిబద్ధతకు ఆమె మాటలే నిదర్శనమన్నారు. మరోవైపు బిజెపి అధిష్టానం కూడా సాధ్వి ప్రకటనపై అసమనం వ్యక్తం చేసింది. వెంటనే పార్టీ కార్యాలయానికి రావాలని ఆదేశించింది. ఈ వివాదంపై ప్రజ్ఞా సింగ్ ఠాకూర్ స్పందించారు. తన ప్రసంగంలోని కొంత భాగాన్నే చూపించి కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజా సమస్యలపై పోరాడే విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని.. ప్రధాని స్వచ్ఛ భారత్ పథకం విజయవంతం చేయడానికి కృషి చేస్తానన్నారు. భాజపా కార్యకర్తలతో ఆదివారం జరిగిన ఓ సమావేశంలో ఆమె మాట్లాడారు. మేమున్నది మురికి కాలువలు, మరుగుదొడ్లు శుభ్రం చేసేందుకు కాదు. దేని కోసం అయితే ఎన్నికయ్యామో ఆ బాధ్యతల్ని నిజాయతీగా నిర్వర్తిస్తాం. ఒక ఎంపీగా ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులతో కలిసి పనిచేయడమే మా విధి అని ప్రజ్ఞా వ్యాఖ్యానించారు. అలాగే పార్లమెంటు సమావేశాల ముగిసిన అనంతరం ప్రజా సమస్యలపై దృష్టి సారిస్తామన్నారు. అభివృద్ధి పనుల కోసం కేటాయించిన నిధుల్ని దుర్వినియోగం చేయకుండా ప్రజా శ్రేయస్సు కోసమే వినియోగిస్తామని హామీ ఇచ్చారు. ప్రజ్ఞా సింగ్ వ్యాఖ్యల్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా తప్పుబట్టింది. ప్రధాని నరేంద్రమోదీ 'స్వచ్ఛభారత్' మిషన్‌ను కించపరిచేలా వ్యాఖ్యానించిన బీజేపీ ఎంపీ సాధ్వి ప్రజ్ఞాసింగ్ ఠాకూర్‌పై అధిష్ఠానం అసహనంగా ఉంది. మధ్యప్రదేశ్‌లో సెహోర్‌లో ఆదివారం ప్రజ్ఞాసింగ్ మాట్లాడుతూ.. తాను మరుగుదొడ్లు క్లీన్ చేసేందుకు ఎన్నిక కాలేదని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దీంతో ఒక్కసారిగా దుమారం రేగింది. ఆమె వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించిన బీజేపీ సమన్లు పంపింది. ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ఇటువంటి వ్యాఖ్యలు చేయొద్దంటూ అధిష్ఠానం నుంచి ఆమెకు ఆదేశాలు వెళ్లాయి. అంతేకాదు, వివరణతో ఢిల్లీలోని పార్టీ కార్యాలయానికి రావాలని అధిష్ఠానం ఆదేశించింది. వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం సాధ్వికి ఇదే తొలిసారి కాదు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ఆమె మాట్లాడుతూ.. మహాత్మాగాంధీని హత్య చేసిన నాథూరామ్ గాడ్సేను దేశభక్తుడిగా కొనియాడారు. ఆమె వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తడంతో దిగొచ్చిన మాలేగావ్ పేలుళ్ల నిందితురాలైన ప్రజ్ఞ క్షమాపణలు చెప్పారు. ప్రధాని మోదీ కూడా ఆమె వ్యాఖ్యలను తప్పుబట్టారు. ఇటువంటి వ్యాఖ్యలను క్షమించబోనన్నారు. పార్టీ ఆమెకు షోకాజ్ నోటీసు కూడా జారీ చేసింది. అంతకుముందు ఏటీఎస్ చీఫ్ హేమంత్ కర్కరే తన శాపం వల్లే ముంబై ఉగ్రదాడిలో చనిపోయారని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలకు కూడా ఆమె క్షమాపణలు చెప్పారు.

## మీడియా తీరుపై మండిపడ్డ ప్రశాంత్ కిషోర్

### శివసేనకోసం పనిచేస్తున్నానంటూ కథనాలపై అసహనం

న్యూఢిల్లీ,జూలై23 (ఆంఎన్ఎ): ప్రముఖ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ మీడియా, వార్తా పత్రికలపై మండిపడ్డారు. ప్రస్తుతం ఆయన శివసేన యువనేత ఆదిత్య ఠాక్రేతో కలిసి పనిచేస్తున్నారని ఓ పత్రిక రాసింది. ఆ వార్తను ఉద్దేశిస్తూ ప్రశాంత్ మాట్లాడారు. తనకు మీడియా అంటే ఎంతో గౌరవం ఉందని, ఇలాంటి వార్తల గురించి విన్నప్పుడు చాలా బాధగా అనిపిస్తు ందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...'నిజం చెప్పాలంటే ఈ మధ్య నేను ఎక్కడ పనిచేస్తున్నానో నాకంటే బాగా మీడియాకే తెలుస్తోంది. వార్తా పత్రికల్లో చదవి తెలుసుకోవాల్సి వస్తోంది' అని అన్నారు. ఈ విషయంపై ఆయన ట్విటర్‌లోనూ స్పందించారు. కొన్ని రోజుల్లో మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు జరగున్నాయి. ఈ నేపథ్యంలో శివసేన నేత ఆదిత్య ఠాక్రేతో కలిసి ప్రశాంత్ పనిచేస్తున్నారని ఓ మీడియా రాసింది. జన ఆశీర్వాద్ యాత్ర పేరుతో చేపట్టే కార్యక్రమానికి ప్రశాంత్ వ్యూహకర్త అని అందులో పేర్కొంది. దీంతో, ఈ అంశంపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఈయన ఐపాక్ పేరుతో ఓ బృందాన్ని నడుపుతున్నారు. రాజకీయ వ్యూహకర్తగా పేరు తెచ్చుకున్న ఈయన పశ్చిమ బెంగాల్ అధికార పార్టీ తృణమూల్ కాంగ్రెస్ కోసం పనిచేయనున్నారు.

## అద్దె అలవెన్సు కోసం జిల్లా కేంద్రాల్లో తిష్ట

### ఎన్జీవో నేతలుగా బదిలీలు తప్పించుకునే యత్నం

తిరుపతి,జూలై 23(ఆర్ఎన్ఎ): కొందరు ఉద్యోగులు జిల్లా కేంద్రం వదలకుండా ప్రయత్నాలు చేసుకుని కుర్చీలకు అతుక్కుపోతున్నారు. కొందరు ఎన్జీవో నేతలుగా అవతారమెత్తుతున్నారు. దీంతో బదిలీలు తప్పించుకునే యత్నాలు చేస్తున్నారు. ఇంటిఅద్దె అలవెన్సుల్లో తేడాలుండడమేనని పలువురు పేర్కొంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసేవారికి ఇంటి అద్దె అలవెన్సు 12శాతం, జిల్లా కేంద్రంలో పనిచేసే వారికి 20 శాతం అందుతుంది. ఈ ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే వారికీ, పట్టణ ప్రాంతాల్లో పనిచేసే వారికీ మధ్య సుమారు ఆరేడు వేల వరకు తేడా వస్తుంది. నెలనెలా ఆదాయం అధికంగా వచ్చేలా చూసుకోవడానికి జిల్లా కేంద్రంలోనే ఉండాలని కొందరు ఉద్యోగులు తీవ్రంగా ప్రయత్నాలు చేసి విజయం సాధిస్తున్నారు. కొన్నేళ్లుగా కొన్ని ప్రధాన శాఖల్లో ఉన్నతాధికారులకు దగ్గరగా పనిచేసిన కొందరు అక్కడే తిష్ట వేస్తున్నారు. దాదాపు అన్ని శాఖల్లోనూ ఇలాంటి పరిస్థితే ఉంది. దీంతో జిల్లా కేంద్రంలో ప్రధాన శాఖలకు వచ్చే ఉన్నతాధికారులు కూడా వీరికే ప్రాధాన్యమిస్తున్నారు. ఆ స్థానాల్లో కొత్తవారు వస్తే.. పరిస్థితులు అర్థం కావడానికి, అధికారికి అనుకూలంగా వ్యవహరించడానికి కొంత సమయం పట్టే అవకాశాలున్నాయి. ఒకవేళ కొత్తవారు కీలకమైన స్థానాల్లోకి వస్తే వారు అన్ని విషయాలూ తెలుసుకునే సమయానికి ఆ శాఖ ఉన్నతాధికారులకు బదిలీలు వచ్చిన సందర్భాలూ లేకపోలేదు. దీంతో బదిలీల్లో చాలామంది ఉద్యోగులు సీట్లు, ఊర్లు, జిల్లాలు మారుతున్నా కొందరు మాత్రం ఎక్కడికక్కడే అతుక్కుపోయి ఉన్నతాధికారులకు ఆదాయవనరులుగా మారుతున్నారు. ఏళ్లతరబడి ఒకేచోట ఉండడంతో అక్కడ ఆ అధికారి చెప్పిందే వేదమని పలువురంటున్నారు. కొంతమంది కాంట్రాక్టర్లు ఆ అధికారి ద్వారా పనులు చక్కబెట్టుకుంటున్నారనే విమర్శలున్నాయి. విద్యుత్‌శాఖలో ఇలాంటివారు చాలామంది ఉన్నారనే ఆరోపణలు ఉన్నాయి. బదిలీల నేపథ్యంలో విద్యుత్ శాఖలో జోరుగా పైరవీలు కొనసాగుతున్నాయి. ఎవరి స్థాయిలో వారు బేరసారాలు సాగిస్తున్నారు. కొందరు బదిలీ నిబంధనల నుంచి తప్పించుకోవడానికి కొందరు ఎన్జీఓ నాయకులుగా అవతారమెత్తుతున్నారు.

### హిమాచల్ గవర్నర్‌గా కల్‌రాజ్ మిశ్రా

సిమ్లా,జూలై22(ఆర్ఎన్ఎ): హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా బీజేపీ సీనియర్ నేత కల్‌రాజ్ మిశ్రా నియమితులయ్యారు. సోమవారం సాయంత్రం హిమాచల్ ప్రదేశ్ 26వ గవర్నర్‌గా కల్‌రాజ్ మిశ్రా ప్రమాణస్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి హిమాచల్ ప్రదేశ్ సీఎం జైరాం ఠాకూర్‌తోపాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి బీకే అగర్వాల్ , డీజీపీ ఎస్ మర్డి, ప్రభుత్వ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## రెబల్ ఎమ్మెల్యేలకు సుప్రీం షాక్

### తక్షణమే బలపరీక్షకు ఆదేశించలేమని వెల్లడి
### విచారణ నేటికి వాయిదా వేసిన ధర్మాసనం

న్యూఢిల్లీ,జూలై23(ఆర్ఎన్ఎ): కర్ణాటక రెబల్ ఎమ్మెల్యేలకు సుప్రీంకోర్టు షాకిచ్చింది. సంకీర్ణ సర్కార్ అసెంబ్లీలో సోమవారం సాయంత్రం వరకు బలం నిరూపించుకునేలా ఆదేశించాలంటూ ఇద్దరు ఇండిపెండెంట్ ఎమ్మెల్యేలు వేసిన పిటిషన్‌పై సత్వర విచారణకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. తక్షణమే విచారించడం కుదరదని స్పష్టం చేసింది. ఇండిపెండెంట్ ఎమ్మెల్యేల పిటిషన్‌పై మంగళవారం విచారణ జరపనున్నట్టు పేర్కొంది. ఇదిలావుంటే సుప్రీం కోర్టులో తమ పిటిషన్‌పై మంగళవారం వాదనలు జరగవచ్చునని, సంకీర్ణ ప్రభుత్వం విశ్వాస పరీక్షలో గట్టెక్కగలదని కాంగ్రెస్ నేత, మాజీ సీఎం సిద్ధరామయ్య ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం నుంచి నాటకీయ పరిణామాలు జరిగాయి. బలపరీక్ష ఎదుర్కొనేందుకు సీఎం కుమారస్వామి రెండు రోజుల సమయం కోరుతూ.. ఆయన స్పీకర్‌తో భేటీ అయ్యారు. రెబల్స్‌తో చర్చలు జరుపుతున్నామని అన్నారు. అయితే సీఎం అభ్యర్థనకు స్పీకర్ రమేష్ కుమార్ విముఖత చూపారు. ఈ సాయంత్రం 6 గంటలకు బలపరీక్ష నిర్వహిసామని స్పష్టం చేశారు. ఈ క్రమంలో తనకు ఎవరిపై పక్షపాతం లేదని సభాపతి రమేష్ కుమార్ అన్నారు. అసమ్మతి ఎమ్మెల్యేలకు విప్ వర్తిస్తుందని స్పష్టం చేశారు. ఈ వ్యవహారం గవర్నర్ దృష్టికి వెళ్లకుండా సభలోనే పూర్తి చేస్తామని అన్నారు. గత వారంలోనే బలపరీక్ష నిర్వహించాలని గవర్నర్ రెండుసార్లు స్పీకర్‌కు లేఖ రాశారు. అయితే ఆ ఆదేశాలను స్పీకర్ లెక్క చేయలేదు. సోమవారం ఎలాగైనా విశ్వాస పరీక్ష నిర్వహించకపోతే రాష్ట్రపతి పాలనకు సిఫారస్ చేయాలని గవర్నర్ నిర్ణయించుకున్నట్లు వార్తలు వచ్చాయి. గత శుక్రవారం కుమార స్వామి విశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన తరుణంలోనే దీనిపై జాప్యం జరిగితే విమర్శలు వస్తాయని రమేష్ కుమార్ భావించారు. బీజేపీకి మద్దతు ప్రకటించిన ఇద్దరు ఎమ్మెల్యేలు వేసిన ఫిటిషన్‌పై విచారణను ధర్మాసనం వాయిదా వేయడంతో బలపరీక్ష జరిగే పరిస్థితి కనిపించడంలేదని తొలుత వాదన వినిపించింది. కానీ చివరికి స్పీకర్ నిర్ణయంతో బలపరీక్ష ఖాయమని తేలింది. అయితే రెబల్ ఎమ్మెల్యేలకు స్పీకర్ షాక్ ఇచ్చారు. పదవులకు రాజీనామా చేసిన రెబల్ ఎమ్మెల్యేలకు సమన్లు జారీ చేశారు. రేపు ఉదయం 11 గంటలకు రెబల్ ఎమ్మెల్యేలు తన కార్యాలయానికి వచ్చి కలవాలని ఆదేశించారు. రెబల్ ఎమ్మెల్యేల అనర్హతపై స్పష్టత ఇవ్వాలని సంకీర్ణ ప్రభుత్వ నేతలు కోరిన తరుణంలో స్పీకర్ ఈ ఆదేశాలు జారీ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## 50రోజుల ప్రోగ్రెస్ కార్డు విడుదల చేసిన బిజెపి

### మోడీ నేతృత్వంలో అద్భుత పాలన సాగుతోందని వెల్లడి
### సబ్‌కా సాథ్..సబ్‌కా వికాస్ లక్ష్యంగా ముందుకు
### కేంద్రమంత్రుల వెల్లడి

న్యూఢిల్లీ,జూలై23(ఆర్ఎన్ఎ): భాజపా నేతృత్వంలోని ఎన్డీయే రెండోసారి అధికారంలోకి వచ్చి జులై 20 నాటికి 50 రోజులు పూర్తయింది. అఖండ విజయాన్ని సొంత చేసుకున్న భాజపా తొలి యాభై రోజుల్లో వేసిన అడుగులను వివరిస్తూ సోమవారం రిపోర్టు కార్డు విడుదల చేసింది. ఈ సందర్భంగా కేంద్ర సమాచార, ప్రసారశాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్ మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం ఎంత సమర్థంగా పనిచేస్తుందో తొలి 50 రోజుల పాలనలోనే నిరూపితమైందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు అభివృద్ధిని పరుగులు పెట్టించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్ నినాదంతో అన్ని వర్గాలకు న్యాయం చేయడమే లక్ష్యంగా 50రోజుల పాలన సాగిందన్నారు. సంస్కరణలు, సంక్షేమ కార్యక్రమాల అమలు వేగం గత ఐదు సంవత్సరాలతో పోలిస్తే పెరిగిందన్నారు. ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ కల కాదని..దాన్ని సాధించడం కోసం ఇప్పటికే కార్యాచరణ రూపొందించామని వివరించారు. సామాజిక న్యాయం, మౌలిక, విద్యా రంగాల్లో ఎన్డీయే ప్రభుత్వం ఇప్పటికే చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందని జావడేకర్ అన్నారు. రైతులు, వ్యాపారులు, నిరుద్యోగులు, పేద మధ్యతరగతితో పాటు సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమం కోసం చర్యలు చేపట్టామన్నారు. అంతర్జాతీయ వేదికలపై ప్రధాని హాజరు.. ప్రపంచ రాజకీయాలపై భారత్ ప్రభావాన్ని స్పష్టం చేస్తోందన్నారు. రోడ్డు, రైలు, విమాన మార్గాలతో పాటు ఇతర మౌలికవసతులపై దాదాపు రూ.100లక్షల పెట్టుబడులు పెట్టనున్నామన్నారు. అలాగే ప్రత్యేక జలశక్తి మంత్రిత్వ శాఖ, 2024నాటి ప్రతి ఇంటికీ నల్లానీరు లాంటి చరిత్రాత్మక నిర్ణయాలతో మోదీ-2 ప్రభుత్వం దూసుకెళ్తోందని జావడేకర్ అభిప్రాయపడ్డారు. ప్రపంచ దేశాల నుంచి పెట్టుబడులు ఆహ్వానిస్తున్నామని.. దీని వల్ల ఉద్యోగ కల్పనకు అవకాశాలు మెరుగవుతాయన్నారు.

# అఖిలేశ్‌కు హోంశాఖ షాక్

న్యూఢిల్లీ,జూలై23 (ఆర్ ఎన్ఎ): ఎన్ఎస్‌జీ రక్షణను కలిగి ఉన్న ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రులు అఖిలేష్ యాదవ్, ములాయంసింగ్ యాదవ్, మాయవతిలకు దీనిని తొలగిం చేందుకు కేంద్రహోంశాఖ పరిశీలి స్తోందని సమాచారం.

ఇందులో భాగంగా సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ అత్యున్నత స్థాయి ఎన్ఎస్‌జి భద్రతను

## ఎన్ఎస్‌జి రక్షణ తొలగించేందుకు నిర్ణయం?

కోల్పోనున్నారు.

దేశంలో పలువురు రాజకీయ నాయకులు ఎన్ఎస్‌జీకి చెందిన బ్లాక్ క్యాట్ కమాండో సెక్యూరిటీని కలిగి ఉన్న విషయం తెలి సిందే.

వీరిలో అఖిలేష్ యాదవ్ ఒకరు. కాగా అఖిలేష్‌కు ఎన్ఎస జీ భద్రతను తొలగించాల్సిందిగా కేంద్ర హోంమంత్రిత్వశాఖ నిర్ణయించినట్లుగా సమాచారం. దేశంలోని వీఐపీల భద్రతపై సమీక్ష చేసిన కేంద్ర హోంమం త్రిత్వశాఖ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ప్రస్తుత యూపీ సీఎం యోగి ఆదిత్యానాథ్ సైతం జెడ్ ప్లస్ సెక్యూరిటీని కలిగి ఉన్నారు. అదేవిధంగా ఏపీ మాజీ సీఎం చంద్రబాబు నాయుడు, పంజాబ్ మాజీ సీఎం ప్రకాశ్‌సింగ్ బాదల్, అసోం సీఎం సర్బనంద సోనోవాల్, ప్రఫుల్లా మహంతా, జమ్ముకశ్మీర్ మాజీ సీఎం ఫరూక్ అబ్దుల్లా, గులాం నబీ ఆజాద్, ఎల్‌కే ఆద్వానీ, రాజ్‌నాథ్‌సింగ్ ఎన్ఎస్‌జీ భద్రతను కలిగి ఉన్నారు. కాగా తాజా సమీక్ష అనంతరం పెద్దగా ముప్పేమిలేని కారణంగా అఖిలేష్ భద్రతలో ఉన్న 22 ఎన్ఎస్‌జీ కమెండోలను వెనక్కి పిలుస్తున్నారు.

# మరిన్ని విజయాలతో దేశానికి ఖ్యాతి తెస్తా

## మోడీ ట్వీట్‌పై స్పందించిన గోల్డెన్ గర్ల్ హిమాదాస్

న్యూఢిల్లీ,జూలై23(ఆర్ఎన్ఎ): గోల్డెన్ గర్ల్ హిమాదాస్‌పై ప్రశంసల జల్లు కురుస్తున్న వేళ ఆమె ట్విట్టర్ వేదికగా స్పందించారు. దేశంకోసం ఆడుతానని, మరిన్ని విజయాలు సాధిస్తానని ప్రధాని మోడీకి హామీ ఇచ్చారు. 20 రోజుల వ్యవధిలో ఐదు స్వర్ణాలతో యావత్ భారతం చూపును తనవైపు తిప్పుకున్న ఈ యువక్రీడాకారిణిని ప్రశంసిస్తూ సోషల్ మీడియాను నెటిజన్లు హోరెత్తిస్తున్నారు. రాష్ట్రపతి కోవింద్, ప్రధాని మోదీ మొదలుకొని ఎందరో సినీ, రాజకీయ, క్రీడా ప్రముఖులు ఆమెను అభినందిస్తూ ట్వీట్లు చేశారు. గత కొన్నిరోజులుగా హిమ సాధిస్తున్న విజయాలకు దేశమంతా గర్విస్తోందని.. వివిధ టోర్నీలలో ఐదు స్వర్ణ పతకాలు సాధించడం అద్వితీయమంటూ మోదీ ట్వీట్ చేశారు. ఆమె భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కోరకుంటున్నానని ఆయన అన్నారు. దీనిపై హిమాదాస్ స్పందించారు. ప్రధాని మోదీకి కృతజ్ఞతలు. ఇలాగే మరింతగా శ్రమిస్తూ.. దేశానికి మరిన్ని పతకాలు సాధిస్తాను అంటూ ప్రధానికి హిమ మాటిచ్చారు. మరోవైపు కృతజ్ఞతలు తెలుపుతూ భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండుల్కర్ చేసిన ట్వీట్‌కి కూడా హిమ రిప్లై ఇచ్చారు. భారత్‌కు తిరిగి రాగానే కలిసి.. ఆశీర్వాదాలు తీసుకుంటానని ట్వీట్‌లో ఆమె పేర్కొన్నారు. ఈ నెలలో పోలాండ్, చెక్ రిపబ్లిక్‌లలో జరిగిన ఐదు విభిన్న టోర్నమెంట్లలో హిమాదాస్ తొలి స్థానంలో నిలిచి ఐదు గోల్డ్ మెడల్లను దక్కించుకున్న విషయం తెలిసిందే.

# అసెంబ్లీ,సచివాలయ నిర్మాణాలతో డబ్బు దుబారా

## ఆందోళనకు విపక్షాల ఉమ్మడి కార్యాచరణ
## 25న చలో సెక్రటేరియట్‌కు పిలుపు: వివేక్

హైదరాబాద్,జూలై23 (ఆర్ ఎన్ఎ): కొత్త అసెంబ్లీ, సచివా లయ నిర్మాణానికి వ్యతిరేకంగా విపక్షాలు మరోమారు ఆందోళన లకు దిగుతున్నారు. ఈ నెల 25న చలో సెక్రటేరియట్‌కు పిలుపునిస్తున్నామని మాజీ ఎంపీ వివేక్ తెలిపారు. చలో సెక్రటేరి యెట్‌కు కాంగ్రెస్, టీజేఎస్, టీడీపీ మద్దతు తెలిపాయి. న్యాయపో రాటం చేస్తూనే ఆందోళనలు చేస్తామని మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్ అన్నారు. కొత్త భవనాలు కాదు..మౌలికవసతులు కల్పిం చాలని కోదండరామ్ డిమాండ్ చేశారు. హైదరాబాద్ సోమాజీ గూడ ప్రెస్ క్లబ్ లో వెంకట స్వామి ఫౌండేషన్ నేతృత్వంలో ప్రజాస్వామిక తెలంగాణ వేదిక ఆధ్వర్యంలో 'సెక్రటేరియట్ కూల్చివేత -కొత్త అసెంబ్లీ నిర్మాణం'పై నాయకులు మీడి యా సమావేశం ఏర్పాటుచేశారు. మాజీ ఎంపీ వివేక్ వెకటస్వామి, తెలంగాణ జన సమితి అధ్యక్షుడు కోదండరాం, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్, టీడీపీ అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి, టీజేఎస్ ఉపాధ్యక్షుడు పీఎల్ విశ్వేశ్వర్ రావు, ఇతరులు పాల్గొన్నారు. సెక్రటేరియట్ కూల్చివేత నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి డిమాండ్ చేశారు. కొత్తవి కట్టడం వల్ల ప్రజాధనం దుర్వినియోగం అవుతుందన్నారు. ప్రభుత్వం మీద చర్యలు తీసుకోవాలని గవర్నర్‌కు లేఖ ఇచ్చామన్నారు. సెక్రటేరియట్ కూల్చవద్దని కోర్ట్ లోకూడా చాలా మంది పిటిషన్లు వేస్తున్నారనీ.. ప్రభుత్వం నిర్ణయం మార్చుకునే వరకు తమ నిరసన కొనసాగుతుందన్నారు. ఈనెల 25వ తేదీన చలో సెక్రటేరియట్ నిరసన కార్యక్రమానికి పిలుపుని స్తున్నామన్నారు. చలో సెక్రటేరి యట్ లో నిరసన కార్యక్రమంలో అన్ని పార్టీలు,కుల సంఘాలు, యువత పాల్గొనాలని వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు. ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావడం కోసమే చలో సెక్రటేరియట్ నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నామని వివేక్ అన్నారు. రాష్ట్రంలోనే కాదు.. దేశంలోని ప్రధాన నగరాల్లో ఎక్కడకు పోయినా సెక్రటేరియట్ కూల్చివేత మీదనే చర్చ జరుగుతోందన్నారు. కొత్త రాష్ట్రం ఏర్పడినపుడు సెక్రటేరియట్ కట్టుకోవచ్చు కానీ.. బాగా నడుస్తున్న సెక్రటేరియట్ బిల్డింగులను కూల్చి మళ్ళీ కొత్తవి కట్టడం ఎందుకని ప్రశ్నించారు. తెలంగాణపై రూ.లక్ష 65వేల కోట్ల అప్పు ఉందని పార్లమెంట్ లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ కూడా చెప్పారన్నారు వివేక్ వెంకటస్వామి. అప్పు చేసి కొత్తవి కట్టడం ఎందుకని ఆయన ప్రశ్నించారు. అప్పులపై వైట్ పేపర్ రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు.

# మల్కాజిగిరి కోర్టు సంచలన తీర్పు

## తల్లిని వేదించిన కేసులో కొడుకు కోడలుకు జైలు

హైదరాబాద్,జూలై223(ఆర్ఎన్ఎ): తల్లిదండ్రులను వేధించే పిలల్లకు గుణపాఠంగా మల్కాజ్‌గిరి కోర్టు సోమవారం సంచలన తీర్పు ఇచ్చింది. తండ్రి మరణాంతరం తల్లి ఆలనాపాలన చూడాల్సిన కొడుకే కర్కశంగా మారడంతో ఆ అభాగ్యురాలు పోలీసులు, కోర్టును ఆశ్రయించింది. దీనిపై నాలుగేళుగా విచారణ జరిపిన కోర్టు తుదితీర్పును వెలువరించింది. ఆస్తి కోసం తల్లిని వేధించిన కొడుకుతో పాటు కోడలికి రెండేళ్ల జైలు శిక్షతో పాటు పదివేల జరిమానా విధించింది. నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హిల్ కాలనీలో నివాసం ఉండే ప్రేమ కుమారి (70)కి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. 2013లో భర్త చనిపోయాడు. భర్త చనిపోకముందే పిల్లల వివాహాలు జరిపించాడు. ఎవరికి వారు వేరుగా ఉంటున్నారు. భర్త చనిపోవడంతో పెద్ద కుమారుడు నుంచి తల్లికి వేధింపులు మొదలయ్యాయి. ముషీరాబాద్ లో నివాసం ఉండే పెద్ద కుమారుడు అమిత్ కుమార్ తన భార్యతో సహా తల్లి ఉండే ఇంట్లోకి బలవంతంగా ప్రవేశించమే కాకుండా ఆమెను బయటకు పంపేందుకు రకరకాల ప్రయత్నాలు చేశాడు. అనారోగ్యంతో బాధపడుతున్న తల్లిని భార్యతో కలిసి క్రూరంగా హింసించడం మొదలుపెట్టాడు. ఇది భరించలేని తల్లి... 2015లో పోలీసులను ఆశ్రయించగా అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేశారు. నాలుగేళ్లుగా విచారణ జరిగిన ఈ కేసు తుదితీర్పు సోమవారం వెలువడింది. పెద్ద కుమారుడు అమిత్ కుమార్, కోడలు శోభిత లావణ్యలకు రెండేళ్ల జైలుశిక్షతో పాటు చేరో పదివేల జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది. కోర్టు తీర్పుపై పలువురు హర్షం వ్యక్తం చేసారు. ఈ తీర్పుతోనైనా సమాజంలో మార్పురావాలని వారు అభిప్రాయపడుతున్నారు.

# టాంజానియాలో ఘనంగా బోనాలు

హైదరాబాద్,జూలై23(ఆర్ఎన్ఎ): తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాలను టాంజానియాలో తెలంగాణ వాసులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఆషాడం మాసం వచ్చిందంటే చాలు రాష్ట్రంలోని ప్రతి ప్లలెలో గ్రామదేవతలకు బోనాలు సమర్పించుకోవడం తెలంగాణ సాంప్రదాయం. ఇక హైదరాబాద్ లో అయితే నెల రోజులు పాటు ప్రతి ఆదివారం ఏదో ఒకచోట ఈ బోనాల పండగ అంగరంగవైభవంగా జరుగుతుంది. తెలంగాణ బోనాల సంస్కృతి విదేశాల్లో కూడా కొనసాగుతోంది. ఖండాంతరాలు దాటిన తెలంగాణ బోనాలు ఆఫ్రికాలో మరింత వైభవంగా జరిగాయి. టాంజానియాలో స్థిరపడిన తెలంగాణ కుటుంబాలు తమ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బోనాల జాతరను ఘనంగా జరుపుకున్నారు. దార్ ఎస్ సలాం నగరంలోని సముద్ర తీరంలో ఈ బోనాల సంబరాలు అంబరాన్నంటాయి. తెలంగాణ సాంస్కృతిక సంఘం టాంజానియా ఆధ్వర్యంలో ఈ సంబరాలు జరిగాయి. సందర్భంగా తెలంగాణ సాంప్రదాయ దుస్తుల్లో మహిళలు భక్తి శ్రద్దలతో అమ్మవారికి బోనాలు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తెలంగాణకు చెందిన వారంతా ఓ కుటుంబంలా కలిసి మెలిసి ఆనందంగా గడిపారు. బోనాలతోపాటు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. చిన్నారుల ఆటా, పాటలతో, ప్రత్యేకమైన బోనాల పాటలతో ఎంతో సందడిగా వేడుకలు జరిగాయి. తెలంగాణ కల్చరల్ అసోసియేషన్ (టీసీఏ)చైర్మన్ పిట్టల సత్యనారాయణ, వైస్ చైర్మన్ నందకిషోర్ బొల్లక్‌పల్లి, సలహా కమిటీ సభ్యులు వంగా నరసింహరెడ్డి, భాస్కర్ రెడ్డి, పట్లోల్లా సంతోష్ రెడ్డి. కార్యదర్శి కమ్ కోశాధికారి శ్రీనివాస్ సిరిపురం, సాంస్కృతిక కార్యదర్శి జల్లా నాగరాజు బాధ్యతను స్వీకరించి కార్యక్రమాన్ని చక్కగా నిర్వహించినందుకు ప్రశంసలందుకున్నారు.

# అమెరికాలో ఇమ్రాన్‌కు నిరసన సెగలు

## ఆందోళనకు దిగిన ప్రత్యేక బలూచీస్థాన్ వాసులు

వాషింగ్టన్,జూలై23(ఆర్ఎన్ఎ): అమెరికా పర్యటనలో ఉన్న పాకిస్థాన్ ప్రధానమంత్రి ఇమ్రాన్‌ఖాన్‌కు ప్రత్యేక బలూచిస్థాన్ వేర్పాటువాదుల నుంచి నిరసన సెగ తగిలింది. ప్రత్యేక దేశంగా తమను గుర్తించాలని వారు డిమాండ్ చేశారు. అమెరికాలోని పాకిస్థానీయులను ఉద్దేశించి ఓ వేదికపై ప్రసంగిస్తుండగా..కొంత మంది యువకులు పాక్ వ్యతిరేక నినాదాలు చేశారు. అలాగే స్వతంత్ర బలూచిస్థాన్ ఏర్పాటు చేయాలంటూ నినదించారు. పక్కనే ఉన్నవారు ఎంత వారించినా వారు ఆపకపోవడంతో భద్రతా సిబ్బంది రంగంలోకి దిగారు. ఇమ్రాన్ మద్దతుదారుల సాయంతో వారిని బయటి పంపారు. అయితే వారు వేదికకు దూరంగా ఉండడంతో ఇమ్రాన్ ప్రసంగానికి ఎటువంటి అంతరాయం కలగలేదు. కానీ, సభలో కాసేపు గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. పాకిస్థాన్‌లో ఓ రాష్ట్రమైన బలూచిస్థాన్‌లో ప్రత్యేక దేశం కోసం కొన్నేళ్లుగా నిరసనలు జరుగుతున్నాయి. పాక్ భద్రతా బలగాలు అక్కడ మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నారని, ఉద్యమకారుల్ని అపహరిస్తున్నారని అమెరికాలోని బలూచిస్థాన్‌వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎలాగైనా ఈ అక్రమాలను ఆపాలంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ని కోరుతూ.. ఇమ్రాన్ పర్యటన నేపథ్యంలో అక్కడి బలూచిస్థాన్ వాసులు రెండు రోజులుగా ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. పాకిస్థాన్‌లోని మైనారిటీ వర్గాలకు చెందిన మరికొంత మంది సైతం వాషింగ్టన్‌లో నిరసన ప్రదర్శన చేపట్టారు. మూడురోజుల పర్యటన నిమిత్తం అమెరికా వెళ్లిన ఆయనకు ఆదిలోనే ఘోర పరాభవం ఎదురైన విషయం తెలిసిందే. స్వాగతించడానికి అమెరికా మంత్రులు, ఉన్నతాధికారులు ఎవరూ రాలేదు. విమానాశ్రయం వద్దకు కేవలం ఒక ప్రోటోకాల్ అధికారి మాత్రమే వచ్చారు.

# పార్లమెంట్ ఆవరణలో శ్రీలక్ష్మి

## త్వరగా బదిలీ యత్నాల్లో ఉన్నారని ప్రచారం?

న్యూఢిల్లీ,జూలై23(ఆర్ఎన్ఎ): సీనియర్ ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మి మంగళవారం ఢిల్లీలోని పార్లమెంటు ఆవరణలో కనిపించారు. ఆమె వైసీపీ, బీజేపీ ఎంపీలను కలిసేందుకు పార్లమెంటుకు వచ్చారని సమాచారం. తనను త్వరగా ఎపికి ట్రాన్స్‌ఫర్చేయించుకునేందుకు ఆమె వచ్చారని తెలుస్తోంది. శ్రీలక్ష్మి ప్రస్తుతం తెలంగాణ కేడర్‌లో విధులు నిర్వహిస్తున్నారు. తెలంగాణ కేడర్‌లో ఉన్న సీనియర్ ఐఏఎస్ శ్రీలక్ష్మి ఆంధ్రప్రదేశ్‌కు రావడం దాదాపు ఖరారైంది. ఆమె ఇప్పటికే సీఎం జగన్‌తో మాట్లాడి ఏపీలో సేవలు అందించేందుకు అవకాశం కల్పించాలని కోరారు. అందుకు ఆయన అంగీకరించారని... కీలకమైన శాఖను అప్పగిస్తానని హామీ కూడా ఇచ్చారని తెలిసింది. శ్రీలక్ష్మి ఓబుళాపురం గనుల కుంభకోణం కేసులో జైలు పాలయ్యారు. జైల్లో అనారోగ్యానికి గురయ్యారు. ఆ తర్వాత నిర్దోషిగా బయటికి వచ్చాక ఐఏఎస్‌గా కొనసాగుతున్నారు. రాష్ట్ర విభజన తర్వాత శ్రీలక్ష్మిని తెలంగాణ కేడర్‌కు కేటాయించారు. 1988 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన శ్రీలక్ష్మి అతి చిన్న వయస్సులో సివిల్ సర్వెంట్ అయ్యారు. ఆమె కెరీర్ ఒడిదుడుకుల్లేకుండా సాగితే కేంద్ర కేబినెట్ కార్యదర్శి స్థాయికి వెళ్లేవారు. ఓబుళాపురం గనుల అవినీతి కేసులు మెడకు చుట్టుకోవడంతో వృత్తిపరంగా అడుగు ముందుకు పడని పరిస్థితి నెలకొంది. ఇప్పుడు ఆమె ఏపీకి వెళ్లేందుకు దరఖాస్తు చేసుకున్నారని ఏపీ అధికార వర్గాలు తెలిపాయి.

# తండ్రి ఆగడాలు సహించలేక హత్య

## కొడుకును అరెస్ట్ చేసిన పోలీసులు

నిజామాబాద్,జూలై23(ఆర్ఎన్ఎ): ఇందల్వాయి మండలం ఎల్లారెడ్డిపల్లిలో దారుణం జరిగింది. జైలు నుంచి తిరిగి వచ్చిన తండ్రిని కుమారుడు ప్రశాంత్ హత్య చేశాడు. 4 నెలల క్రితం భార్యను హత్య చేసి జైలుకెళ్లిన ప్రశాంత్ తండ్రి.. ఇటీవలె బెయిల్‌పై బయటకు వచ్చాడు. అయితే ఇంటికొచ్చిన తర్వాత ఇరుగుపొరుగు వారిని ఇబ్బంది పెడుతున్నాడు. తండ్రి ప్రవర్తన నచ్చని కుమారుడు.. ఆయనను హత్య చేశాడు. అనంతరం పోలీసుల ఎదుట ప్రశాంత్ లొంగిపోయాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

**ఆత్మహత్యకు పాల్పడిన యువకుడి ఆచూకీ లభ్యం..?**

భిక్కనూరు సిద్ధరామేశ్వరాలయం సమీపంలో ఈ నెల 15వ తేదీన ఆత్మహత్యకు పాల్పడిన యువకుడి ఆచూకీ అభ్యమైంది. నిజామాబాద్ జిల్లా మెపాల్ మండలం బైరాపూర్‌కు చెందిన అర్జున్ (25) ఈ నెల 13 నుంచి కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యులు మోపాల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. భిక్కనూరు పోలీసుల వద్ద ఉన్న మృతదేహం చిత్రం ఆధారంగా అర్జున్‌ను గుర్తించారు. ఈ విషయమై భిక్కనూరు సీఐ రాజశేఖర్‌ను వివరణ కోరగా మోపాల్ ఠాణాలో అదృశ్యమైన వ్యక్తే భిక్కనూరులో ఆత్మహత్య చేసుకున్నాడని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పేర్కొన్నారు.

# భీవండి రసాయన గోదాంలో అగ్నిప్రమాదం

ముంబయి,జూలై23(ఆర్ఎన్ఎ): ముంబయిలోని బాంద్రా ప్రాంతంలో సోమవారం భారీ అగ్నిప్రమాదం జరిగిన కొన్ని గంటల్లోనే మహారాష్ట్రలో మరోచోట ప్రమాదం చోటుచేసుకుంది. భివాండి ప్రాంతంలోని ఓ రసాయన పరిశ్రమ గోదాములో మంగళవారం ఉదయం భారీ ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకొని మంటలను ఆర్పే ప్రయత్నం చేస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ ప్రారంభిస్తామన్నారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

మరోవైపు బాంద్రా అగ్నిప్రమాదంలో చిక్కుకున్న 100 మంది సిబ్బంది సురక్షితంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఎంటీఎన్ఎల్ టెలిఫోన్ కార్యాలయ భవనంలో సోమవారం భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న విషయం తెలిసిందే.

## మహబూబాబాద్

# రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు



మహబూబాబాద్, జులై 23 (నేటినిజం ప్రతినిధి): మండలంలోని సీతారాంపురం బస్టాండ్ సమీపంలో సోమవారం లారీ ద్విచక్రవాహనం ఢీకొనగా ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన ప్రకారం... కడవెండికి చెందిన సుడిగల రాజు తన ద్విక్రవాహనంతో బస్టాండ్ ముందు ఆగిన బస్సును దాటుతుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొటిం?టది. ఘటనలో రాజుకు తీవ్రగాయాలయ్యాయి. లారీ ద్విచక్రవాహనాన్ని లాక్కెల్లి రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టింది. స్థానికులు 108 సిబ్బందికి సమాచారం అందించగా రాజుకు ప్రథమ చికిత్స చేసి మెరుగైన చికిత్స నిమిత్తం జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు.

# విధుల్లో చేరిన ఎస్సైలు






మహబూబాబాద్, జులై 23 (నేటినిజం ప్రతినిధి): మహబూబాబాద్ పట్టణ-2 ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న సీహెచ్.రమేశ్‌బాబు మహబూబాబాద్ రూరల్ ఎస్సైగా బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం ఆయన విధుల్లో చేరారు. డీఎస్పీ నరేశ్‌కుమార్‌ను మర్యాధ పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. మెట్‌పల్లిలో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న శంకర్‌రావు పట్టణ-2 ఎస్సైగా విధుల్లో చేరారు. సీఐ రవికుమార్‌కు నియామక పత్రాలను అందించారు.

# రాయితీ రుణ చెక్కుల పంపిణీ చేసిన పువ్వాడ

ఖమ్మం,జూలై22(ఆర్ఎన్ఎ): ఖమ్మం నగరంలో మైనార్టీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి రుణాలకు ఎంపికైన లబ్దిదారులకు ఖమ్మం ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్ చెక్కులను పంపిణీ చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 2018-19 ఆర్థిక సంవత్సరానికి మంజూరైన స్వయం ఉపాధి యూనిట్లను వివిధ కారణాలతో నిలిపేశారని, ప్రస్తుతం వాటిని లబ్దిదారులకు అందజేస్తున్నట్లు తెలిపారు. ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున వంద శాతం రాయితీపై రుణాలు మంజూరు చేసినట్లు ఆయన వెల్లడించారు. అంతకు ముందు నగరంలోని 5వ డివిజన్, 43వ డివిజన్‌లలో చేపట్టనున్న పలు అభివృద్ది పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ డాక్టర్ పాపాలాల్, ఉపమేయర్ మురళీప్రసాద్, కమిషనర్ జె.శ్రీనివాసరావు, మైనార్టీ కార్పొరేషన్ ఈడీ రమేష్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# సిలిండర్ పేలి పూరిల్లు దగ్ధం

## నలుగురికి తీవ్ర గాయాలు

మెదక్,జూలై23(ఆర్ఎన్ఎ): శివంపేట మండలం శంకర్‌తండాలో మంగళవారం ఉదయం అగ్నిప్రమాదం సంభవించిన ఘటనలో నలుగురు కుటుంబ సభ్యులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని హుటాహుటిన ఆస్త్రప్రికి తరలించారు. వీరుంటున్న పూరిల్లులో గ్యాస్ సిలిండర్ పేలిపోయింది. దీంతో పూరిల్లు పూర్తిగా కాలిపోగా, నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదస్థలికి చేరుకున్న పోలీసులు.. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. వీరి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తెలుస్తోంది.



క్రీడలు

# గంభీర్ అండతోనే ఇంతవాడినయ్యా

## టీమిండియాలో చోటు దక్కించుకున్న సైనీ



న్యూఢిల్లీ,జూలై23(ఆర్ఎన్ఎ): తనలోని టాలెంట్‌ను గుర్తించి ప్రోత్సహించినందుకు గౌతం గంభీర్‌కు జీవితాంతం రుణపడి ఉంటానని టీమిండియా యువ పేసర్ నవదీప్ సైనీ పేర్కొన్నాడు. తన కెరీర్ ఎదుగుదలలో గంభీర్ భయ్యా చేసిన సాయాన్ని ఎప్పటికీ మరువలేని తాజాగా తెలిపాడు. విండీస్ పర్యటనకు ఎంపిక చేసిన భారత జట్టులో చోటు దక్కించుకున్న సైనీ మాట్లాడుతూ.. తన టాలెంట్‌ను గంభీర్ గుర్తించడమే కాకుండా ఎంతో అండగా నిలిచాడన్నాడు. 'నా కెరీర్‌లో గంభీర్ భయ్యా సహకారాన్ని ఎప్పటికీ మరిచిపోలేను. ఈ స్థాయిలో నేను ఇక్కడ ఉన్నానంటే అందుకు కారణం అతడే. నేను ఏమైనా సాధిస్తే, అందులో గంభీర్ పేరు తప్పక ఉంటుంది. నా ఎదుగుదల క్రెడిట్ అంతా గంభీర్ భయ్యాదే' అని ÷ల్గ÷నీ పేర్కొన్నాడు. ఈ ఏడాది జరిగిన ఐపీఎల్‌లో సైతం నవదీప్ ÷ల్గ÷నీ తన పదునైన బంతులతో ప్రత్యర్థి జట్టు బ్యాట్స్‌మెన్‌కు చుక్కలు చూపించాడు. ఐపీఎల్‌లో అత్యంత వేగవంతమైన బంతిని విసిరిన రెండో ఆటగాడిగా నవదీప్ సైనీ 152.85 కి.మీ వేగంతో రికార్డు నెలకొల్పాడు. దేశవాళీ క్రికెట్‌లో గత కొంతకాలంగా నిలకడగా రాణిస్తూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాడు.

# శ్రీజ అదుర్స్



కటక్: కామన్వెల్త్ టేబుల్ టెన్నిస్ (టీటీ) చాంపియన్‌షిప్‌లో తెలంగాణ యువ ప్యాడ్లర్ ఆకుల శ్రీజ అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంది. టోర్నీ ఆసాంతం మెరుగైన ఆటతీరు కనబరుస్తూ సత్తాచాటింది. సోమవారంతో ముగిసిన కామన్వెల్త్ టీటీ చాంపియన్‌షిప్‌లో శ్రీజ ఓ రజతం సహా రెండు కాంస్య పతకాలతో మెరిసింది. మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో ఈ తెలంగాణ అమ్మాయి 8-11, 9-11, 11-9, 8-11, 12-14తో భారత్‌కే చెందిన మధురికా పాట్కర్ చేతిలో ఓటమి పాలైంది. మరోవైపు మహిళల డబుల్స్ ఫైనల్లో మౌసోమి పాల్‌తో కలిసి బరిలోకి దిగిన శ్రీజ 9-11, 8-11, 11-9, 10-12తో పూజ సహస్రబుద్ధి-కృత్విక సిన్హా రాయ్ జోడి చేతిలో ఓడి రజతం దక్కించుకుంది. అంతకుముందు మిక్స్‌డ్ డబుల్స్ సెమీఫైనల్లో ఓడిన శ్రీజ మరో కాంస్యాన్ని తన ఖాతాలో వేసుకుంది. పోటీల చివరి రోజు జరిగిన అన్ని విభాగాల్లో భారత ప్యాడ్లర్లు విజేతలుగా నిలిచారు. దీంతో 15 పతకాల (7 బంగారు, 5 రజత, 3 కాంస్య)తో భారత్ పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది. ఇంగ్లండ్ (2 రజతాలు, 3 కాంస్యాలు) రెండో స్థానం దక్కించుకుంది. పురుషుల సింగిల్స్ ఫైనల్లో హర్మీత్ దేశాయ్ 4-3 (9-11, 6-11, 11-5, 11-6, 17-15, 7-11, 11-9)తో మన దేశానికే చెందిన జి. సత్యన్‌పై గెలిచి స్వర్ణం సాధించగా.. మహిళల సింగిల్స్ తుదిపోరులో ఐహిక్య ముఖర్జీ 4-0 (11-6, 11-4, 11-9, 19-17)తో మాజీ జాతీయ చాంపియన్ మధురికా పాట్కర్‌పై గెలిచి పసిడి పతకం సొంతం చేసుకుంది. పురుషుల డబుల్స్ ఫైనల్లో మానవ్ ఠక్కర్-ఆంటోని అమల్ రాజ్ జోడీ ఫైనల్లో 3-1 (6-11, 11-6, 13-11, 12-10)తో టాప్ సీడ్ సత్యన్-శరత్ కమల్ జంటపై గెలిచింది.

# ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు పకడ్బందీ చర్యలు

## కరీంనగర్ పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి



కరీంనగర్, జులై 23: కరీంనగర్ కమీషనరేట్‌వ్యాప్తంగా ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని కరీంనగర్ పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి అన్నారు. అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కేసులను నమోదు చేయడంతోపాటు వాహనాలను సీజ్ చేస్తున్నామని పేర్కొన్నారు. 2017 నుండి ఇప్పటి వరకు 127 కేసులను నమోదు చేయడంతోపాటు, మైనింగ్, రెవెన్యూ అధికారులకు అప్పగించామని తెలిపారు. ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నా కొన్ని ప్రాంతాల నుండి గుట్టుచప్పుడు కాకుండా రవాణా అవుతున్నట్లు సమాచారం అందుతోందని తెలిపారు. 2017లో 07కేసులను నమోదు చేసి 11లారీలు, 04జెసిబి, 02ట్రాక్టర్లను సీజ్ చేశామని చెప్పారు. అదే సంవత్సరంలో 60లారీలు, 543ట్రాక్టర్లు, 04జెసిబి,01 టిప్పర్,01బొలేరా వాహనాలను సంబంధిత మైనింగ్, తహసిల్దార్‌లకు అప్పగించడంతోపాటు, అక్రమంగా నిల్వఉంచిన 811లారీల ఇసుక డంపులను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. గత సంవత్సరం 102 కేసులను నమోదుచేసి 134 వాహనాలను, ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు 18కేసుల్లో 38వాహనాలను సీజ్ చేశామని తెలిపారు. గత సంవత్సరం నుండి వివిధ ప్రదేశాల్లో అక్రమంగా నిల్వఉంచిన 655లారీలు, 80ట్రాక్టర్ల ఇసుక నిల్వలను స్వాధీనం చేసుకుని మైనింగ్ అధికారులు, తహసిల్దార్‌లకు అప్పగించామని చెప్పారు. ఇసుక అక్రమ రవాణాపై పోలీస్‌శాఖపై వస్తున్న ఆరోపణల్లో నిజంలేదని స్పష్టం చేశారు. అక్రమ ఇసుక రవాణా నియంత్రణకు రేయింబవళ్ళు నిఘా కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. ఇసుక అక్రమ నిల్వలను గుర్తించేందుకు డ్రోన్ కెమెరాలను వినియోగిస్తున్నాము. ఇసుక అక్రమ రవాణా ద్వారా కలిగే దుష్పరిణామాలను ప్రజలకు వివరించేందుకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాము. భూగర్భజలాలను కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రతలను తెలియజేయడం జరుగుతున్నది. ఎలాంటి ఒత్తిళ్ళకు తలొగ్గకుండా ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు చర్యలు తీసుకుంటామని, ఇసుక అక్రమ రవాణాకు ప్రత్యక్షంగా గానీ పరోక్షకంగా గానీ సంబంధం ఉన్న వ్యక్తులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఒక పక్క విరామం ఎరుగకుండా శాంతిభద్రతల పరిరక్షణ విధులను నిర్వహిస్తూనే మరోపక్క ఇసుక అక్రమ రవాణాకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు సమాచారం అందించాలని కోరారు. తరచూ ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతూ పట్టుబడేవారిపై పిడియాక్టులను కూడా అమలు చేస్తామని హెచ్చరించారు.

### హరితహారాన్ని ఉద్యమంగా స్వీకరించాలి

హరితహారం కార్యక్రమాన్ని ఉద్యమంగా స్వీకరించి అన్నివర్గాల ప్రజలు కాలుష్యరహిత సమాజం నిర్మాణం కోసం ముందుకు రావాలని కరీంనగర్ పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి పిలుపునిచ్చారు. జీవకోటికి ప్రాణాధారం అయిన పర్యావరణం పరిరక్షణను ప్రజలు తమ భాధ్యతగా గుర్తించాలని చెప్పారు. పోలీస్ కమీషనరేట్ కేంద్రంలో సోమవారం నాడు హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి హాజరై మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటి ఆవరణలతోపాటు ఖాళీ ప్రదేశాల్లో మొక్కలను నాటాలని సూచించారు. మొక్కలను పెంచకపోవడం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించాలన్నారు. మొక్కల పెంపకం లేక కరీంనగర్ ప్రాంతం ఎడారిని తలపిస్తోందని, ఇలాంటి పరిస్థితులు కొనసాగితే రాబోవుకాలంలో కరువు ఎదురయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపిలు ఎస్ శ్రీనివాస్(లాఅండ్ఆర్డర్), పి రవీందర్(పరిపాలన), ఆర్ఐలు మల్లేశం, జానీమియా,శేఖర్,ఆర్ఎస్ఐ లాల్‌బాబు,క్యూఆర్‌టి విభాగాలకు చెందిన పోలీసులు పాల్గొన్నారు.

# రైతుల సమస్యలపై చిత్తశుద్ధి లేని సర్కార్

## కరీంనగర్ కలెక్టరేట్ ముందు సిపిఐ ధర్నా

కరీంనగర్,జూలై23 (ఆంఎన్ఎ): ప్రజలకు కావాల్సింది లంచాల తెలంగాణ కాదు.. బతుకుల తెలంగాణ కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్ రెడ్డి అన్నారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో పాల్గొన్న చాడ.. మీడియాతో మాట్లాడారు. కేంద్రానికి కరువు నివేదిక పంపడంలో రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం స్పందించడం లేదని విమర్శలు గుప్పించారు. రెవెన్యూశాఖలో లొసుగులు ఉన్నాయని ముందే చెప్పామన్నారు. లంచాలు తీసుకునేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భూసగ్ర సర్వే చేసి సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని చాడ డిమాండ్ చేశారు. రైతుబంధు నిధులు ఇవ్వాలని, రుణమాఫీని ఒకే విడతలో చేయాలని డిమాండ్ చేశారు.

# కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

కామారెడ్డి,జూలై23 (ఆంఎన్ఎ): పేద కుటుంబాల యువతులకు అండగా ఉండేందుకే ముఖ్యమంత్రి కెసిఆర్ కల్యాణి లక్ష్మి పథకం ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే సురేందర్ అన్నారు. లింగంపేట మండలం నల్లమరుగు గ్రామంలో సోమవారం ఆయన కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛను లబ్ధిదారుల అర్హత వయసు 60 నుంచి 57 ఏళ్లకు తగ్గిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. అర్హత గలవారు సంబంధిత గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గరీబున్నీసా బేగం, తెరాస నాయకులు రాజేశ్వరరావు, శ్రీనునాయక్, నాగాగౌడ్, మొయినుద్దీన్, రవీందర్, విద్యాధర్ తదితరులు పాల్గొన్నారు.

## కీసర అడవిని..

# దత్తత తీసుకున్న టీఆర్ఎస్ ఎంపీ సంతోష్

### - కేటీఆర్ బర్త్ డే సందర్భంగా వినూత్న నిర్ణయం



హైదరాబాద్, జులై23(ఆర్ఎన్ఎ) : టీఆర్ఎస్ రాజ్యసభ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ వినూత్న నిర్ణయం తీసుకున్నారు. బుధవారం టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా కీసరగుట్ట రిజర్వ్ ఫారెస్ట్‌లోని 2042 ఎకరాల అటవీ ప్రాంతాన్ని దత్తత తీసుకుంటున్నట్లు ఎంపీ సంతోష్ కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ట్విట్టర్ ద్వారా ప్రకటించారు. తన పుట్టిన రోజు సందర్భంగా హంగు, ఆర్భాటాలు లేకుండా సమాజహితం కోసం పని చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. కేటీఆర్ ఇచ్చిన గిఫ్ట్ ఏ స్మైల్ నినాదాన్ని ఎంపీ సంతోష్ స్ఫూర్తిగా తీసుకున్నారు.

కేటీఆర్ బర్త్‌డే సందర్భంగా.. ప్రభుత్వం అటవీశాఖ ద్వారా అమలు చేస్తున్న అర్బన్ ఫారెస్ట్ పార్కుల అభివృద్ధిలో భాగంగా కీసరగుట్ట అటవీ ప్రాంతంలో ఎకో టూరిజం పార్కును సొంత నిధులతో తీర్చిదిద్దుతాం అని సంతోష్ కుమార్ పేర్కొన్నారు. త్వరలోనే కీసరగుట్ట అటవీ ప్రాంతంలో పర్యటించి.. అభివృద్ధి ప్రతిపాదనలు సిద్ధం చేస్తావన్నారు. తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న అర్బన్ ఫారెస్ట్ పార్కులు అద్భుతంగా ఉన్నాయని, పట్టణ ప్రాంత వాసులు సేదతీరేందుకు, ఆరోగ్యకర జీవన విధానం అలవర్చుకునేందుకు ఈ పార్కులు తోడ్పడుతాయని అన్నారు. వారాంతాల్లో కుటుంబంతో సహా సేదతీరే చక్కని ప్రాంతాలుగా పిల్లల్లో పర్యావరణం, అటవీ, జీవవైవిధ్యం ప్రాధాన్యతలు తెలుసుకునే ప్రాంతాలుగా అర్బన్ ప్రాంతాల అభివృద్ధి జరుగుతోందన్నారు. కీసరగుట్ట అటవీ ప్రాంతాన్ని మంచి ఎకో టూరిజం ప్రాజెక్టుగా తీర్చిదిద్ది హైదరాబాద్ వాసులకు బహుమతిగా ఇస్తామన్నారు. యాదాద్రి, కీసరగుట్టలకు వచ్చే భక్తులు, పర్యాటకులకు కూడా ఈ ఎకో టూరిజం పార్కు అందుబాటులో ఉంటుందని తెలిపారు. తన ట్విట్టర్ ద్వారా మరికొందరు ప్రముఖులను కూడా ట్యాగ్ చేశారని ఎంపీ సంతోష్ కుమార్ అన్నారు. అటవీ ప్రాంతాల అభివృద్ధి, అర్బన్ లంగ్ స్పేస్‌ల అభివృద్ధిలో పాలుపంచుకోవాలని ఆహ్వానించారు. ఎంపీ సంతోష్ తీసుకున్నది మంచి నిర్ణయం అంటూ పెద్ద ఎత్తున నెటిజన్లు ఆహ్వానం పలికారు. ఎంపీ సంతోష్ కుమార్‌ను ప్రశంసిస్తూ నెటిజర్లు మేసేజ్‌లు పోస్టు చేస్తున్నారు.

# గోవుల అక్రమరవాణా నియంత్రణకు చర్యలు

## కరీంనగర్ పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి

కరీంనగర్, జులై 23:గోవుల అక్రమరవాణా నియంత్రణకు చర్యలు తీసుకున్నామని కరీంనగర్ పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి అన్నారు. కరీంనగర్ కమీషనరేట్ ప్రవేశద్వారాల వద్ద పోలీస్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేయడంతోపాటు రేయింబవళ్ళు పెట్రోలింగ్ నిర్వాహణకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయనున్నామని తెలిపారు.

సోమవారం నాడు కమీషనరేట్ కేంద్రంలో పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి ముస్లింమతపెద్దలతో సమావేశం నిర్వహించారు. గోవుల అక్రమరవాణా నియంత్రణకు కమీషనరేట్ ప్రవేశద్వారాల వద్ద తనిఖీలను నిర్వహిస్తామన్నారు. సమాజంలోని ప్రతిపౌరుడు భారతరాజ్యాంగానికి కట్టుబడిఉండాలని చెప్పారు.శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా, ఇతర మతాల విశ్వాసాలకు భంగంకలుగకుండా పట్టిష్ట చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. అన్నిమతాలకు చెందిన ప్రజలు సోదరభావంతో మెదలాలని సూచించారు. ఎంతటిజటిల సమస్యలలైనా సంప్రదింపులతో పరిష్కారం అవుతాయని చెప్పారు. గోవుల అక్రమరవాణాకు ఎటువంటి సమాచారం ఉన్నా పోలీసులకు తెలియజేయాలని, బృందాలుగా ఏర్పడి చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే ప్రయత్నాలు చేయకూడదని తెలిపారు. గోవుల అక్రమరవాణా,వధలకు పాల్పడితే తీసుకునే చర్యలపై గ్రామగ్రామాన విస్తృత ప్రచారం నిర్వహిస్తామని పేర్కొన్నారు. సోషల్‌మీడియాను దుర్వినియోగం చేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. సోషల్‌మీడియాలో వివిధ మతాల విశ్వాసాలకు భంగంకలిగేవిధంగా అభ్యంతరకమైన పోస్టులు వచ్చిన సందర్భంలో పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఏదైనా సంఘటన జరిగిన సందర్భాలలో ఉద్రేకాలకులోనుకాకుండా, సంఘటనకు సంబంధించిన పూర్తివివరాలపై పూర్తినిర్ధారణకు వచ్చిన తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేయాలని చెప్పారు. సంఘటనపై ఎలాంటి నిర్ధారణకు రాకుండా వేలాదిమందిగా తరలివచ్చి ఫిర్యాదు చేయడం సరైందికాదని పేర్కొన్నారు. నవంబర్10వరకు వివిధ మతాలకు చెందిన పండుగలు వరుసగా రానున్నాయని, అన్నివర్గాల ప్రజలు సోదరభావంతో మెదులుతూ శాంతియుత వాతావరణం నిర్మాణంలో భాగస్వాములుకావాలని కోరారు. ప్రార్ధనాస్థలాల వద్ద ఎలాంటి అపవిత్ర కార్యక్రమాలు జరుగకుండా ప్రతిరోజు ఉదయం 03గంటల నుండి 06గంటల వరకు ప్రత్యేకనిఘా, పెట్రోలింగ్‌లను కొనసాగిస్తున్నామని తెలిపారు. ప్రతిరోజు ఇన్స్‌పెక్టర్‌స్థాయి అధికారి పర్యవేక్షణలో కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. పోలీస్‌శాఖ ఏమతానికి,వర్గానికి మద్దతుగా నిలువదని, శాంతిభద్రతల పరిరక్షణధ్యేయంగా పనిచేస్తుందని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో అడిషనల్ డిసిపి(లాఅండ్ఆర్డర్)ఎస్ శ్రీనివాస్, ఎసిపి పి అశోక్, ఇన్స్‌పెక్టర్లు తుల శ్రీనివాసరావు, దేవారెడ్డి, విజయ్‌కుమార్‌లతోపాటుగా ముస్లింపెద్దలు మౌలానాసదీమొద్దీన్, అబ్బాస్‌షమీ,ఎంఎ రఫీక్,ముజాహిద్‌లతోపాటు 100మంది

# టోల్‌గేట్ వద్ద అదుపు తప్పిన లారీ

మెదక్,జూలై23(ఆర్ఎన్ఎ): అతివేగంగా వచ్చిన లారీ వేగ నియంత్రణ చేయలేక టోల్‌గేట్ కేబిన్‌పైకి దూసుకెళ్లిన ఘటన మంగళవారం వేకువజామున చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..జిల్లాలోని తూప్రాన్ మండలం అల్లాపూర్ శివారులో 44వ జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఓ లారీ అల్లాపూర్ టోల్‌గేట్‌వద్దకు రాగానే అతివేగంగా వచ్చి వేగనియంత్రణ చేయలేక టోల్ బూత్‌పైకి దూసుకెళ్లింది. అప్రమత్తమైన సిబ్బంది బూత్ నుంచి తప్పించుకోవడంతో పెను ప్రమాదమే తప్పింది. గతంలోనూ ఇదే ప్రాంతంలో ఇదే తరహాలో ప్రమాదం చోటు చేసుకున్నట్లు సిబ్బంది చెబుతున్నారు.

## సెంట్రల్ వర్సిటీలో

# విద్యార్థిని అనుమానాస్పద మృతి

హైదరాబాద్,జూలై23(ఆర్ఎన్ఎ): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటిలో అనుమానస్పద స్థితిలో ఓ విద్యార్థిని మృతి చెందారు. హాస్టల్‌లోని బాత్రూంలో మృతి చెందిన సంఘటన సోమవారం ఉదయం చోటు చేసుకుంది. గచ్చిబౌలి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఖరగ్‌పూర్ నగరానికి చెందిన దీపిక మహాప్రాత (29) హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటిలో పీహెచ్‌డి చదువుతోంది. ఈ విద్యార్థిని సోమవారం నాడు ఉదయం 8 గంటల ప్రాంతంలో బాత్రూములో అనుమానస్పద స్థితిలో పడి ఉంది. తోటి విద్యార్థులు చూసి వెంటనే కాలేజీ యాజమాన్యానికి సమాచారం అదించారు. కాలేజీ యాజమాన్యం పోలీసులకు సమాచారం అందించడంతో సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటీన సంఘటన స్థలానికి చేరుకొని ఆ విద్యార్థినిని స్థానిక ఓ ప్రైవేటు హాస్పిటల్ తరలించారు. అప్పటికే ఆమె చనిపోయిందని హాస్పిటల్ వర్గాలు నిర్ధారించారు. అయితే పోలీసులు అప్పటికే ఆమె మెడికల్ రికార్డులు, పరిశీలించి ఆమెకి మెదడుకు సంభందించిన కొన్ని వ్యాదులు ఉన్నట్లు పేర్కొన్నారు. ఆ వ్యాధుల వలన ఆమె కళ్ళు తిరిగి పోయి బాత్రూంలో మృతి చెందినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# డివైడర్‌ను ఢీకొన్న కారు: ఒకరు మృతి

సూర్యాపేట,జూలై23(ఆర్ఎన్ఎ): నేషనల్ హైవే 65పై జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సూర్యాపేట జిల్లా మునగాల మండలం ఆకుపాముల వద్ద ఎన్‌హెచ్ 65పై ... తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కారులో మొత్తం ఐదుగురు ప్రయాణికులు ఉన్నారు. క్షతగాత్రులను హుటాహుటిన

సినిమా

# 'షుగర్'లో త్రిష, సిమ్రాన్..!





అందమైన భామలు నటించే చిత్రానికి తీయనైన పేరు పెడితే మరింత బలం చేకూరుతుంది. అలాంటి టైటిల్ త్రిష, సిమ్రాన్ నటించే తాజా చిత్రానికి నిర్ణయించినట్లు సమాచారం. 20 ఏళ్ల క్రితం అంటే 1999లో నటి సిమ్రాన్ నటించిన చిత్రం జోడీ. అందులో మరో అందగత్తె త్రిష ఎంట్రీ ఇచ్చింది. సిమ్రాన్‌కు స్నేహితురాలిగా చిన్న పాత్రలో కనిపించి మాయం అయింది. ఆ తరువాత త్రిష హీరోయిన్‌గా పేరుతెచ్చుకుంది. నటి సిమ్రాన్ పెళ్లి చేసుకుని సంసార జీవితంలో మునిగిపోయి నటనకు దూరం అయింది. కొంత కాలం తరువాత రీఎంట్రీ ఇచ్చింది. త్రిష టాప్ హీరోయిన్‌గా రాణిస్తూనే ఉంది. అలాంటిది గత ఏడాది నటుడు రజనీకాంత్ హీరోగా నటించిన పేట చిత్రంలో త్రిష, సిమ్రాన్ ఇద్దరూ నటించారు.

అయితే అందులో ఇద్దరూ కలిసి నటించే సన్నివేశాలు చోటు చేసుకోలేదు. కాగా తాజాగా త్రిష, సిమ్రాన్ కలిసి ఒక చిత్రంలో నటిస్తున్నారు. ఇందులో ఇద్దరూ అక్కాచెల్లెళ్లుగా నటించడం విశేషం. దీనికి సుమంత్ రాధాకృష్ణన్ దర్శకత్వం విహిస్తున్నారు. ఈయన ఇంతకు ముందు చదురం 2 అనే చిత్రాన్ని తెరకెక్కించారన్నది గమనార్హం. ఇతర ప్రాత్రల్లో అభినయ్ వడ్డి , తెలుగు నటుడు జగపతిబాబు, సతీశ్ తదితరులు నటిస్తున్నారు. దీన్ని ఆల్‌ఇన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తోంది. ఈ సంస్థ ఇటీవల నటుడు యోగిబాబు ప్రధాన పాత్రలో నటించిన గూర్కా చిత్రాన్ని విడుదల చేసింది. కాగా షూటింగ్ దశలో ఉన్న త్రిష, సిమ్రాన్ చిత్రానికి షుగర్ అనే టైటిల్‌ను నిర్ణయించినట్లు తెలిసింది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. కాగా చిత్ర టైటిల్ షుగర్ అయినా చిత్రం కథ మాత్రం మంచి కమర్శియల్ ఫార్ములాలో ఉంటుందట. ఇది యాక్షన్ ఎడ్వెంచర్ సన్నివేశాలతో కూడిన చిత్రం అని యూనిట్ వర్గాలు తెలిపాయి. త్రిష, సిమ్రాన్ సాహసాలతో కూడిన యాక్షన్ సన్నివేశాలను చూడడానికి రెడీగా ఉండవచ్చన్నమాట.

## సంగీత రీ ఎంట్రీ

'ఖడ్గం', 'శివపుత్రుడు', 'ఖుషీ ఖుషీగా', 'పెళ్ళాం ఊరెళితే', 'సంక్రాంతి' వంటి పలు చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు సంగీత. తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలైన సంగీత పెళ్లి తర్వాత తెలుగు

సినిమాలకు దూరంగా ఉండిపోయారు. అడపా దడపా తమిళ చిత్రాల్లో నటిస్తున్నారు. అయితే ఈమె త్వరలోనే తెలుగు వెండితెరపై సందడి చేయబోతున్నారట. మహేశ్ హీరోగా అనీల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'సరిలేరు నీకెవ్వరు'. ఈ సినిమాలో హీరోయిన్‌తో పాటు ఉండే ఓ కీలక పాత్రలో సంగీత నటించబోతున్నారట. ఇది సంగీతకు మంచి కమ్ బ్యాక్ మూవీ అవుతుందంటున్నాయి సినీ వర్గాలు. ఈ సినిమాలో సంగీతతో పాటు విజయశాంతి, బండ్ల గణెళీశ్ కూడా రీ ఎంట్రీ ఇస్తుండటం విశేషం. ఈ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతికి సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

# 'జాక్‌పాట్' ట్రైలర్ విడుదల






36 వయోదినిలే చిత్రంతో వెండితెరకి రీ ఎంట్రీ ఇచ్చిన జ్యోతిక సెంట్రిక్ కథా చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తున్నారు. వివాహానంతరం నటిగా రీఎంట్రీ ఇచ్చిన జ్యోతిక మగళీర్ మట్టుం, కాట్రిన్ మొళి చిత్రాలతో అలరించింది. తాజాగా జ్యోతిక నటిస్తున్న చిత్రం జాక్‌పాట్ . గులేభకావళి వంటి సక్సెస్‌ఫుల్ చిత్రాన్ని తెరకెక్కించిన కల్యాణ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని జ్యోతిక భర్త, నటుడు సూర్య తన 2డీ ఎంటర్‌టెయిన్‌మెంట్ పతాకంపై నిర్మిస్తున్నారు. ఇందులో నటి రేవతి ముఖ్య పాత్రలో నటిస్తుండటం విశేషం. పోలీస్ ఇతివృత్తంతో తెరకెక్కిన ఈ చిత్రంలో నటుడు యోగిబాబు, మొట్ట రాజేంద్రన్, ఆనంద్‌రాజ్, మన్సూర్‌అలీఖాన్, జగన్ తదితరులు ముఖ్య పాత్రల్లో నటించారు. ఆనందకుమార్ ఛాయాగ్రహణం అందిస్తున్నారు. విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్నారు. జాక్‌పాట్ చిత్రం ఆగస్ట్2న విడుదల కానుంది. తాజాగా చిత్ర ట్రైలర్ విడుదల చేశారు. ఇందులో కామెడీ సన్నివేశాలతో పాటు యాక్షన్ సన్నివేశాలు ఆకట్టు కునేలా ఉన్నాయి. పోలీస్ ఆఫీసర్స్‌గా జ్యోతిక, రేవతి అలరించారు. జ్యోతిక తన మరిది కార్తీతో ప్రస్తుతం ఓ చిత్రం చేస్తుంది. జీతూ జోసెఫ్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. ఇక తన భర్త సూర్య సొంత నిర్మాణ సంస్థలో మరో సినిమా ఓకే చేసింది జ్యోతిక . 2డీ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలో 'పొన్‌మగల్ వందాల్' అనే టైటిల్‌తో తెరకెక్క నున్న ఈ చిత్రంలో జ్యోతిక ప్రధాన పాత్ర పోషిస్తుంది. సీనియర్ దర్శక నటులు భాగ్యరాజ్, పాండియరాజన్, పార్తిబన్‌లు ముఖ్య పాత్రలు పోషిస్తుండటం విశేషం. ప్రతాప్ పోతన్ కీలకపాత్రలో కనిపించనున్నారు

# ఆర్ఆర్ఆర్‌లో ఎన్టీఆర్ సరసన అమెరికన్ బ్యూటీ ..!

ఎన్టీఆర్, రామ్ చరణ్ ప్రధాన పాత్రలలో రాజమౌళి తెరకెక్కిస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ ఆర్ఆర్ఆర్. ఈ చిత్రంలో ఎన్టీఆర్ కొమురం భీమ్ పాత్రలో కనిపించనుండగా, రామ్ చరణ్ అల్లూరి సీతారామరాజు గెటప్‌లో కనిపించనున్నాడు. స్వాతంత్య సమర యోధులు అల్లూరి సీతారామరాజు, కొమరం భీం జీవిత చరిత్రలను బేస్ చేసుకొని రాజమౌళి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. ఇందులో కథానాయికలుగా అలియా భట్, డైసీ ఎడ్గార్ జోన్స్‌ని ఎంచుకున్నాడు జక్కన్న. అయితే 'కొన్ని అనివార్య కారణాల వల్ల డైసీ ఎడ్గర్ జోన్స్ ఈ చిత్రంలో చేయడం లేదు. ఆమెకు మంచి భవిష్యత్తు ఉండాలని కోరుకుంటున్నాము.. ' అంటూ ఆర్ఆర్ఆర్ టీమ్ కొద్ది రోజుల క్రితం తమ ట్విట్టర్ ద్వారా తెలిపింది. దీంతో ఎన్టీఆర్ సరసన ఎవరు నటిస్తారు అనే దానిపై పలు ఊహాగానాలు చెలరేగుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం అమెరికన్ నటి ఎమ్మా రోబర్ట్స్‌ని ఎన్టీఆర్ సరసన కథానాయికగా ఎంపిక చేసినట్టు తెలుస్తుంది. దీనిపై అతి త్వరలోనే క్లారిటీ రానుంది. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్‌పై దానయ్య నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని జూలై 30,2020న విడుదల చేయనున్నారు.

# స.హ చట్టాన్ని.. మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుంది

**- చట్టం ప్రతిపత్తిని దెబ్బతీయడమే లక్ష్యంగా పావులు కదుపుతోంది**

**- కేంద్రంతీరుపై ఆందోళన వ్యక్తం చేసిన సోనియాగాంధీ**

న్యూఢిల్లీ, జులై23(ఆర్ఎన్ఎ) : సమాచార హక్కు చట్టాన్ని మోదీ సర్కార్ నిర్వీర్యం చేయాలని చూస్తోందని కాంగ్రెస్ నేత, యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ ఆరోపించారు. ఈమేరకు మంగళవారం ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. చట్టం ప్రతిపత్తిని దెబ్బతీయడమే లక్ష్యంగా కేంద్రం పావులు కదుపుతోందని విమర్శించారు. పదేళ్లలో 60లక్షల మంది సమాచారహక్కు(స.హ) చట్టాన్ని వినియోగించుకున్నారని గుర్తుచేశారు. భాజపా ప్రభుత్వం తీసుకుంటున్న అసంబద్ధ నిర్ణయాల వల్ల చట్టం పూర్తిగా అంతరించిపోయే ప్రమాదం ఉందన్నారు. సమాచార హక్కు చట్టం-2005ని సుదీర్ఘ చర్చలు, విస్తృత సంప్రదింపులతో రూపొందించామని వివరించారు. దీని ద్వారా ప్రభుత్వంలో పారదర్శకత, జవాబుదారీతనం పెరిగిందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం సమాచార హక్కు చట్టాన్ని ఒక వీడగా భావిస్తోందని సోనియా ఆరోపించారు. కేంద్ర ఎన్నికల సంఘం, కేంద్ర విజిలెన్స్ కమిషన్‌తో సమాన హోదా కల్పించిన సమాచార హక్కు కమిషనర్ విధుల్ని భాజపా ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. సంఖ్యాబలం ఉండడంతో భాజపా దీన్ని ఎలాగైనా సాధించాలని చూస్తోందన్నారు. ఈ క్రమంలో పౌరుల హక్కుల్ని హరిస్తున్నారన్న విషయాన్ని మరిచిపోతున్నారన్నారు. సమాచార కమిషనర్లకు ప్రస్తుతం ఎన్నికల సంఘం కమిషనర్లతో సమానమైన హోదా ఉండగా దాన్ని తగ్గిస్తూ ప్రభుత్వం సవరణలను ప్రతిపాదించింది. వారి జీతభత్యాలు, సర్వీసు నిబంధనలను కేంద్ర ప్రభుత్వం విడిగా రూపొందించనుంది. ఈ సవరణలను ప్రతిపక్షాలు వ్యతిరేకించాయి. సమాచార కమిషన్‌ను కోరల్లేని పులిలా మార్చడానికే సవరణల బిల్లును ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించాయి. విపక్షాల విమర్శల మధ్య సమాచార హక్కు చట్టానికి చేసిన సవరణలను సోమవారం లోక్‌సభ ఆమోదించిన విషయం తెలిసిందే.

# ట్రంప్ వ్యాఖ్యలపై మోదీ నోరువిప్పాలి

**- ట్విట్టర్‌లో రాహుల్ గాంధీ**

న్యూఢిల్లీ, జులై23(ఆర్ఎన్ఎ) : కశ్మీర్ అంశంపై మధ్యవర్తిత్వం చేయమని ప్రధాని నరేంద్ర మోదీ తనను కోరినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతున్నాయి. దానిపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మంగళవారం ట్విటర్ వేదికగా స్పంది స్తూ..' అసలేం జరిగిందో మోదీ దేశ ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. కశ్మీర్ అంశం మీద భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య మధ్యవర్తిత్వం చేయాలని ప్రధాని మోదీ కోరినట్లు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఇదేగనుక నిజం అయితే భారత దేశ ప్రయోజనాలను, 1972 సిమ్లా ఒప్పందాన్ని మోదీ కాలరాని నట్లేనని అన్నారు. ట్రంప్‌తో సమావేశంలో ఏం చర్చించారో దేశ ప్రజలకు ప్రధాని తప్పకుండా బయటపెట్టాలని రాహుల్ ట్వీట్ చేశారు. ట్రంప్ వ్యాఖ్యలపై ప్రధాని సమాధానం చెప్పాలని, వారి భేటీలకు సంబంధించిన దస్త్రాలను బహిర్గతం చేయాలని పార్లమెంటులో కాంగ్రెస్, ఇతర విపక్షాలు డిమాండ్ చేశాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పినట్లుగా కశ్మీర్ అంశంలో మధ్యవర్తిత్వం వహించాలని ప్రధాని మోదీ ఆయన్ను కోరలేదని విదేశాంగ మంత్రి ఎస్.జయశంకర్ రాజ్యసభలో స్పష్టం చేశారు. అలాగే పాకిస్థాన్‌తో ఉన్న వివాదాల న్నిం టినీ.. ద్వైపాక్షిక చర్చల ద్వారానే పరిష్కరిస్తామని తేల్చి చెప్పారు.

# కొత్త పురపాలక చట్టంపై గవర్నర్ అభ్యంతరం

## పలు అంశాలపై ప్రభుత్వానికి కొర్రీలు

## గవర్నర్ సూచనలతో తాజాగా ప్రభుత్వం ఆర్డినెన్స్

హైదరాబాద్,జూలై23(ఆర్ఎన్ఎ): తెలంగాణ నూతన పురపాలక చట్టానికి సంబంధించిన బిల్లులోని కొన్ని అంశాలపై గవర్నర్ నరసింహన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో బిల్లుకు ఆయన ఆమోదం లభించలేదు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అంశాలపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేయడంతో.. గవర్నర్ సూచించిన అంశాలతో ప్రభుత్వం తాజాగా ఆర్డినెన్స్ జారీ చేసింది. గవర్నర్ కొన్ని అంశాలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కొర్రీలు వేశారు. కొత్త పురపాలక చట్టం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బిల్లు తీసుకువచ్చింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో శాసనసభ, మండలి ఆమోదం కూడా పొందింది. వాస్తవానికి ఆ మరుసటి రోజే గవర్నర్ ఆమోదం పొంది కొత్త చట్టం అమల్లోకి రావాల్సి ఉంది. కానీ, ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వానికే పూర్తి స్థాయి అధికారాలు ఉండటం పట్ల నరసింహన్ అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా సదరు బిల్లుకు ఆయన మరికొన్ని సూచనలు చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో గవర్నర్ సూచించిన అంశాలతో రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసింది.

ఈ బిల్లును ఆమోదించవద్దంటూ దత్తాత్రేయ నేతృత్వంలో బిజెపి నేతలు గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. తెలంగాణ మున్సిపాలిటీ చట్టం -2019పై చర్చ సందర్భంగా సీఎం కెసిఆర్ మాట్లాడుతూ.. పని చేయని సర్పంచ్‌లు, చైర్‌పర్సన్‌లు, వార్డు మెంబర్లు, కౌన్సిలర్లపై చర్యలు తీసుకునేలా కలెక్టర్లకు అధికారం దఖలు చేశారు. కలెక్టర్ తీసుకున్న చర్యలపై స్టే ఇచ్చే అధికారం మంత్రి నుంచి తొలగించారు. . సర్పంచ్‌ను తొలగించే అధికారం కలెక్టర్‌కు మాత్రమే ఉండేలా చట్టం రూపొందించారు. సవరించిన తెలంగాణ మున్సిపల్ చట్టం -2019 బిల్లును శాసనసభ గత శుక్రవారం ఆమోదించింది. ఈ బిల్లును ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం సభలో ప్రవేశపెట్టగా శుక్రవారం సభలో బిల్లుపై సుదీర్ఘంగా చర్చ జరిగింది. చర్చ జరిగిన అనంతరం తెలంగాణ మున్సిపల్ చట్టం -2019 బిల్లును సభ ఆమోదించింది. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. మున్సిపల్ చట్టంపై సలహాలు, సూచనలు ఇచ్చిన సభ్యులకు ధన్యవాదాలు. జనాభా దామాషా ప్రకారమే రిజర్వేషన్లు ఖరారు చేస్తాం అని అన్నారు. సమయానికి అనుకూలంగా చట్టంలో మార్పులు, చేర్పులు చేయకపోతే భవిష్యత్ తరాలు నష్టపోతాయన్నారు. కలెక్టర్‌కు అధికారాలు అంశంపై కాంగ్రెస్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేసారు. జిల్లా కలెక్టర్‌కు అధికారాలు ఇవ్వొద్దని అభ్యంతరం లేవనెత్తింది. కలెక్టర్‌కు కొత్తగా ఇచ్చిన అధికారం కాదు.. ముందునుంచీ ఉంది. సర్పంచ్‌ల విషయంలో మంత్రికి స్టే ఇచ్చే అధికారాన్ని తొలగిస్తే తప్పేంటి?అని సిఎం కెసిఆర్ వివరణ ఇచ్చారు. అయితే పలు అంవాలను పరిశీలించిన గవర్నర్ తిప్పిపంపడంతో ఇప్పుడు ఆర్డినెన్స్ తీసుకుని వచ్చారు. హైకోర్టు కూడా మున్సిపల్ ఎన్నికలపై తొందరేల అంటూ ప్రశ్నించింది. ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వానికే పూర్తి స్థాయి అధికారాలు ఉండటం పట్ల నరసింహన్ అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. బిల్లుకు ఆయన మరికొన్ని సూచనలు చేసినట్లు సమాచారం. ఈ క్రమంలోనే గవర్నర్ సూచించిన అంశాలతో రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసింది.

# అమిత్ షాతో.. మాజీ ఎంపీ వివేక్ భేటీ

**- సచివాలయం కూల్చివేతను అడ్డుకోవాలని వినతి**

**- త్వరలో బీజేపీలో చేరనున్న వివేక్?**

న్యూఢిల్లీ, జులై23(ఆర్ఎన్ఎ) : తెలంగాణ రాష్ట్రం పెద్దపల్లి మాజీ ఎంపీ వివేక్ మంగళవారం బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో భేటీ అయ్యారు. తెలంగాణలో టీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దమొత్తంలో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తుందని అమిత్ షాకు ఫిర్యాదు చేశారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఏకపక్షంగా పాలన సాగిస్తుందని, ప్రతిపక్షాలన్నీ, ప్రజలంతా వ్యతిరేకిస్తున్నా సచివాలయాన్ని కూల్చివేయాలని చూస్తున్నారని వివేక్ అన్నారు. సచివాలయం కూల్చివేతను అడ్డుకోవాలని అమిత్ షాను ఆయన కోరారు. కొంతకాలంగా వివేక్ బీజేపీలో చేరతారనే ప్రచారం సాగుతోంది. ఈ క్రమంలో వీరిద్దరి భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. బీజేపీలో చేరికపైనే వివేక్, అమిత్ షా తో చర్చించినట్లు తెలుస్తోంది. ఆషాఢమాసం ముగిసిన తర్వాత వివేక్ బీజేపీలో చేరనున్నారని తెలుస్తోంది. వివేక్ వెంట ఆయన కుమారుడు వంశీ కూడా ఉన్నారు. వివేక్ బీజేపీలో జాయిన్ అవ్వటంతోపాటు.. ఆయన కుమారుడి పొలిటికల్ ఎంట్రీకి కూడా లైన్ క్లియర్ చేస్తున్నట్లు తెలుస్తోంది. వివేక్ ఎన్నికల్లో పోటీ చేసిన సమయంలో.. ప్రచార బాధ్యతలతోపాటు ఇతర వ్యవహారాలను తెరవెనక ఉండి చూసుకునేవారు. బీజేపీలోకి కొడుకుతోపాటు జాయిన్ కావాలని డిసైడ్ అయినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే అమిత్ షాతో భేటీకి కుమారుడు వంశీని కూడా తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఆపరేషన్ ఆకర్ష్ పేరుతో బీజేపీ చేపట్టిన కార్యక్రమంలో ఇప్పటికే పలువురు నేతలు బీజేపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. ఆషాఢం ముగిసిన తర్వాత వారంతా పార్టీలో చేరతారని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. దీన్ని బట్టి చూస్తుంటే ఆషాఢం ముగిసిన తర్వాత రెండు తెలుగు రాష్ట్రాల్లో నుంచి బీజేపీలోకి భారీగా వలసలు ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది.

# వివాహేతర సంబంధంతో భర్త హత్య

**తల్లిని ఉరితీయాలంటూ పిల్లల ఫిర్యాదు**

చండీఘడ్,జూలై23 (ఆంఎన్ఎ): వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్న భర్తను భార్య హత్య చేసింది. అనంతరం ఇద్దరు పిల్లలను తన తండ్రి వద్ద విడిచిపెట్టిన ఆ మహిళ.. ప్రియుడితో వెళ్లిపోయింది. మా నాన్నను చంపిన అమ్మను ఉరితీయాలని ఆమె ఇద్దరు పిల్లలు డిమాండ్ చేస్తున్నారు. ఈ సంఘటన పంజాబ్‌లోని తర్న్ తరణ్ గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకోగా ఆలస్యంగా వెలుగు చూసింది. రాజ్‌ప్రీత్ సింగ్, సిమ్రాన్ కౌర్‌కు 12 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే గత కొంత కాలం నుంచి సిమ్రాన్.. లవ్‌ప్రీత్ సింగ్‌తో వివాహేతర సంబంధం కొనసాగిస్తుంది. ఈ విషయంలో పలుమార్లు రాజ్‌ప్రీత్, సిమ్రాన్ మధ్య గొడవలు చోటు చేసుకున్నాయి. ఈ వివాహేతర సంబంధాన్ని అడ్డుకునేందుకు సిమ్రాన్ తల్లిదండ్రులు కూడా ప్రయత్నించారు. పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకోవాలని సిమ్రాన్‌కు సూచించినప్పటికీ ఆమె ప్రవర్తనలో మార్పు రాలేదు. మొత్తానికి ఆదివారం రాత్రి రాజ్‌ప్రీత్‌కు ఆహారంలో విషమిచ్చింది. అయితే అతను కొనఊపిరితో ఉండడంతో ఉరేసి చంపేసింది. ఆ తర్వాత ఇద్దరు పిల్లలను తీసుకొని తన తండ్రి వద్దకు వెళ్లి అక్కడి విడిచిపెట్టింది. అనంతరం తన ప్రియుడితో కలిసి సిమ్రాన్ వెళ్లిపోయింది. ఇక జరిగిన విషయాన్ని ఆ ఇద్దరు పిల్లలు తన తాతకు చెప్పారు. నాన్నను ఉరేసి చంపిందని, అమ్మపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆ పిల్లలు డిమాండ్ చేశారు.

# చార్మినార్ భాగ్యలక్ష్మి దేవాలయం సందర్శన

**- తెలంగాణ బీసీ కమిషన్ ఛైర్మన్ బి.ఎస్. రాములు,**

**- సభ్యులు డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు**

హైదరాబాద్, జులై 23:ఆషాఢమాసంలో నగరమంతటా అంగరంగ వైభవంగా నిర్వహించుకునే భోనాల ఉత్సవాలలో భాగంగా మంగళవారంనాడు చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకొని బి.ఎస్.రాములు, డాక్టర్ వకుళాభరణంలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దేవాలయానికి వారి రాక సందర్భంగా చార్మినార్ పోలీస్‌స్టేషన్ సీఐ ఆర్. బుచ్చయ్య, ఎస్ఐ బి. రమేశ్‌లు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ కమిటి మేనేజింగ్ ట్రస్టీ శ్రీమతి శశికళ వారిని సాదరంగా ఆహ్వానించి పూజకు కావాల్సిన ఏర్పాట్లను చేశారు. అనంతరం వారికి అమ్మవారి దుశ్శాలువలు, పూల మాలలు వేసి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా బి.ఎస్.రాములు, డాక్టర్ వకుళాభరణంలు మాట్లాడుతూ... నగరం లో భోనాలకు సాంస్కృతికంగా, సనాతనంగా ఒక విశిష్టత ఉందన్నారు. వందల ఏండ్ల హైదరాబాద్ చరిత్రలో గంగా, యమునా సంగమంగా నగరం లోని అన్ని ప్రాంతాల ప్రజలు సోదరభావంతో కలిసి మెలిసి జీవించడం ఇక్కడి ప్రత్యేకత అన్నారు. అమ్మవారి వద్ద ఒక ఆనవాయితీగా వస్తుందన్నారు. రాష్ట్రం అన్ని రంగాలలో ప్రథమ స్థానంతో ముందుకు సాగాలని, తెలంగాణ ప్రభుత్వానికి మరింత శక్తిని ఇవ్వాలని, ఎలాంటి అడ్డంకులు ఏర్పడకుండా చూడాలని అమ్మవారిని మొక్కుకున్నట్లు భోనాల ఉత్సవాన్ని జరుపుకోవడం వారు వివరించారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com